
ఆంధ్రపత్రిక
సచిత్రవారపత్రిక
20 - 12 - 50
నాలుగు అణాలు

విషయానుక్రమణిక

20 డిశంబరు 1950


వ్యాసాలు:

కథలు:

సినిమా:

బొమ్మరిల్లు:

గేయం:





ఆంధ్రపత్రిక

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును


Founder: K. NAGESWARA RAO

సంపుటము **43**
సంచిక **15**

విక్రుతి సంవత్సర మార్గశిర శుద్ధ ఏకాదశి బుధవారము



డిసెంబర్ 15 వ తేదీ ఉదయం 9.37 గంటలకు సర్దార్ వల్లభ్భాయ్. జె. పటేల్ కాలధర్మం చెందారు.



పటేల్ కుటుంబం కుమారుడు, కోడలు, మనుమలు, కుమార్తె, కార్యదర్శి శంకర్.


కర్మ వీరుడు
సర్దార్ పటేల్

★

భారతజాతీయ స్వాతంత్ర్యోద్యమానికి తెన్ను చూపినది గాంధిమహాత్ముడైతే, జీవం పోసినది సర్దార్ పటేల్; మెరుగులు దిద్దినవాడు పండిట్ నెహ్రూ. భారత దేశానికి రాజకీయ స్వాతంత్ర్యాన్ని ప్రసాదించినది గాంధిమహాత్ముడైతే, స్వతంత్ర భారత రిపబ్లిక్ రాజ్యాంగ వ్యవహారాల్ని ఉత్తమనీతి పథంలో నడుపుతున్నవాడు నెహ్రూ; స్వాతంత్ర్యాన్ని సుస్థిరపరిచి నూతికావాతం సంభవించ



బార్డోలీ సత్యాగ్రహ వీరునికి గాంధీ దంపతుల ప్రశంస.



1948 లో అదృష్టవశంవల్ల విమాన ప్రమాదంనుంచి తప్పించుకొన్న పటేల్‌కు పండిట్ నెహ్రూ ప్రభృతులు విమాన ప్రతిమ బహూకరించారు.

అయింది. మీ సమరం మీ కష్టఫలాన్ని మీకు దక్కింప చేస్తుంది.

“కష్టాలుపడ్డం మీకు కొత్త కాదు. ప్రకృతి సూత్రాల్ని మరువకండి. కొన్ని విత్తనాలు నాశనమైతేగాని కొన్ని మొలకలెత్తవు. కాని జాతి ఎన్నడూ నశించదు. పునర్జన్మ అనేది తథ్యం. మీకష్టాలు మీకు తప్పడంలేదు. కృషికునికంటె ఎండ వానలకోర్చి అధికంగా శ్రమించే వారు వేరెవరున్నారు? దోమలబాధ చీదర బ్రతుకు మీకంటె అధికంగా ఎవరనుభవిస్తున్నారు? ప్రభుత్వం మీ కింతకంటె తెచ్చిపెట్టగల కష్టాలేమున్నాయి? అన్నిటినీ చిరునవ్వుతో సహించగల యోధులింకెవరున్నారు?

“జప్తులకు, గిప్తులకు భయంచెందడం అనవసరం. భయమనేదానిని విదలించండి. మీరు మనుష్యులు. దుర్బలులుకారు. మీ కష్టం వల్ల లభించే ఫలాన్ని అందుకోడానికి కనిపెట్టుకుని కూచునేవారు దుర్బలులు. పొలాలలో కష్టించడానికి కావలసిన బలం మీలో ఉంది. మీజీవితభారాన్ని మోయగలశక్తి, ఇతరుల భారాన్ని మోయగల శక్తి మీకే ఉంది. మిమ్మల్ని దుర్బలులని ఎవరంటారు?

“మీ కెందుకు భయం? భయపడవలసినది ప్రభుత్వం. పాలితుల సమ్మతిలేనిదే నాగరికమైన ఏప్రభుత్వమూ పాలించలేదు. ఈ నాటికీ ఇంకా వాళ్లు పరిపాలించగలుగుతున్నారంటే కారణం మీ కళ్లకు గంతలు కట్టగలగడమే. మీరు శాంతిగా సకల భోగాలూ అనుభవిస్తున్నారని మిమ్మల్ని నమ్మించి మోసగించ గలుగుతున్నారు కాబట్టి వారింకా పాలించగలుగుతున్నారు. కానివాస్తవానికి ఇప్పుడు శాంతిలేదు. భీతిపరులీనాడు పరిపాలన సాగిస్తున్నారు. అధర్మాన్నీ, అసత్యాన్నీ గుర్తించే సమర్థత మీకిప్పుడు లేదు. గుర్తించలేక పోవడం, సహించడం పిరికితనం.”

బార్డోలీ ఉద్యమాన్ని విఫలమొందించడానికి ప్రభుత్వం వెయ్యి ఉపాయాలు పన్నింది. కాని అన్నిటినీ కనిపెట్టి జాగ్రత్తపడే సమర్థతను ప్రజలకు పటేల్ నేర్పిపెట్టాడు. ప్రజానీకంలో చైతన్యం తెచ్చి ఉద్యమానికై లోపరహితంగా ఇంతగా సంఘటితపరిచి, ఉద్యమాన్ని వెయ్యి కళ్లతో కనిపెట్టి కాపాడుతూ సంపూర్ణ విజయం సాధించగలిగిన మహానాయకుడు గాంధీ తరువాత పటేల్ తప్ప మరొకడు లేడు.

నెహ్రూ, పటేల్ : ఈ ఇద్దరి మైత్రికీ సంబంధించిన విచిత్రవిషయం ఒకటున్నది. గాంధీమహాత్ముని నీడలో తుదివరకు సహోదరులవలె మెలగిన ఈయిద్దరూ ప్రకృతితః విపర్యయులు. ఒకరిది ఉద్వేగ ప్రకృతి, మరొకరిది గంభీరప్రకృతి. ఒకరిహృదయం తరంగతాడిత విశాల సాగర తలం, మరొకరిహృదయం సాగర గంభీరం. ప్రకృతివ్యత్యాసంవల్ల భావగతిలో, దృష్టిలో వ్యత్యాసాలు ఏర్పడినాయి. అభిప్రాయభేదాలు సంభవించినాయి. కాని ఒకరి నొకరు చక్కగా అర్థం చేసుకొన్నవారు. ఇరువురి మధ్యనూ ఏర్పడిన అభిప్రాయభేదాలు ఇరువురిమధ్యనూ మైత్రికీ, సహకారానికీ, సాహచర్యానికీ ఆటంకం కలిగించలేదు. ఎంత అభిప్రాయభేదాలు ఏర్పడినా అవి వారి కర్తవ్య నిర్వహణకు నిరోధం కాలేదు. పరస్పర సహనం వారిలో ఉంది. ఒక నిర్ణయానికివస్తే విశుద్ధ మనస్కులై అనుసరించే దీక్ష ఉన్నది. వారి అభిప్రాయభేదాలు వారి కేమాత్రం నష్టం కలిగించలేదు. మనోవ్యధకలిగించలేదు.

ఒకరికొకరు అండయై నిలిచి కష్టాల నెదుర్కొన్నారు. ఇట్టి అపూర్వ సాహచర్యం అట్టి విశుద్ధవర్తనులకే సాధ్యమయింది. అది అన్యనాయకులలో వైరాలకు

సర్దార్ పటేల్ జీవితంలో ముఖ్యఘట్టాలు

1875	అక్టోబరు 31	జననం
1916		గాంధీజీతో పరిచయం
1918		ఖైరా సత్యాగ్రహం
1923		నాగపూర్ పతాక సత్యాగ్రహం
1928		బార్డోలీ సత్యాగ్రహం
1931		కరాచీ కాంగ్రెస్ అధ్యక్షత
,,		కారాగారయాత్ర
1934		విడుదల
1942		అహమ్మద్ నగర్ కోటలో కారాగారవాసం
1946	సెప్టెంబరు 2	కేంద్రప్రభుత్వ కార్యవర్గ సభ్యత్వం
1947	ఆగస్టు 15	ఉపప్రధానమంత్రి పదవీస్వీకారం
1948		రాజస్థాన్ సంస్థానకూటమి సంస్థాపన
,,		హైదరాబాద్‌పై పోలీసు చర్యకు ఉత్తరువు
,,		సంస్థాన విలీనీకరణ కార్యక్రమ సంపూర్తి
1950	డిసెంబరు 15	కాలధర్మం.

గలిగేవాడు పటేల్. పరేంగితజ్ఞానం అనేకులకు దిగ్భ్రమ కలిగించింది. పటేల్ కళ్లలో చూసి ధైర్యంగా వాదించడం ఎంతటి నాయకునికైనా అసాధ్యమైనపని. మైత్రికైనా వైరానికైనా పటేల్ వంటి వ్యక్తి మరొకడు లేడని ఒక నాయకుడన్నాడు.

ఇట్టి దృఢసంకల్పుడు, ఆత్మబలసంపన్నుడు కాక భారతరాజకీయ స్వాతంత్ర్య సుస్థిరస్థాపన కర్తవ్యానికి తగినవ్యక్తి మరెవరున్నారు? బ్రిటిష్ రాజకీయ దుస్తంత్రజ్ఞుల మోసంవల్ల స్వాతంత్ర్యలబ్ధితో పాటు దేశం రాజకీయంగా అయిదువందల చెక్కముక్కలై చివికిపోగల ప్రమాద మేర్పడినప్పుడు, సామ దాన భేద దండోపాయాలు ప్రయోగించి దేశాన్ని కాపాడినవాడు పటేల్.

భారత దేశచరిత్రలో ఏ చక్రవర్తీ సాధించజాలకపోయిన అద్భుతకార్యాన్ని సాధించాడు. సంస్థానాలన్నిటినీ ఏకైకాధిపత్యంకిందకు తెచ్చి భారతరాజ్యాంగానికి సౌష్ఠవస్వరూపం చేకూర్చిన పటేల్‌ను చరిత్ర ఎన్నడూ మరువదు. సంస్థానాల సమైక్యతా కార్యక్రమంలో రాజకీయధురంధరు డనిపించుకున్నాడు.

సత్యాగ్రహోద్యమంలో, పరిపాలనా సుస్థిరతలో, దేశసమైక్యతా సాధనలో పటేల్ చేసిన కృషి శాశ్వతంగా చరిత్రస్థమయింది. భారత జాతికి ఆత్మబలాన్ని కూర్చిపెట్టిన పటేల్‌ను భారత చరిత్ర ఎన్నడూ మరువదు.


(45-వ పేజీ చూడండి)

ఆధారమైతే, అది వారి దోషం కాదు.

వాక్శక్తిని శతఘ్నిగా ప్రయోగించిన పటేల్ వంటి కార్యసాధకులు చరిత్రలో బహుకొద్దిమంది కనిపిస్తారు. చెప్పేమాటకూ చేసేచేతకూ వ్యత్యాసం కానరాని అసాధారణ వ్యక్తులలో పటేల్ ఒకడు. భారతరాజకీయ చరిత్రలో అన్యులవలెకాక పటేల్ సాధించిన కార్యాలను అణాపైసలతో లెక్కగట్టి నిరూపించవచ్చును.

ఏ విషయంలో కాని సందిగ్ధ భావమనేది ఎరుగడు. శంక, సంకోచాల నేవి మచ్చుకైనా లేవు. నిశ్చలచిత్తంతో పరీక్షించి చేసేనిర్ణయాలు అమోఘం.

"పటేల్ చెప్తే అదిజరిగితీరుతుంది దానికి తిరుగులేదు" అని నేటిరాజకీయ నాయకులు ప్రభుత్వోద్యోగులు యావన్మందీ అనుభవపూర్వకంగా చెప్పుకునే మాట. పరిష్కరించ వలసిన సమస్య ఎంత క్లిష్టమైన దైనాసరే స్థిరచిత్తంతో పరిశీలించ



నూతన రిపబ్లిక్ వ్యవస్థలో నూతన ప్రమాణ స్వీకారం.



[illegible]?’

మూలం :
ప్రేమచంద్

అనువాదం :
శ్రీ నేమాని వీరభద్రరావు

1

సాయంకాలం దీనానాథ్ యింటికి చేరుకొని తన కొక కార్యాలయంలో నెలకు ఏభైరూపాయిల వేతనం మీద ఒక వుద్యోగం దొరికిందని చెప్పగానే భార్య గౌరి ఆనందానికి మేర లేదు. భగవంతుని దయమీద పూర్తి విశ్వాసం కలిగింది. అప్పటికి సంవత్సరంనుంచి వారి సంసారస్థితి ఏమీ బాగులేదు. యింట్లో వున్న బంగారం కాస్తా అమ్ముకుని తినడం అయింది. యింటి అద్దె యివ్వమని యింటి యజమాని ఏక సతాయిస్తున్నాడు. ఎక్కడ అప్పుదొరికే అవకాశంవుంటే అక్కడ తడిమివదిలేడు. చంటివాడు పాలకోసం ఏక ఏడుస్తున్నాడు. ఒకపూట పొయిలో నిప్పువేస్తే రెండోపూట వుండడమే లేదు. అప్పులాళ్ళబాధ పడలేక దీనానాథ్ యిల్లు కదలడమంటేనే ఒక గండంగా భావించవలసి వస్తూంది. ఒక్కొక్కవేళ అరుగు దిగి సందు మళ్లకమునుపే, “ఏమయ్యా, రెండు రోజుల్లో యిస్తానని పట్టుకెళ్లేవు. రెండు నెలలైనా ముఖం కనుపించనియ్యవు. యీ వ్యవహారం ఏమీ బాగులేదు. యింక మా అవుసరాలు పిసరంతైనా గమనించినట్లు లేదు. అందుచేతే కాబోలు, శత్రువుకేనా అప్పు యియ్యవచ్చునుగాని, మిత్రునికి మాత్రం యిమ్మాటికీ యియ్యకూడ దన్నారు పెద్దలు.” అనేమాటలు దీనానాథ్‌కి వాడి బాణాల్లా తగిలి, ఎందుకీ బ్రతుకు, ఆత్మహత్య చేసుకుంటే మంచిది అనుకొనేవాడు. కాని భార్యాబిడ్డల్ని చూస్తే ఆ సాహసానికి ధైర్యం చాలకుండావుంది. గౌరి మాత్రం భగవంతుడే దయతలచి యీ కష్టాలను దూరంచేయ సహాయపడుతున్నాడు అని సంతోషపడి భర్తతో, “చూశారూ, నేను మొదటినుంచీ అంటూనే వున్నాను. భగవంతుడు అందరికష్టాలూ గట్టెక్కిస్తున్నాడు. ఒకనాడు కాకపోతే మరొకనాడైనా మనవైపుకూడా చూడకపోడు. మీకుమాత్రం యీ మాటల్లో విశ్వాసం వుండేది కాదుగాని యిప్పుడైనా, నమ్మకం

కుదిరిందా, భగవంతుని దయపట్ల?" అని అంది.

"నేను తిరిగి తిరిగి చస్తే పొందగలిగేను యీ మాత్రం పని. అంతేగాని యిందులో ఆ ఈశ్వరుని ఘనతేముంది?" అని దీనానాథ్ అన్నాడేగాని, మనస్సు మాత్రం ఈశ్వరునివేపు యించుక మొగ్గక పోలేదు.

9

దీనానాథ్ యజమాని ఏభైఏండ్లవాడు. అయినా కార్యాలయంలో అందరికన్నా ఎక్కువపని చక్కబెడతాడు. ఎవ్వరూ కూడా ఒక్క నిమిషమైనా ఆలస్యంగా రావడంగాని, ఒక్క నిమిషమైనా ముందుగా వెళ్ళిపోవడంగాని చేయకూడదు. మధ్యలో 15నిమిషాల కాలంవిశ్రాంతి. ఆ సమయంలో ఎవరి కేమి యిష్టమో ఆ పని పూర్తిచేసుకు రావచ్చు. యింతకుతప్ప ఒక్క నిమిషమైనా వృధాచెయ్యడానికి వీల్లేదు. జీతం కూడా ఒకటవ తేదీకే అందరికీ ముడుతుంది. పండుగ సమయాల్లో కార్యాలయానికి శలవే. నియమిత సమయాల్లోతప్ప, యితర సమయాల్లో ఎంతమాత్రం పని చెయ్యనక్కరలేదు. ప్రతి ఉద్యోగికి బోనస్ ముడుతుంది. ప్రావిడెంట్ఫండు పద్ధతి కూడా అమల్లోవుంది. యిన్ని సౌకర్యాలు కల్పించబడినా, ఏ ఒక్కరిలోనూ తృప్తి అనేది కనబడదు. పని కష్టమనిగాని, జీతం చాలదనిగాని ఎవ్వరూ ఫిర్యాదుచేయరు. కాని యజమాని వింత మనస్తత్వమే వారి అసంతృప్తికి కారణం. ఎంతపని చెయ్యనీ, ఎంత నేర్పరితనం కనబరచనీ, అతనిలో ఏ ఒక్కరికీ ధన్యవాదా లర్పించడంగాని, కనీసం ప్రశంసా వాక్యాలు రెండు విసరడంగాని లేదు.

సాటి వుద్యోగస్తులు, దీనానాథ్గురించి ఏ అభిప్రాయంతోవున్నా, యజమాని నుంచి మాత్రం ఏవిధమైన ఫిర్యాదూరాలేదు. ఒకవేళ యజమాని ఎక్కువ పనిచేయమని కుందలించినా, ఫలితం యింతకన్న దీనానాథ్ చూపలేడేమో కూడాను! సంవత్సరాంతానికి దీనానాధ్ అప్పులన్నీ తీర్చుకొని యింతో అంతో కూడదీసుకున్నాడు కూడాను. దీనానాధ్ యింట్లోకూడా వున్నదాంతో తృప్తిపడే మంచి అలవాటు గలవారే వున్నారుగాని, ఆ వుండేదైనా, నాగాలేకుండావుంటే చాలు వారికి. ముఖ్యవిషయమై ఒక్కరూపాయి ఖర్చు చేయవలసివచ్చినా, భార్యాభర్తలమధ్య తీవ్ర చర్చ జరగనిదే ఆ ఖర్చు మంజూరు కాదు. భార్యతరుపు ఖర్చుఅయితే భర్త, భర్త తరుపు ఖర్చుఅయితే భార్య మంజూరు చెయ్యడంలో ముఖ్యపాత్రలుగా మారుతారు. వేరొక మూడవవ్యక్తి ప్రసక్తే లేదక్కడ. ఒకనాడు భగవంతునియందు నమ్మకంలేని దీనానాథ్, యిటీవల ఒక్కసారి ఆస్తికుడై కూర్చున్నాడు. ప్రతిరోజూ సంధ్యవార్చి, గీతాపారాయణంచేస్తున్నాడు. ఒకనాడు ఒక మిత్రుడు యీశ్వరుని నిందిస్తే దీనానాథ్ "సోదరా, యింతవరకు ఈశ్వరుడున్నాడో లేడో అన్న విషయం తేలలేదనుకో. ప్రస్తుతం ఈశ్వరుడు వున్నాడు, లేడు అనే రెండుపక్షాలవారూ వున్నారు. కాని నా అభిప్రాయం ప్రకారం ఏవ్యక్తి అయినా, నాస్తికుడుగా వుండేకన్న ఆస్తికుడుగా వుంటేనే ఎక్కువలాభం పొందుతాడు. ఒకవేళ ఈశ్వరుడికి శక్తేవుంది, నాస్తికులకు నరకప్రవేశం చేయించక మానడు. ఆస్తికులకు అంటావా, ఎటు చూసినా లాభమే. ఆ భగవంతుని ధ్యానంలో యించుక సమయంకదా, వృధా అవుతుంది," అని అన్నాడు. నాస్తిక మిత్రుడు యీ వుపన్యాసంవిని ముఖం చిట్లించుకుపోయేడు. ఒకరోజున దీనానాథ్ ఆఫీసునుంచి వెళ్ళిపోయేముందు యజమాని అతనికి కబురు పంపి, ఎక్కువ గౌరవం చేస్తూ కూర్చోమని, "మీరు యీపనిలో ప్రవేశించి ఎంతకాలమైంది? సంవత్సరం పూర్తి అయిందా? అని ప్రశ్నించేసరికి దీనానాథ్ వినయంగా—

"అయ్యా లేదు, పదకొండు మాసాలు మాత్రం అయిం"దన్నాడు.

"స్థిమితంగా కూర్చోండి. యిప్పుడింటికి వెళ్ళి స్నానం కానిచేస్తారా?"

"లేదండి, స్నానంచెయ్యడం అలవాటు లేదు."

"తమలపాకులుగాని వేసుకుంటారా."

అని అడిగి, వెంటనే గంట మ్రోగించి బంట్రోతురాగానే, తమలపాకులు, మిఠాయి కొనుక్కు రమ్మనమని ఆజ్ఞాపించాడు యజమాని. దీనానాథ్కి యజమాని చూపే అవ్యాజానురాగం చూస్తే ఆశ్చర్యం వేసింది. నమస్కారంచేస్తే అందుకోనే మనస్తత్వమే లేని యజమాని, తనకు విశేషగౌరవం యివ్వడం, అంతేకాకుండా, మిఠాయి తమలపాకులు కొనుక్కురమ్మన మనడం అర్థంకాకుండావుంది దీనానాథ్కి. బహుశా అతని పనిమూసి మురిసిపోయేడేమో!! దీనానాథ్కి ఆత్మవిశ్వాసం, ఈశ్వరునియందు నమ్మకం ఒక్కసారి పెనవేసుకున్నాయి. "నిజంగా భగవంతుడు సమదృష్టిగలవాడు. న్యాయవంతుడు కాకపోతే తన్నెవరు పిలుస్తారు?" అనుకున్నాడు దీనానాథ్. మిఠాయి తమలపాకులు వచ్చేయి. దీనానాథ్ యజమాని అనుమతిమీద భయపడుతూనే తినడం ఆరంభించేడు యజమాని నవ్వుతూ అన్నాడు.

"దీనానాథ్, బహుశా నీవు కూడా నన్ను కఠినుడుగా జమకట్టి వుంటావు. విషయం ఏమిటంటే యిక్కడ పని చేస్తూన్నవాళ్ళందరికీ నా విషయంపూర్తిగా అర్థంకాలేదంటాను. యజమాని కాస్త మెత్తనివాడిలా కనబడితే ఆ మెత్తనితనం వుపయోగించుకొని లాభం పొందుదామని చూస్తారు సాధారణంగా క్రిందవాళ్లు. కొంతమంది యజమానులు క్రింద వుద్యోగస్తులతో నవ్వుతూ కబుర్లుచెప్తూనే అదుపులో వుంచుకొని పనిచేయించుకో గలుగుతారు. నిజంగా అట్టి కళగలవారు అదృష్టవంతులనే చెప్పాలి. కాని నాలోమాత్రం ఆకళ లేదు. నా క్రిందపనిచేసే వారిని దూరదూరంగానే వుంచుతూ పనిచేయించుకోనే అలవాటు నాది. యింతవరకు ఆపద్ధతి వలన నాకేమీ నష్టం కనపడలేదు. నేను అందరిని ఒక, కంటితో కనిపెడుతూనే వుంటాను. నీ విషయంలో మాత్రం నమ్మకస్తుడవని, విశ్వాసపాత్రుడవని కష్టపడి పని చేస్తావన[illegible] అభిప్రాయాలు నాలో నాటుకున్నా[illegible]. అందుచేతనే పూచీతో చేయవలసిన పనులన్నీ నీచేతనే చెయి

స్తున్నాను. అందుచేతనే నీకు జీతం హెచ్చుచేదామని ఆలోచిస్తున్నాను. నీవు యిప్పుడు ఎలాగ శ్రమపడి పనిచేస్తున్నావో అప్పుడుకూడా అలాగే చేస్తావని ఆసిస్తున్నాను." అన్నాడు యజమాని. దీనానాథ్ కండ్లవెంబడి ఆనందాశ్రువులు రాలాయి. యజమానికాళ్ల మీదపడి 'అయ్యా మీ సేవకొరకే యీ దేహాన్ని అంకితం చేస్తున్నాను.' అని అందామనుకున్నాడు. కాని కంఠం రుద్ధమైపోయి, కేవలం కృతజ్ఞతాశ్రువులు మాత్రం రాల్చగలిగేడు.

యజమాని ఒక బైండు పుస్తకం తీసి, "ఈ కార్యాలయంయొక్క భవిష్యత్తు ఏపని మీద ఆధారపడివుందో ఆపని నీకు ఒప్పగిద్దామని చూస్తున్నాను. యింతమంది వుద్యోగస్తులుండగా నీ మీదనే నాకు, పూర్తి నమ్మకం కలిగి యీపని నీకు చెప్పగలుగుతున్నాను. నా ఆశ నిరాశగా మార్చవని నమ్ముతున్నాను. యిది క్రిందటి సంవత్సరం తాలూకు లెడ్జరు. దీనిప్రకారం కంపెనీకి ఎన్నో లక్షల రూపాయిలు లాభంవచ్చినట్లు తేలుతుంది. కాని నువ్వు చూస్తూనే వున్నావు కదా! మనం అందరం కొన్ని నెలలనుంచి ఎంత కష్టపడి పని చేస్తున్నామో, యీ లెడ్జరు ఏ గుమాస్తా వ్రాశాడో అతని వ్రాత, నీ వ్రాత ఒక్కలా వుంటుంది. భేదం ఎంతమాత్రం వుండదు. నువ్వు యిందులోనుంచి ఒక్క పుట చింపి, అదే నెంబరుగల వేరొక పుటను అందులో యిమడ్చాలి. అప్పుడే ఆ నెంబరుగల పుటను అచ్చొత్తించాను. తెల్లవారేసరికి లెడ్జరు మామూలుగా తయారుచేయించే ఏర్పాటుకూడా చేశాను. యీ పనంతా రాత్రికి రాత్రే ముగిసిపోతుంది. ఒక్క పిట్టకేనా యీ విషయం తెలియదు. త్వరగా లెడ్జర్‌లో వున్న పుటలోని విషయాలు నకలు వ్రాసెయ్" అన్నాడు యజమాని. కేవలం లెడ్జర్ పుటలోని విషయాలు నకలే తియ్యడం అయితే అసలు వ్రాయడం ఎందుకు అని అన్నాడు దీనానాథ్. అందులోని విషయాలు అలాగే నకలు తియ్యడం అనుకున్నావా? కొంచెం మారుస్తాను. కేవలం కార్యాలయంయొక్క భవిష్యత్తు గురించే యీపని ఒప్పగించేనని నమ్ము. యీపని జరక్కపోతే కార్యాలయంలో ఒక వందమంది బ్రతుకులకే దెబ్బతగులుతుంది. యిందులో యిక వెనకముందులు ఆలోచించడానికి వీల్లేదు. కేవలం యీపని ఒక్క అరగంటలో పూర్తి కావాలి. నీవుచురుగ్గా వ్రాయగలవని నాకు నమ్మకం లేకపోలేదు"

దీనానాథ్‌కి ఒక విషమ సమస్య ఏర్పడింది. ఒక వలపన్నబడుతూందనేటందుకు ఏమీ సందేహంలేదు. యిందులో యిమిడియున్న రహస్యం తెలుసుకోడానికి దీనానాథ్‌కి ఆధారం ఏమీ లేదు. యజమాని తన స్వలాభానికే ఆజ్ఞాపిస్తున్నాడో లేక కార్యాలయంయొక్క భవిష్యత్తు ఆలోచించే అన్నాడో తెలుసుకోలేకుండా వున్నాడు. ఏది ఎలాగైనా యిది ఒక వలపన్నడమేగాని మరొకటి గాదు. తన ఆత్మ విధ్వంసానికి పాలుపడతాడా? ఎట్టి పరిస్థితుల్లోనూ అది వీలుపడదు.

భయపడుతూ అన్నాడు, "మీరు నన్ను క్షమించాలి. నావల్ల యీ పని కాదు."

యజమాని చంచలత్వం ఏమీ ముఖంలో కనపడనియ్యకుండా, "ఏం?" అన్నాడు.

"ఏముంది, యిది కేవలం మాయ తంత్రం కనుక."

"యిది మాయతంత్రం అని ఎవరన్నారు?"

"ఏ లెఖ్ఖలనైనా మార్చడమనేది తంత్రమే."

"అలా మార్చడంవల్ల నూరుమంది జీవితాలు బాగుపడుతూన్నప్పుడు, అది తంత్రం ఎలా అవుతుంది?" యీ మార్పు చెయ్యకపోయినట్లయితే కొన్నిలక్షల రూపాయిలు కంపెనీ చెల్లించవలసి వుంటుంది. దాని ఫలితంగా కంపెనీ దివాలాతీసి అందరూ యింటిదగ్గర కాళ్లు ముడుచుకు కూర్చోవలసివస్తుంది. యింతమంది బీదవాళ్ల కడుపుమీద కొట్టడం నాకు యిష్టంలేదు. పరోపకారం జరుగుతుందంటే, కొంత తంత్రం చేసి తీరాలి. అంతమాత్రంచేత ఆత్మవిధ్వంసం కానేరదు."

దీనానాథ్‌కి ఏమీ తోచలేదు. యజమాని చెప్పినట్లు, యీ మార్పుచేసినందువల్ల వందమంది బ్రతుకులు నిలబడగలవూ అన్న విషయం నిజమైతే యీపని తంత్రం క్రింద రానేరాదు. కేవలం కర్తవ్యమనే భావించాలి. వందమందికి ఉపకారంకోసం ఆత్మవిధ్వంసమైనా నష్టం లేదు. కాని నైతికంగా సమాధానపడినతరువాత, ఆధ్యాత్మికంగా తనమాట ఏమిటన్న ఆలోచన బయలుదేరింది దీనానాథ్‌కి.

"యీ విషయం ఎక్కడైనా పైకి పొక్కిందంటే తన నాశనం తప్పదని" యజమానితో అన్నాడు దీనానాథ్. యజమాని తొందరగా అన్నాడు, "విషయం పైకి పొక్కిందంటే నిన్ను ఖైదు చెయ్యరు, నన్ను చేస్తారు. నీకేం? నే నా మార్పు చెయ్యలేదని ఘంటాపథంగా చెప్తావు."

"వ్రాత ఆనవాలుపడితే?"

"ఎక్కడ గుర్తుపట్టగలరయ్యా ఏ పుట మార్చేమో?"

దీనానాథ్‌కి నకలు వ్రాయక తప్పింది కాదు.

4

తిరిగి దీనానాథ్ మనస్సులో అనుమాన పిశాచం తిష్ఠవేసింది. గౌరితో యీ విషయం ఎంతమాత్రం చెప్పలేదు. ఒక్క నెల పోయినతరువాత దీనానాథ్‌కి జీతంకూడా హెచ్చింపబడింది. వందరూపాయిలు జీతంపుచ్చుకుంటున్నాడు. రెండు వందలు బోనస్‌కూడా పొందేడు. యింట్లో కొంచెం పచ్చగా వుంది. కాని దీనానాథ్ మనస్సులో మాత్రం ఏదో భయం నిరంతరం కాపురంచేస్తూ క్రుంగదీసేస్తూంది. ఈ అపరాధానికి తప్పక ఏదో ఒక శిక్ష ఈశ్వరుడు యియ్యకపోడన్న విశ్వాసం ఏర్పడింది. ప్రస్తుతం దాని ఫలితం కనపడకపోవచ్చు. ఒక సంవత్సరం పోయేకో, రెండుసంవత్సరాలు పోయేకో తప్పక పొందుతాడు. ఎంత ఆలస్యం అయితే అంత భయమూ అందులో యిమిడివుంది. యింతకు రెండింతలు సమాధానం చెప్పవలసివస్తుంది. అప్పుడప్పుడు దీనానాథ్ పశ్చాత్తాపపడుతూవుంటాడు - యజమాని మాటలకు ఎందుకు లొంగిపోయానా అని. కార్యాలయం వుంటే తనకేం వూడితే తనకేం, యీవ్యథ వుండేది కాదు.

కదా అని విచారిస్తూంటేవాడు. కాని ఏం చెయ్యగలడు ? అయిందేదో అయింది. శిక్ష మాత్రం తప్పదు. యీ అనుమానమే అతని నిత్యజీవితంలో వుత్సాహాన్ని, మాధుర్యాన్ని లాగిపారేసింది.

మలేరియా గ్రామమంతా వ్యాపించి వుంది. బిడ్డకు జ్వరంగా వుంది. దీనానాథ్‌కి పైప్రాణం పైకి పోయినట్లనిపించింది. శిక్ష యీమాదిరిగా ప్రారంభమయిందా, అనిపించింది. ఎక్కడికి వెళ్లడం, ఏమి చెయ్యడం, దీనానాథ్‌కి బుద్ధి మందగించి పోయింది :

"ఎక్కడికైనా వెళ్లి, ఏ డాక్టరుకైనా చూపించి యింతమందు తేకూడదూ?" అంది గౌరి.

ఆలోచిస్తూ దీనానాథ్ "అలాగే వెళతాను... కాని నా మనసులో ఏదో భయంగా వుంది" అన్నాడు.

"భయానికేముంది? యీ రోజుల్లో ఎవరికి రావటంలేదు జ్వరాలు ?"

"ఈశ్వరుడు యింత నిర్దయుడేమా, అని ఆలోచిస్తున్నాను."

"ఈశ్వరుడు పాపాత్ములపట్లే నిర్దయుడు గాని మనం ఎవరిదీ ఏమీ అపహరించలేదు, మనపట్ల అతడు నిర్దయుడు కావడానికి."

"ఈశ్వరుడు పాపాత్ములను క్షమించడా ?"

"పాపాత్ములను శిక్షించకపోతే, అప్పుడే లోకానికి అనర్థమౌతుంది."

"ఒకవ్యక్తి, ఒక దృష్టితో చూస్తే పాపంలాగ మరొకదృష్టితో చూస్తే పుణ్యంలాగ కనిపించే పని చేస్తాడనుకో. అప్పుడో ?"

"నా కర్థం కావడంలేదు."

"నేను అబద్ధం చెప్పడంచేత ఒకని ప్రాణం రక్షింపబడిందనుకో, అప్పుడు."

"అటువంటి అబద్ధానికి ఫరవాలేదు. అది పుణ్యమే."

"మానవుని కళ్యాణంకోసం చేసేపాపం, పుణ్యం క్రిందనే లెఖ్ఖన్నమాట."

"అవును."

దీనానాథ్ మనస్సు కొంచెం కుదుట పడింది. డాక్టరును తీసుకువచ్చేడు. మందిప్పించేడు. ఒక వారంరోజుల్లో బిడ్డ ఆరోగ్యవంతుడూ అయ్యేడు. కాని కొద్ది రోజుల్లోనే తాను అనారోగ్యవంతుడయ్యేడు. సాధారణ మలేరియా జ్వరమే కాని దీనానాథ్ మనస్సులోని కల్పన, ఆందోళన సన్నిపాతంగా మార్చేయి. జ్వరంలో యీ కల్పనాశక్తి తీవ్రరూపం దాల్చింది. యిదివరకు మనస్సులోని శంక యిప్పుడు యథార్థమై కూర్చుంది. యమదూతలు, అగ్నిగుండాలు, నరకం యివన్నీ ఒకదాని వెనుక మరొకటి అతని కళ్ళముందు ప్రత్యక్షమవుతున్నాయి. ఈశ్వరునిపై ఎప్పుడు నమ్మకం కలిగిందో దయతోపాటు, శిక్షకూడా పొందుతున్నాడు. ఈశ్వరుని దయే లేకపోతే, యీసరికి ఆకలితో మాడి చనిపోయే వుండును. అతని వుద్దేశంలో, ఆకలితో చనిపోవడం అగ్నిగుండంలో మాడి చనిపోవడంకన్న మేలే అనిపించింది. రెండవదానిముందు మొదటిది కేవలం ఆట. మనస్సులో చెలరేగే తుపానులో ఒక్కసారి మునిచి తేలుస్తూన్నట్లనిపించింది.

యింతకూ దీనానాథ్‌కి యీ భూమిమీద నూకలు ఋణమున్నాయి. జ్వరంనుంచి తేరుకున్నాడు. యించుకశక్తి రానారంభించింది. ఆఫీసుకుకూడా వెళుతున్నాడు. ఒకదినం గౌరి "ఏమండీ. ఒకరోజున మీకు చాలా ఎక్కువగా వుంది. నాకు యింకేమీ తోచక, మీకు రోగం మళ్ళినట్లయితే, ఏభైమంది బ్రాహ్మణులకు భోజనం పెడతానని, భగవంతునికి మొక్కుకున్నాను. మరుసటిదినంనుండి మీకు జబ్బు మళ్లుముఖం పట్టింది. ఆ భగవంతుని దయే లేకపోయినట్లయితే, యీసరికి నేను ముష్టి ఎత్తుకోవలసివచ్చును. కనుక యీవేళ బజారుకెళ్ళి సామాను పట్టుకరండి. ఏభైమందికి తలపెడితే వందమంది ఎలాగా తేల్తారు. మిగిలిన చుట్టాలూ స్నేహితులూ యింకో వందమంది అవుతారు. మొత్తంమీద రెండువందలమందికి సామాన్లకు జాపితా వ్రాయిస్తాను," అంది గౌరి. దీనానాథ్ బుర్ర గోక్కుంటూ "అయితే, నేను భగవంతుని దయ మూలంగానే బాగుపడ్డాననుకుంటున్నావా, ఏమిటి?" అన్నాడు.

"అయితే ఎలా గయ్యేరు?"

"యింకా బ్రతికేయోగం వుంది, బ్రతికేను."

"అలా ఎప్పుడూ అనకండి: మొక్కు చెల్లించనియ్యండి."

"ఎంతమాత్రం వల్లకాదు. భగవంతుడు దయగలవాడని నేను నమ్మను."

"అయితే భగవంతుడు నిర్దయుడా ?"

"భగవంతుడికన్నా నిర్దయుడు లేడు. ఎందుచేతంటే తాను సృష్టించిన మనుష్యులు చేసే అపరాధాలకు శిక్ష అగ్నిగుండంలో త్రోయడమా ? అట్టివాడు దయగలవాడెలా అవుతాడు? భగవంతుడెంత దయగలవాడో, అంతకు వెయ్యిరెట్లు నిర్దయుడు. అట్టి భగవంతుని ఆరాధించడం నాకు అసహ్యమనిపిస్తూంది. అన్నిటికన్నా శక్తివంతమైనది "ప్రేమ" అన్నారు. బుద్ధి వంతులు జీవితానికి ప్రేమ ఆధారభూతమని, నిర్ధరించారు.

వ్యవహారాల్లోనే గాదు ఆదర్శాల్లోకూడా ప్రేమ జీవితసత్యంక్రింద వుద్ఘాటించారు. కాని ఈశ్వరుడు శిక్షను ఆయుధంగా చేసుకొని ప్రపంచాన్ని పాలిస్తూన్నట్లుగా వుంది. అటువంటి పద్ధతి పూనినతరువాత సాధారణమానవునికి, ఈశ్వరునికి భేదమేముంది ? అటువంటి ఈశ్వరుణ్ణి నేను పూజించలేను పూజించను. బలవంతులకు ఈశ్వరుడు దయావంతుడు. ఎందుచేతంటే వారు ప్రపంచాన్ని దోచుకోగలరు. మనలాంటివారికి ఈశ్వరుని దయ మందులోకైనా రాదు. మనవంటివారికి ఈశ్వరుడు యిచ్చే "శిక్ష" అడుగడుక్కీ అడ్డు తగులుతూనే వుంటుంది. "యీపని చేస్తే భగవంతుడు శిక్షిస్తాడు, ఆపని చేస్తే భగవంతుడు శిక్షిస్తాడు" అన్న అదలింపులు వినపడుతూ వుంటాయి. ప్రేమతో శాసించడంలో, మానవత్వం అంతాన్ని చూపుతూ శాసించడంలో రాక్షసత్వం యిమిడివున్నాయి. ఈశ్వరుని హృదయంలోనుంచి పారద్రోలి అతని "దయ" "దండము" లనుంచి విముక్తుణ్ణి అవుతాను. ఏండ్లకొలదీ సంచయించిన ప్రేమను ఒక్కసారి దండన నాశనంచేయగలదు. నీమీద ప్రాణంపెట్టేవాణ్ణే అనుకో. కాని ఒక్కరోజున కర్రతీసి వీపుమీద ప్రయోగించేనంటే మరి మరునాడు నా ముఖం చూడ బుద్ధిపుట్టదు. అటువంటి ఆశయం కలిగిన ఈశ్వరుని వుపాసన ముమ్మాటికీ వద్దు. మన ప్రస్తుత సంపద పాచినకూటిలో సమానం. అటువంటి పాచినకూటిలో భగవంతునికి పాలా ? భోజనాలమాట ఎత్తేవంటే విషంత్రాగి చస్తాను," అని దీనానాథ్ అనడంతోనే గౌరి నోరుమూసుకు వూరుకుంది. ★

పరిణామం

నారాయణరావు చింకికోటు వంకకెక్కింది. రెండు బత్తాయి కాయలు యశోదొడిలో పడ్డాయి. వాల్చివున్న కుక్కిమంచంమీద మేను వాల్చింది ఆఫీసుయంత్రం.

"ఇకనుంచి నీవు రోజూ బత్తాయిలు రెండు తింటూవుండు."

"మీకు తెలియనట్లు మాట్లాడుతారు. మన కెక్కడినుండి వస్తాయండి?"

"అదంతా నేను చూస్తాగా, అనవసరంగా రోజూ రిక్షాకు మూడణాలు ఖర్చుచేస్తున్నాను. ఇకనుంచి నడిచే వస్తాను. క్షణం పట్టదు. గుదులుపట్టిన కాళ్లకు పని కూడా తగుల్తుంది."

"పనితగలడానికి పగలల్లా శ్రమపడి అడుగు ముందుకు పడుతుందా? అయినా ఇట్లా ఎంతకాలమని గడుస్తుంది."

"మూడు నెలలేగా? గర్భిణీస్త్రీలకు పళ్లరసం మంచిదంటారు. అబ్బాయి బాగుంటాడు. తెలివైనవా డవుతాడు."

"అబ్బాయేనని మీరు కలగన్నారా ఏమిటి? అమ్మాయి ఎందు కవగూడదు?"

"బొబ్రసిద్ధాంతిగారి మాట అబద్ధ మవుతుందా? తప్పకుండా అబ్బాయే."

"ఏదోలెండి వారి దయవలన ఇంతమాత్రమైనా అదృష్టం కల్గింది."

* * * *

"ఎందుకండీ రోజురోజుకు ఈ సామానులు? రేపు అబ్బాయి చదువుకునేటప్పుడు ఇంకెన్ని ఖర్చులుంటాయి."

"చిన్నపిల్లలకు తెచ్చే వస్తువులను వద్దనగూడదు. ఇది అబ్బాయి వుయ్యాలపైన కడితే ఎంత అందంగా వుంటుంది! చిట్టిబాబు చూస్తూ ఆడుకుంటాడు.

"నాకుమాత్రం సంతోషం గాదండి? మన తాహతుకూడా చూడాలిగా. మీకు చెప్పులు పోయి ఎంతకాల మయింది చెప్పండి? వట్టికాళ్ళతో రోజూ నడిచే వస్తున్నారు. ఇటువంటివి నెమ్మదిగా తెచ్చుకోవచ్చుగా!

"చెప్పులు నెమ్మదిగా తీసుకుంటాను. ఎనిమిదోమాసం వెళ్ళినతరువాత త్రోవుడు బంఢీ తెస్తే చిట్టిబాబు త్వరగా నడవడం నేర్చుకుంటాడు."

"చిట్టిబాబూ! చూడు నాయనా మీనాన్న నీకోసం ఎంత కష్టపడుతున్నారో! నీకు వుయ్యాల్లో బొమ్మ కట్టిగాని మంచినీళ్లు త్రాగరట."

* * *

"ఇవ్వాళ అంట్లు నీవే తోముతున్నావే! పనిమనిషి రాలేదా?"

"నేనే ఈ నెలనుంచి వద్దని చెప్పాను."

"ఎందు కని? నీకు కొస్త అండగా వుండేది. రెండుపూటలు సరిగ్గా వచ్చి పని చేస్తూ వుండేది."

"పాత్రలుమాత్రం ఎన్ని వున్నాయిలెండి. చిట్టిబాబు పెద్దచదువుకు వెళ్లబోతున్నాడు. రోజూ ఏదో ఒక పుస్తకం కొనవలసివస్తుంది. పనిమనిషి నాలుగురూపాయలు ఎందుకైనా వుపయోగిస్తాయి."

"అయితేమాత్రం......"

రచన:

శ్రీ వనకుమార్

"నేనేమన్నా గుడ్డిగుర్రాలకు పళ్లుతోమనా? మీరేమో ట్యూషననీ, ఆఫీసనీ ఆరోగ్యం పాడుచేసుకుంటూకూడా పని చేస్తున్నారు."

* * *

"చిట్టిబాబు నిద్రపోయాడా?"

"ఇంకా ఇంటికే రాలేదండి. బాబు ఎక్కడ చదువుకుంటున్నాడో? నేను అందుకే చూస్తున్నాను. తలుపు తీసివుంది. నాకు నిద్రకూడా వస్తోంది."

"నీవు పడుకో. నాకు నిద్రరావటంలేదు. అబ్బాయి అర్ధరాత్రివరకు రాడుగా. తలుపు దగ్గరకు వేసి వుంచితే వాడే గడియ వేసి పడుకుంటాడు."

* * * *

"ఏంగోయ్! చిట్టిబాబు; పిట్టదగ్గరకు వెళ్ళటం లేదటే? బాబుగారేమైనా భీష్మ ప్రతిజ్ఞ చేశారా?"

"డబ్బు లేదురా. నూటు కుట్టించాను. ఏదో కొస్త పెద్దపట్టణాన్కి ఎక్కబోతున్నాంగా."

"నేనుకూడా మానుకుంటున్నానురా. ఎంత డబ్బిచ్చినా గోడచాటు కెళితే మరల ఇవ్వాలి."

"అందుకేరా నాకు కోపం. రెండు రోజులు కష్టంలో వుండి డబ్బు ఇవ్వకపోతేనే ముఖం చూపించనప్పుడు మనం ముఖంవాచి కూచున్నామా?"

"చిట్టిబాబు! నాకు ఆఫీసు టైమయింది. ప్రస్తుతం ఈ నాల్గునూటుల్తో కాలం గడుపుకో. తరువాత శలవులకు వచ్చినప్పుడు చూదాం. నేను వెళుతున్నాను బాబు. ఆరోగ్యం జాగ్రత్త."

"బండి టైమయిందమ్మా!"

"వస్తున్నాను బాబు. ఏమి కొనబోయినా మండిపోతున్నాయి నాయనా! పాతిక జోళ్లు లడ్డులు పెట్టెలో పెట్టాను. చదువులో బడి ఆరోగ్యం చెడగొట్టుకునేవు. జాగ్రత్తగా వుండు బాబు! మీ నాన్నకు శక్తి చచ్చిపోయింది. నిన్ను కాలేజీలో చదివించడానికి ఎంత కష్టపడుతున్నారో నీవు చూస్తూనే వున్నావుగా. డబ్బు కాస్త కనిపెట్టి వాడుకో నాయనా."

"చిట్టిబాబు వెళ్లేవుంటాడు."

"మధ్యాహ్నం రెండుగంటలకే చేరివుంటాడు. ఇల్లు బావురుమంటూ వుంది."

"..............."

"పిచ్చిదానా కళ్ల నీళ్లెందుకు?"

"నన్ను అంటున్నారుగాని మీరు కళ్లు ఎందుకు తుడుచుకుంటున్నారు?"

"కళ్లంతా నొప్పులుగా వుందిలే. రెండు మెతుకులు తిని పడుందాం."

"ఇదిగో; చిట్టిబాబువుత్తర మనుకుంటాను. మీరు వెళ్లగానే వచ్చింది,"

"మనం వ్రాసిన మొదటివుత్తరం అందలేదట. నేను జబ్బుగా వుండటంవల్ల వుత్తరం వ్రాయలేకపోయాను. చాలా నీరసంగా వున్నాను. డాక్టరు బలానికి పళ్లు పాలు తీసుకోమన్నాడు. నాలుగు మందు సీసాలుకూడా వ్రాసియిచ్చాడు. కాని దాదాపు వందరూపాయలవుతాయని నేనే మానేశాను. ఇవన్నీ అమ్మకు చెప్పవద్దు, బెంగపెట్టుకొంటుంది."

"ఏమో చిట్టిబాబు ఎంత చిక్కిపోయాడో?"

"అంతా విను. మనబ్బాయి తెలివిగలవాడని నేను మొదటే చెప్పాగా? మూడు కానులతో పనిజరిగేటప్పుడు రెండణాలు దండగెందుకని కవరు వ్రాయలేదట. జబ్బుగా వుందని ఆదుర్దాతో కష్టపడి డబ్బు పంపేరు. ఆపనిమాత్రం చేయకండి. అమ్మకు నా నమస్కారాలు అని వ్రాశాడు."

"పిచ్చిబాబు! నా కళ్లముందే మెదులుతున్నాడు. చదువంటే మాటలా. ఇనపగుగ్గిళ్లు. ఒకవైపు చదువు, మరోవైపు బలహీనత. మరల తిరగబెడుతుందేమో! సరేలెండి, నా రెండుగాజులు అమ్మి రేపు డబ్బు పంపండి. మందు తినమని గట్టిగా వ్రాయండి. నాకు నగలుమాత్రం ఇంకా ఎందుకు. మనకన్నీ మన చిట్టిబాబే."

"నీగాజులు ఎందుకులే, ఇక ఎట్లాగూ బంగారం కొనలేము. ట్యూషనులో నా సైకిలు కనిమిగిల్చినడబ్బువుందిగా. అదిపంపుతాను."

"మీ ఆరోగ్యం చూడండి, రోజురోజుకు చెడిపోతోంది. ఆఫీసునుంచి వస్తారు. మరల ట్యూషన్లకు వెళతారు. ఎంతకాలం ఇట్లా నడవగల్గుతారు. కళ్లు ఎంత లోతుకు పోయాయో చూడండి."

"మనంమాత్రం ఎల్లకాలం కష్టపడతామా? చిట్టిబాబు ఏదైనా వుద్యోగంలో చేరాడంటే ముసలితనంలో హాయిగా కూర్చోవచ్చు."

* * * *

"ఏమోయ్ చిట్టిబాబూ? పెద్ద ధనికుని వలె వెళ్లి గబగబ షావుకారుకొట్లో చీరె, జాకెట్టు కొన్నావుగదా డబ్బెక్కడినుంచి తెస్తావోయ్. రేపు షావుకారు సతాయిస్తే నీలకాంతం ఇస్తుందో నీవిస్తావో తేలదు."

అందుకేరా జగం నిన్ను పిచ్చికొయ్య అనేది. ఒక కార్డుతో డబ్బు డబ్బుతాత కూడా వస్తాయి చూసుకో. వుపాయం లేనివాళ్లను వూళ్లో వుండనివ్వద్దన్నారు. ఇంటినుంచి డబ్బు తెప్పించాలంటే మీరందరు నాదగ్గరే నేర్చుకోవాలిరా. కాస్త అప్పుడప్పుడు డాంబికంగా మెసలకపోతే వీడెక్కడో దరిద్రుడురా అనుకుంటుంది"

"సరేలే! వుపన్యాసం కట్టిపెట్టి కాస్త మంచినీళ్లు త్రాగు. ఒకప్రక్కన మూతి కాలినా ఇంకా ఆ సిగరెట్టునే పీకుతావు దేనికి, ఇంకొకటి ముట్టించు."

"చిట్టిబాబుగారున్నారా? తలుపు తియ్యండి."

"ఎందుకు?"

"చిట్టిబాబుగార్కి మనియార్డరు వచ్చిందండి." ★

కథానిక:

సంసారంలో ఒకరోజు

"శ్రీమామ్మా! కుంటివాడికి ఇంత బిచ్చం వెయ్యండమ్మా."

అరగంటనుండీ అలాగే కేకేస్తున్నాడా ముష్టివాడు. రాఘవరావు ఏవో ఆఫీసు బాపతు అర్జంటుకాగితాలు, చూసుకుంటున్నాడు. క్రితంరోజే శిరస్తాదారు మరీమరీ చెప్పాడు మర్నాడు రెవిన్యూబోర్డుకు కాగితాలు తప్పక పంపాలని. వాచీ చూస్తే అప్పుడే పదికావస్తోంది. చరచరా వంటయింట్లోకి వెళ్ళాడు, భార్య శాంతమ్మ పచ్చడి నూరుతోంది.

"ఏయ్ మొద్దూ! నిన్నే పిల్చేది, గంటనుంచీ ఆ ముష్టివాడలా కేకలేస్తుంటే చూస్తూ నన్ను కాదన్నట్లు ఊరుకుంటావేం. నేనేం పనిచేసుకోవాలా లేదా" అన్నాడు.

"మీరు మాత్రం వెళ్ళమనకూడదా ఏమండీ! కాకపోతే గుప్పెడు బియ్యం వాడి మొహాన వెయ్యకూడదా" అంది శాంతమ్మ నవ్వుతూ.

రాఘవారావుకి ఎక్కడలేని అభిమానం వచ్చింది. పగలస్తమానమూ దిక్కుమాలిన గుమస్తాచాకిరీ చేసి సంసారం గడపడమే కాకుండా ఈ ముష్టి వెధవల్ని సముదాయించాల్సిన గతికూడా నాకే పట్టిందీ. తను మగవాడు, పైపెచ్చు భర్త, తనమాటకి ఎదురుచెప్పటమే కాకుండా పనులు పురమాయిస్తోంది.

"ఛీ ఛీ! ఈ యింట్లో బతకటానిక్కూడా వీల్లేకుండా ఉంది," అని విసుక్కున్నాడు.

"ఇంతమాత్రానికే జీవితంమీద విరక్తి కలిగితే ఎలాగండీ చచ్చేది?" అంది శాంతమ్మ అమాయికంగా.

"నోర్ముయ్. రాస్కెల్..." అంటూ వాకిట్లోకి వెళ్ళిపోయాడు రాఘవరావు.

*   *   *   *

"వంట అయింది. స్నానానికి లేస్తారా?" లోపలినుంచే కేకేసింది శాంతమ్మ. జవాబు లేదు.

"మరీ ఇంత కోపంఅయితే ఎలాగబ్బా," అనుకుంటూ వీధిగదిలో కొచ్చింది. రాఘవరావు లేడు. వంకీమీద కోటు, టోపీ లేవు. ఆఫీసు కెళ్ళిపోయాడు భోంచెయ్యకుండానే. చేసేది లేక కళ్ళొత్తుకుంది పైటచెరుగుతో.

"ఒకవేళ త్వరగా కాగితాలు ఇవాల్సి ఆఫీసుకి త్వరగా వెళ్ళారేమో. మళ్ళీ వస్తారు బహుశా," అని చాలాసేపు ఎదురు చూచింది శాంతమ్మ. చివరికి విసుగొచ్చి వంటయింటి గుమ్మంలోనే పడుకుంది పైటచెరగు పర్చుకొని. మనస్సేం బావులేదు. ఎప్పుడు నిద్రపట్టిందో తనకే తెలీదు. మెలుకువ వచ్చేటప్పటికి 3 గంటలయింది. "కాఫీ వేళకికూడా రాలేదు. బహుశా ఏ హోటల్లోనో తాగిఉంటారు. ఎంతో

రచన:

మా. వేం. శేషాచార్య

కోపంవస్తేగాని ఇలా చేయరు," అనుకుంది తనలో. గతాన్ని నెమరేసుకుంది ఒక్కసారి. ఇలాంటి సంఘటన తాను కాపరానికి వచ్చిన ఈ రెండేళ్ళలోనూ ఎన్నడూ జరగలేదు. తను అతనికి ఎప్పుడేం కోపం వస్తుందో అని జాగ్రత్తగా మసులుకునేది. ఇంతకీ ఆరోజు లేచినవేళ మంచిది కాదు. చాలాసేపు వెక్కి వెక్కి ఏడ్చింది.

సాయంత్రం చీకటిపడింది ఏడుగంటలకి రాఘవరావు ఇంటికొచ్చాడు. ఎదురువెళ్ళి, "ఇంత ఇదైతే ఎలాగండీ మరీను," అంది శాంతమ్మ ప్రాధేయపూర్వకంగా. రాఘవరావు జవాబు చెప్పకుండా సరాసరి నొడ్డోకి వెళ్ళాడు. కాళ్ళు కడుక్కున్నాడు. ఇంట్లోకొచ్చి ఆఫీసుబట్టలు మార్చి లుంగీ కట్టుకుని వంటయింట్లో కెళ్ళి పీట వేసుకూర్చున్నాడు. మళ్ళీ ఏం అంటే ఏం కొంప మునుగుతుందో అని భయపడుతూ విస్తరి వేసి వడ్డన ప్రారంభించింది శాంతమ్మ. రాఘవరావు భోజనం ప్రారంభించాడు.

"నిక్షేపంలాంటి వంకాయకూర వారేస్తారేమండీ. మీ కిష్టం అని యింగువ కారం కూరి గుత్తులు వేయిస్తే," అంది.

జవాబురాలేదు. ఎంత ప్రయత్నంచేసినా సంభాషణలోకి దిగేట్టు కనపడలా.

పులుసు పోస్తూ అంది. "అన్నట్టు చెప్పటం మరిచానండోయ్, పక్కింటి సుమిత్రమ్మకి కవలపిల్లలు పుట్టారట."

"ఘనకార్యం చేసిందిలే, నువ్వూ కనలేకపోయావ్ ఒక డజను మందిని?" అన్నాడు రాఘవరావు విసుగ్గా.

తను భోంచేసి అన్నీ సర్దుకువచ్చేటప్పటికి ముసుగుతన్ని పడుకున్నాడు రాఘవరావు. "కాస్త జరుగుదురూ" అంటూ ప్రక్కగా వత్తిగిల్లింది శాంతమ్మ.

"అప్పుడే పడకయ్యాకపోతే కాస్త కాళ్ళు పట్టరాదూ" అన్నాడు రాఘవరావు ముసుగులోంచే.

కాళ్ళుపడుతూ అంది శాంతమ్మ "ఇంత కోపం మంచులాకరిగిపోయిందే," అని. ఇంతలో పెద్దగాలివీచింది. దీపంఆరిపోయింది. ★



సలేమా ప్రభాకరం గోరంతలు కొండంతలు చేసికొని బాధపడే రకం. వాడి అదురుకు తోడు డాక్టరుగారి మాటలు గుగ్గిలానికి అగ్గి అంటించినట్లయ్యాయి. "ఏదో ప్రళయానికే వచ్చింది ఈ వుండు" అంటూ హడిలిపోయాడు మావాడు. వాడి హడలుతో మాకు వణకువచ్చింది సుమండీ! ఎంత ధైర్యంగా వుందామనుకున్నా డాక్టరుగారి మాటల్లో వుండే అనుమానం మమ్మల్ని క్రుంగదీసింది.

ఇంతకీ అసలుసంగ తేమిటంటే నాలుగు రోజులనాడు ప్రభాకరం కాలిబొటన వ్రేలిమీద ఆవగింజంత కురుపు లేచింది. దాన్ని చూడడంతోటే మావాడు (కొంచెం దూరాలోచనకలవాడు కాబట్టి) మందు వేసి, చీము పట్టుతుందేమో నని పథ్యం చాలాజాగ్రత్తగా తీసికోవటం మొదలెట్టాడు. కాని, ఆ కురుపుకి మావాడి బలహీనం తెలిసినట్లుంది. రెండోరోజుకు చీముపోయటమేమి, పెద్దదవటమేమి, రెండూ కవలపిల్లలు పుట్టినట్లు ఒక్కమాటు జరిగి కూర్చున్నాయి. ఆవగింజంత కురుపు కాస్తా, అనుముగింజంత అయింది. పాపం! చాలా బాధకూడా తయారయింది. అడుగు తీసి అడుగు వేయలేకపోయాడు. వానర సైన్యంలాగు గుంపెడుమంది స్నేహితుల మున్నాంకాబట్టి కాస్త ధైర్యం చెప్పి నడిపించాము. మరి డాక్టరుగారు తెచ్చిం దుకు మందిచ్చారో లేక... కాని నాలుగో రోజుకి ఆ వేలు బాగా వాచి, చీము దట్టంగా పట్టి కుడుములాగా తయారయింది. గోరుక్రిందకూడా చీమే! బాధకూడా నిష్పత్తిప్రకారం పెరిగినట్టుంది. రాత్రిళ్లు కంటికి కునుకే లేదు.

"ఒరేయ్! ఇది గోరుచుట్టులా గుంది! లేకపోతే యింత బాధపెట్టదు. కాబట్టి నిమ్మకాయ పెడితే తగ్గుతుంది," అన్నాము. వాడి కళ్ళనీళ్ళు తుడిచేందుకు అన్నామే కాని, కాలి బొటనవ్రేలికి, అందులో కుడుమంతయినదానికి పట్టే నిమ్మకాయ దొరకదని మాకుమాత్రం తెలీదూ!

వాడి బాధ చూస్తోంటే మాకు బహు

(౩౦-వ పేజీ చూడండి)

స్వప్నచిత్రం:



మొహంతోల్చుకుని కాఫీ త్రాగుదామని అయ్యరు దేవాలయానికి బయల్దేరాను. అప్పటికి తొమ్మిదిగంటలకు పైగా అయివుంటుంది. అంతకుముందు లేస్తే నాకు జబ్బుచేస్తుంది.

"లజ్" చేరుకునేసరికి పెద్ద కోలాహలంగా వుంది. పేపర్లు అమ్మేచోట జనం తెంగమొహాలు వేసుకుని గుమిగూడి వున్నారు. గూడకట్లే ఎక్కువ కనిపించాయి. కొంతమంది ఏడుస్తున్నారు. అందరూ ఏదో పెద్ద చెడువార్తవిన్నట్లు దిగజారిపోవటం మొదలెట్టారు.

'ఏమిటో ఈ గందరగోళం అని కొట్టుదగ్గరకు వెళ్లి, ఎల్లాగో జనంలోంచి త్రోసుకుని చూస్తే, అక్కడ ఓపది పదిహేనుమంది నేలమీద పడిపోయివున్నారు. శ్వాస ఆడుతోందోలేదో అనుమానంగా వుంది.

[illegible] ర్లను వాణుకుతున్న చేతుల్తో పీకేస్తున్నాడు. నాకేమీ బోధపడలేదీదృశ్యం. ఓఅరవ భాయీని పిలిచి అడిగితే, వాడేదో చెప్పదామనుకున్నాడు. కాని, నోట్లోంచి మాట పెగలటంలేదు. ముక్కుకీ, నోటికీ జేబురుమాలను కుక్కి పోస్టర్లకేసి వేలు చూపించాడు. "త్రిఫికాస్కీగ్రిమ్సు" అనే చిత్రంలో తన మిత్రులతో గూడి ఉద్యానవనంలో విందారగిస్తున్న సందర్భంలో భీకరమైన అడవిమృగం చెట్టుచాటునుంచి సౌజ్ఞ చేస్తున్నప్పుడు 'కాస్టెలో' చేసినపిరికి చేష్టలు జ్ఞాపకానికి వచ్చాయి. భయ విషాదాలకు తీవ్రంగా ఆహుతైపోవటంవలన

[illegible] తినడానికి ఉపయోగిస్తున్న బాకుతో పొడుచుకోడానికి సిద్ధపడతాడు.

అంతవరకూ ఈ కోలాహలంలో పోస్టర్ చూద్దామని నాకు తట్టలేదు. పోస్టర్ చూశాక, ఈ సంక్షోభానికి కారణం తెలిసింది. ఆ రోజు పత్రికల్లో సాంబారుకు రేపటినుంచీ రేషనింగ్ పెట్టారని ప్రకటించబడింది. ఎన్నడూ ఒకకాలం "హెడ్ లైన్" కుమించి "ఫీచర్" చెయ్యని "హిందూ" పత్రికొనాడు తాటికాయంత అక్షరాలతో మొదటిపేజీలో "స్టీమర్" ఇచ్చింది "సాంబారుకు రేషన్: మనిషికి 3 గరిటెలు మాత్రమే" అనిగుండెబ్రద్దలయ్యేటట్లు ప్రకటించింది.

నేను పిలిచిన కుర్రాడిదికొంచం గట్టిప్రాణమనే చెప్పాలి. ఈ వార్త అరవకమ్యూనిటీలో ఎంత సంక్షోభాన్ని పుట్టిం

చిందో చెప్పనలవికాదు. ఇంగ్లీషు తెలిసిన అరవసోదరులు పోస్టర్లుచూసీ చూడ్డంతోనే స్పృహతప్పి పడిపోయారు. దుర్బలహృదయులు అసువులను సైతం బాశారని వదంతిగా వుంది.

వెనక నాస్నేహితుడొకడు ఇద్దరు దెబ్బలాడుకొంటూంటే చూడటం తనకు "సరదా" అని, ఆదెబ్బలాట భార్యాభర్తల మధ్య అయితే, "మిక్కుట" మని వ్రాసాడు. అతనికి పత్రికావిలేకరికి ఉండవలసిన ముఖ్యలక్షణాల్లో ఒక్కటివుంది. కాని అతను ఎక్సైజు సబ్ ఇనస్పెక్టరుగా పోయాడని విచారిస్తున్నాను. నేనూ ఒకపత్రికావిలేకరిని. పత్రికావిలేకరికి దెబ్బలాటలకంటే చావులంటే పరమప్రీతి. లేచినవేళా విశేష మేమిటోగాని, నాముందు ప్రత్యక్షమయిన పరిస్థితి చూస్తే కడుపునిండిపోయింది. నాసత్తా ఇవాళ చూపించాలనుకొని, విశేషాలు "గేదర్" చెయ్యడం మొదలుపెట్టాను.

స్త్రీసులేనిదే బండినడవదు కాబట్టి ఒకకప్పు కాఫీత్రాగి, సిగరెట్టుఅంటించి, విచారగ్రస్తమైన మొహంపెట్టి వార్తాసంగ్రహణకై బయల్దేరాను. పత్రికావిలేకరి సమయానుకూలంగా ప్రవర్తించాలికాని వెక్కిరింపుమొహంతో బయల్దేరితే వీపుమీద బడితెలు విరుగుతాయి. ఎవడిదగ్గిర వాడి బాజా వాయిస్తేనేగాని "స్కూప్"లు దొరకవు.

ఒక్క మెలాపురంలోనే 5 వందలపైగా "క్యాజుయాల్టీస్" జరిగాయని విశ్వసనీయంగా తెలిసింది. నేను లజ్ చేరేసరికి సుమారు 500 మందిని ఆస్పత్రికి చేర్చారట. నాకళ్లముందు పదిహేనుమంది స్పృహతప్పి పడిపోయివున్నారు. తర్వాత కాఫీత్రాగివచ్చేటప్పటికి ఇంకో పదిమంది పడివున్నారు.

పోస్టర్లు ఎందుకు తీసివేస్తున్నావని అడిగితే, కొట్టువాడు మండిపడ్డాడు. నేను పత్రికా విలేకరినని చెప్పంతర్వాత శాంతించి పోలీసులు తీసివేయమన్నారన్నాడు.

నీ కొట్టుదగ్గిర ఏంజరిగిందో చెప్పమంటే, వాడిటుల నుడివెను. "హిందూ పేపరు ఇమ్మంటూ ఒకాయన వచ్చాడు. నేను పత్రిక తీసి ఇయ్యబోయేటప్పటికి ఆయన మాయమయ్యాడు. ఇదేమిట్రా అనుకున్నాను. ఇంతలో ఇంకొకాయన వచ్చాడు. ఆయనకూడా పత్రిక ఇమ్మన్నాడు. నేను పత్రికతీసేసరికి ఆయనకూడా అదృశ్యుడయ్యాడు. నాకాశ్చర్యమేసి క్రిందకు చూసేను, ఏంచెప్పను? వాళ్లు కేవలం అదృశ్యులైపోలేదు కాని, స్పృహతప్పి క్రిందపడివున్నారు. నాకు భయమేసి దారినపోయే కొంతమంది పెద్ద మనుష్యులను రమ్మని పిలిచాను. నేను వారికి జరిగిందంతా చెపుతూ, నేనక్కడ కూర్చున్నానని నేను కూర్చున్న స్థలంవైపు చూపించేసరికి, వాళ్లలో కొంతమంది "హా" అని ఆక్రోశించి కింద పడిపోయారు. కొంతమంది ఏడుపు లంకించుకున్నారు. ఇంకోఇద్దరు కౌగలించుకుని ఆరున్నొక్కరాగం (క్లాసికల్ స్టైల్‌లో) ఆలపించసాగారు. కొద్దిసేపట్లోనే ఒక గుట్ట తయారయింది. చుట్టూ వేదఘోష. కొద్దిసేపటికి పోలీసువాళ్లు కారుతెచ్చి, నా దుకాణం దగ్గిర, తక్కిన దుకాణాలదగ్గిర పడివున్న మందభాగ్యులను హాస్పిటలుకు మోసుకుపోయింది. ప్రతికొట్టుదగ్గిరా గుట్టలు గుట్టలుగా జనం కూలబడిపోయారని చెప్తున్నారు ఇంతకీ దానికి కారణం ఏమిటో నాకింతవరకు బోధపడలేదు. 'ఏ'త్సే వాళ్లే కాని చెప్పేవాళ్లు కనిపించలేదు.'

"నేను చెప్పనా?" అన్నాను.

"చెప్పండి, స్వామి" అని ఆవేదనతో అడిగాడు.

ఆఁ ఏమీ లేదు. రేపటినుంచి మనిషికి 3 గరిటల సాంబారుమాత్రమే ఇస్తారని పేపర్లో ప్రకటించారు. సాంబారుకు రేషను పెడ్తున్నారు. ఈవార్త పోస్టర్లలో చదవడంవల్ల వీరికీఆపద సంభవించిందని" చెప్పాను.

ఆపళంగా ఆ కొట్టువాడు "హా" యని కొండకూలిన ట్లిలపై కొరిగెను.

తర్వాత విచారించాను. ఈ వార్త ఈ అభాగ్యుడికి చెప్పకుండా వుండవలసిందనుకున్నాను. పర్వతమంత ఈ మనిషిని కూడా ఈవార్త క్షమా చేస్తుందనుకోలేదు.

అల్లంత దూరంలో ఒక ముసలాయన "హిందూ" పత్రిక పదేపదే చదువుతూ కుళ్లి కుళ్లి ఏడుస్తున్నాడు.

మొండిఘటాలు "ఇవాళ కేకదా" అని హోటళ్లోపడి ఆపళంగా సాంబారు పట్టెయ్యడం మొదలెట్టారు. సగటున ఒక్కొక్కడు రెండు ఇడ్లీలకు అరడజను ప్లేటులసాంబారుచొప్పున జుర్రేస్తున్నారు. సాంబారుకు గిరాకీపెచ్చింది. హోటలు యజమానులు సాంబారుకుకూడా వేరేధర పెట్టారు. కప్పు అణాన్నర చేశారు– "సింగిల్" కాఫీ, "సింగిల్" టీ అమ్మే హోటళ్లలోకూడా. కాని డిమాండు విపరీతంగా హెచ్చిపోవడంవలన 11 గంటలకల్లా కప్పుధర అర్ధరూపాయవరకు పెరిగిపోయింది. 12 గంటలకు "సాంబారు లేదు" అని బోర్డులు తగిలించారు. కాని చీకటి బజారులో కప్పురూపాయకు లభిస్తోంది.

బట్టలు మార్చుకుని బయల్దేరుదామని ఇంటికి వచ్చి నాస్నేహితులకు ఈవార్త వినిపించాను. అందులో ఒకడు జారిపోయాడు. ఇంకొకడికి చలిజ్వరం వచ్చేసింది. అందులో ఆశ్చర్యం ఏమీలేదు. తమిళులు సాంబారంటే ఎంత పడిచస్తారో ఆంధ్రులు గోంగూరపచ్చడంటే అంత మొహంవాచి పోతారని ఒక ప్రతీతి గలదు. హైదరాబాదు ("హైదరాబాద" అని అనడం కాశేశ్వరరావుగారు మానాలి) తెలుగువాళ్లు మద్రాసు ఆంధ్రుల్ని "గోంగూర గా"ళ్లంటారు. కాని, గోంగూర, సాంబారులలో ఏది కావాలి" అంటే మావాళ్లిద్దరూ సాంబారే కావాలంటారు. గోంగూరకూ, సాంబారుకూ ఒకటే వ్యత్యాసం వుంది. సాంబారు అంటువ్యాధి లాంటిది, గోంగూర కాదు. కాని ఒకసారి మరిగారంటే, రేషనుఅన్నంల్లో ఎక్కువ భాగాన్ని దానితోటే కొట్టేస్తారు. కొందరు అరవవాళ్లు, మజ్జిగా అన్నంలో మధ్యాన్ని 2 అంగుళాల వ్యాసార్థంతో ఒక వలయాకారఖాళీస్థలం ఏర్పరచి దాంట్లో మళ్లీ సాంబారు పోయించుకుని, మజ్జిగ అన్నాన్ని కొంచెంకొంచెం సాంబారు వలయంలోకి త్రోసుకుంటూ భుజిస్తారు. మనవాళ్లు గోంగూర పచ్చడి నంచుకున్నట్లు. నమ్మతారో లేదోకాని, ఒకాయన హోటలుకు ఒక గ్లాసు తెచ్చుకొని, అందులో సాంబారు పోయించుకుని భోజనం అంతా అయిన తర్వాత, సాంబారుదాహం పుచ్చుకొనేవాడు.

బట్టలుమార్చుకుని తిరిగి లజ్ చేరుకొనేసరికి ప్రతీది స్తంభించిపోయింది. ఎక్కడ బస్సులక్కడే ఉన్నాయి. ఎక్కడ ట్రాములక్కడే వున్నాయి. కండక్టర్లు సమ్మె చేశారు. లజ్‌లో ట్రామును ఇనస్పెక్టరు నడుపుదామనుకున్నాడు. కాని అదికూడా సమ్మెచేసి, కదలడానికి నిరాకరించింది.

లజ్ నుంచి ఎల్లా వెళ్లాలో సరిగ్గాజ్ఞాపకం లేదు. మధ్యాహ్నం 2 గంటలకు పోలీసు ఇనస్పెక్టరు జనరల్ ఒక ఇంటర్వ్యూలో మద్రాసు నగరంలో సాంబారు రేషనింగు వార్తవినడంవల్ల స్పృహతప్పి పడిపోయిన వారి సంఖ్య 10,000 వరకు పెరిగిందని చెప్పారు. పత్రికలమ్మకం వెంటనే నిషేధించడంవలన పరిస్థితి కొంత అదుపులోకి వచ్చిందన్నారు. ఈవార్తవల్ల చావులు సంభవించాయన్న వదంతి నిరాధారమైనదని ఆయన ఖండించారు. హాస్పిటలుకు జేర్చబడినవారిలో కొంతమంది స్వర్గస్థులైనారటకదా అని ప్రశ్నించగా, "అవన్నీ డయేరియా కేసులని" ఆయన అన్నారు.

ఆహారశాఖా కార్యదర్శి మాకొక "స్కూప్" ప్రసాదించాడు. ఆంధ్రదేశంలో సాంబారుఉత్పత్తిని, అమ్మకాన్ని నిషేధించడానికి ప్రభుత్వం నిశ్చయించిందని. సాంబారు (addicts) కు అలవాటు పడినవారికి మాత్రం కలెక్టరు పెర్మిట్లు ఇస్తారని, ఆయన చెప్పారు. సాంబారు బ్లాకు మార్కెటు చేసినవారిపై ప్రభుత్వం "తీవ్రమైనచర్య" తీసుకుంటుందని, దీనికై ప్రభుత్వం త్వరలోనే ఒక శాసనాన్ని తయారు చేస్తుందని కూడా ఆయన తెలియపరచారు. ఒక విలేకరిప్రశ్నకు, సమాధానం చెబుతూ బహుశా మరణదండన విధించుటకు ప్రభుత్వం ఆలోచిస్తోందని ఆయన చెప్పారు.

సాయంకాలం పత్రికలలో తమిళనాడులో వేలాదిప్రజలు స్పృహతప్పిపడిపోయారని, సుమారు 1,000 మందికి పైగా ప్రమాద పరిస్థితిలో ఉన్నారని ప్రకటించబడింది. "మెయిలు" లో మాత్రం చాలా చోట్ల చావులు సంభవించాయని ప్రకటించబడింది. ఈ వార్తవల్ల "ఎఫెక్టు" అయిన వారిసంఖ్య 10 లక్షలని ఇంతవరకూ అంచనా వేయబడిందని కూడా మెయిలు పత్రిక ప్రకటించింది.

రామస్వామి రెడ్డియారు గారు అమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. సాంబారుకు రేషనింగు పెట్టడం కేవలం "తుఘ్లక్ చర్య" అని, ఈ నిర్ణయాన్ని మార్చకపోతే, తాము సత్యాగ్రహోద్యమాన్ని లేవదీస్తామని ప్రభుత్వానికి సవాలు చేశారు.

చాలామంది నాయకులు ప్రభుత్వాన్ని పత్రికలలో ఏకేశారు. కనీసం చాలినంత సాంబారైనా ప్రజలకియ్యజాలని ప్రభుత్వం ప్రజాప్రభుత్వం అనిపించుకోజాలదని, ఇప్పుడు జరిగిన విపత్తుకేమి, సంభవించిన చావులకేమి ప్రభుత్వం బాధ్యత వహించవలసి వుంటుందని, ఒక నాయకుడు అన్నాడు.

"కనీసం రోజుకు శేరు సాంబారైనా కావాలి. అటువంటప్పుడు, తలకు 3 గరిటలు సాంబారు మాత్రమే ఇయ్యడం అన్యాయం, అక్రమం, అధర్మం. ఈచర్యను తమిళజాతి సహించబోదు", అని ఇంకొక నాయకుడు గర్జించాడు.

శ్రీ అనంతశయనం అయ్యంగారు ఒక ప్రకటన చేస్తూ, సాంబారు రేషను వార్తవలన ఒక తమిళులకే ప్రమాదం సంభవించిందని అనుకోకూడదని, వందలాది ఆంధ్రులకు ఈవార్త వినడంవలన చలిజ్వరం మొదలైన తాత్కాలిక జబ్బులు పట్టుకున్నాయని, అన్నారు. సాంబారు ఆంధ్ర తమిళ సామరస్య సాధన కుపకరిస్తోందని, విదేశాల నుంచి ముడి పదార్థాలను దిగుమతి చేసైనా సరే, సాంబారుపై కంట్రోలు వెంటనే ఎత్తివేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

శ్రీ కామరాజునాడారు ఎసెంబ్లిలో ఎడ్జర్న్‌మెంటు ప్రతిపాదనకు నోటీసు ఇచ్చారు. సాంబారు రేషనింగు ప్రకటన వల్ల (ఇటీవలనే) ఏర్పడిన అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిని చర్చించుటకు సభాకార్యక్రమాన్ని వాయిదా వేయాలని కోరబడింది. స్పీకరు దీనిని "అవుటాఫ్ ఆర్డరు" అని కొట్టెయ్యలేదు.

సాంబారురేషనింగువల్ల మంత్రులందరూ ప్రజల్ని చంపేశారని, చాలామంది స్పృహతప్పి ప్రమాదపరిస్థితిలో వున్నారని, దీనికంతకీ మంత్రులు బాధ్యులని, మంత్రులపై ఒక అభియోగాన్ని మోపి, దీని విచారణకై 5 గురు ఎసంబ్లీ సభ్యులతో గూడిన ఒక కమిటీని వేయాలని కోరుతూ, ఒక మాజీప్రధాని ఒక ప్రతిపాదనకు నోటీసిచ్చాడని ఎసెంబ్లీలో స్పీకరు ప్రకటించారు. ప్రతిపాదనను తాము ఆమోదించినట్లుకూడా స్పీకర్ ప్రకటించాడు.

ఎసెంబ్లీ బయట 10, 000 మంది తమిళ యువకులు "మంత్రులు కనిపిస్తే పచ్చడి చేస్తామంటూ" ఆందోళన చేస్తున్నారు. "సాంబారు రేషనింగు" అని ఒకడు ఎలుగెత్తి అరిచాడు. ఆమట్టున తొమ్మిదివేల తొమ్మిదివందల తొంభైతొమ్మిదిమంది "తీసెయ్యాలి" అని ఏకకంఠంతో అసెంబ్లీ, కోట అదిరిపోయేటట్లు అరిచారు. పోలీసులు వెళ్లిపొమ్మని వారించినా వారు వెళ్లలేదు. దేహశుద్ధి చేస్తామని బెదిరించినా వాళ్లు ఖాతరచెయ్యలేదు. ముఖ్యమంత్రి కనిపిస్తేనే గాని, చావనైనా చస్తాంగాని కదలం అన్నారు.

మంత్రివర్గసమావేశంజరిపే ఎసెంబ్లీ సమావేశాన్ని రాత్రికి ఆపివేశారని, సమావేశమైనపిదప దర్శనమిస్తామని ముఖ్య

మంత్రి చెప్పమన్నారని ఆయన కార్యదర్శి వచ్చి చెప్పటంతోనే, బహుశా రేషను ఎత్తేసే వుద్దేశ్యంతోనే అత్యవసర మంత్రివర్గసమావేశం జరుగుతోందని ప్రజలు ఆశించడం మొదలెట్టారు.

కొద్దిసేపట్లో ముఖ్యమంత్రి వచ్చారు. ఆయన వచ్చీ రావడంతోనే, "సాంబారు రేషనింగ్ ఎత్తివేస్తారా లేదా" అని ఒక యువకుడు ముందుకు వచ్చి ప్రశ్నించాడు.

సావధానంగా తాము చెప్పింది వినవలసిందని అట్టుడికి పోతున్న ప్రజలకు ముఖ్యమంత్రి విజ్ఞప్తిచేసి, సాంబారుకు రేషన్ పెట్టకూడదని మంత్రివర్గం నేటి సమావేశంలో నిశ్చయించిందని వెల్లడించేసరికి, చప్పట్లు, కేకలు, జై జైలు మిన్నుముట్టాయి. మరి 10 నిమిషాలవరకు ముఖ్యమంత్రిని మాట్లాడ నియ్యలేదు.

ఈ చర్యవలన ఇంత క్లిష్టపరిస్థితి ఏర్పడుతుందని తాము భావించలేదని, జనాన్ని దానికి తమ విచారాన్ని తెలుపుతురిగినమనీ ఆయన అన్నారు. జిల్లాలనుంచి తమకు వచ్చిన రిపోర్టులవల్ల, ఈవార్తవల్ల చావులేమీ సంభవించలేదని తాము చెప్పగలిగినందుకు సంతోషిస్తున్నామన్నారు.

తమ ప్రభుత్వం ప్రజాప్రభుత్వం అని, ప్రజలకిబ్బంది కలిగించే పని తాము ఎన్నడూచేయమని ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. ఇతర దేశాలనుంచి సాంబారుకు కావలసిన ముడిపదార్థాలను దిగుమతి చేసి సాంబారు కొరతను తీర్చడానికి ప్రభుత్వం నిశ్చయించింది కనుక ప్రజలీవిషయమై గాభరాపడ నవసరంలేదని కూడా ఆయన హెచ్చరించారు.

మన ఆంధ్రులుకూడా, తమిళులీనాడు చూపించిన ఐక్యతా, పౌరుషం కార్యాచరణలో చూపిస్తే ఈపాటికి ఆంధ్రరాష్ట్రం రాకపోయిందా అనుకుని, ఈ వార్త యివ్వడానికి ఆఫీసుకు పరిగెత్తాను.

మా సంపాదకులు ఏదో వ్రాసుకుంటున్నారు. ఆయన వులిక్కిపడేలాగ, "ఫ్లాష్, ఫ్లాష్" అనిగట్టిగా సంతోషంగా అన్నాను.

ఇంతలో చేతిమీద చుర్రుమంది, కళ్లు విప్పి చూస్తే, మా ఆవిడ కాఫీగ్లాసుతో ప్రత్యక్షమయింది. ★



న్యూఢిల్లీ పార్లమెంటు భవనంలో, సభ్యులకోసమై ఏర్పాటుచేయబడిన హైదరాబాదులోని తెలంగాణా ప్రాంతంలో దౌర్జన్యకారకులనుండి లాగుకొన్న ఆయుధాలూ, మందుగుండుసామాగ్రి, తదితర ఉపకరణాల నమూనాల ప్రదర్శనాన్ని ప్రధాని నెహ్రూ, రైల్వే రవాణాలమంత్రి గోపాలస్వామి అయ్యంగారు, భారత సర్వసేనాని జనరల్ కరియప్పగార్లు తిలకిస్తున్నారు.



కాకిగోల

"అవునే! వెంకమ్మా! కోమటింటి వాళ్ళ కోడలింకా వుందటే?"

"ఉందమ్మా. వాళ్ళంపడానికి యిష్టపడ్డారు కాబోలు — వీళ్ళుంచుకున్నారు. ఏమో మనకేం తెలుసు!"

'అయినా రెండునెల్లు కావొస్తోంది కదుటే — యింకా అలా కార్యం కాని పిల్లని అత్తారింట్లో వదిలేస్తారే!'

"ఏమో ఎందుకుంచేరో మనకేం తెలుస్తుంది! — మరి — ఆవిడకి ఆడసంతానం లేదుగా అందుకని ముచ్చటపడి — బొమ్మల కొలువులకీ అట్లతదియకీ వుంచుకొని వుంటుంది!"

'ఎంత' యిది లేకపోయినా కోడలిని ఉంచుకుంటారే! అందులోనూ ఎదిగిన పిల్లని!'

"అయితేనేం లే, మొగుడూ పెళ్ళాలే కదూ, తప్పేమిటి? వాళ్ళ కిష్టమయింది వుంచుకున్నారు. మధ్య నీకూ నాకూ ఎందుకీ గోల?"

"ఆఁ! అలా అని ఊరుకుంటుందా లోకం! పెద్దలనీ — ఇరుగనీ, పొరుగనీ — ఎందుకున్నారు?... నువ్వేమంటే అను. మనకాలంలో సంవత్సరాదినతర్వాత అత్తారింట్లో ఎన్నడైనా యిన్నాళ్ళుండి ఎరిగామే?... మరి చోద్యం కాకపోతే —

"ఆఁ! మనకాలం!! — మన చిన్నతనంలో మాత్రం లేరటే? ఆ సీత ఏమిటి చేసింది?... కార్యం కాకముందే అత్తారింట్లో వుండి కడుపు దించుకోలేదూ?"

"ఉన్నా... నూటికో! కోటికో!... ఇంతలా ఉంచేదా? ఇంతకీ ఆపిల్ల పుట్టింటారెందుకుంచేరో — యిన్నాళ్ళు ఎవరైనా అనుకుంటారన్న యిదైనా లేకుండా ఏంలాసుగుందో ఏమో?"

శ్రీ ద్వివేదుల సోమనాథశాస్త్రి

"సరదాగా యీరెండు నెల్లూ ఉంచుకుంటాం అంటే ఏమంటారే... ఉంచక... ఎప్పటికైనా వీళ్ళలో వుండవలసిందే కదూ... యింకేం లాసుగూ?"

"పిల్ల అలా వుందనా! ఏమో! అక్కడేం పితూరీ చేసి వచ్చిందో! మొగుడిమీద రుద్దవచ్చని వుంచేసి వుంటారు!..."

"రామ! రామ!! ఆపిల్ల అలా కనపడదే... ఏమిటలా అంటావు?"

"అన్ని వేషాలూ వేస్తారు మనదగ్గర... ఏదో సామెత చెప్పినట్టు... ఏమైనా నా కనుమానమే సుమీ... లేకపోతే అలా రాత్రి మూడుగంటలకి లేళాయికని వెళ్ళిపోతుంది! యింట్లో కొడుకుని కోడల్ని వదిలేసి — మరి యింట్లో ఎవరూ లేరాయె! ఎంత మంచివాళ్ళైనా... ఎంత భయస్తులైనా అలాంటప్పుడు వూరుకుంటారే!... ఏమంటావు?"

"ఏమో మనం చూసొచ్చామేంటి? — అనుకుందికి! వాళ్ళలాటి వాళ్ళో — అయినా అంత రాత్రప్పుడు వాళ్ళకి తెలివి రాదమ్మా?... వచ్చినా తెగించి మాటాడుకోవద్దూ?..."

"మాటాడుకోక ఏంజేస్తారూ?... అది మాటాడకపోయినా... వాడూరుకోడు..."

"ఇక వూరుకుందూ... మనకెందుకు!... గోడలకి చెవులుంటాయి! — వింటే మన మీద విరుచుకు పడతారు..."

"ఆఁ! లోకసహజం అనుకున్నాం... ఏం... మనమేం వాళ్ళని చెడిపోమని కోరతామా?"

"లేదుగాని, మనకెందుకు?... అదీ కాక మొగుడూ పెళ్ళాలు... వాళ్ళేం చేసినా తప్పులేదు. తప్పని ఎవరూ అనలేరు. అలాంటప్పుడు నువ్వూ నేనూ ఉరి పోసుకు చావడం దేనికీ" —

"తప్పని ఎవరన్నారు?.... ఏదో పెద్దలు కార్యం కానిదే — కూడదని చెప్పేరు.

అంతవరకూ వుంటే వీళ్ల కొంపేం మునిగి పోయిందని ?"

"వాళ్లున్నారో లేదో- వుంటారో- వుండరో,- మనకేం తెలిసి ఏడ్చిందటే- లేక మనం చూశామా వాళ్ళిద్దరూ కలిసి వుండడం. అనవసరంగా ఎందుకనడం వాళ్లని... వాళ్ల మానాన్ని వాళ్లుంటేను."

'ఊఁ, వూరుకో వే నరిసి! ఆవిడ వస్తోంది !"

"రావో, లక్ష్మమ్మా ! రా, కూర్చో. భోజనం అయిందా !"

"ఆఁ! అయిందమ్మా ఇప్పుడే."

"ఏమిటి వంటకాలు?"

"ఏదో- వంకాయకూర. పులుసు. కొబ్బరి పచ్చడి"-

"రెండు ఒత్తులు చేసిపెడుదూ, లక్ష్మమ్మా నువ్వు కుద్దిరంగా చేస్తావు"

"అయ్యో దానికేం ?... లెండి. చేస్తా"-

"....యింకేం ? మన లక్ష్మమ్మ- మరి- మనవైపే చూడదు. కొడుక్కి వుద్యోగం అనగానే ఏ కొసకో వెళ్ళిపోతుంది ?"

"కోడలుకూడా యిక్కడే వుందిగా ! కార్యం ఎప్పుడూ ?"

"ఉందమ్మా. మొన్న నేకదూ పుష్యం దిగజారింది ? వెంటనే- ఆ మన్యం వూరు పంపించేస్తే తిరగ - వేస్తుందని వుంచేసేం. అట్లతదియ వెళ్లగానే పంపించేస్తాం. నాకూ కూతురైనా కోడలైనా అదేగా మరీ! యింట్లో యింతెడు బొమ్మ లున్నాయి, ఏంచేసుకోను ? పోనీ వూరుకోవడం దేనికని కోడల్ని దసరాకి వుంచేసేను."

"అవునమ్మా, అవును ! చారెడు పసుపూ కుంకంతో కోడలు యింట్లో వుంటే ! యింటికి కళ- వుండగా మానుకోవడం దేనికి ? మంచిపని చేశావు !!"

"పోనీ, ఏలాగో యిన్నాళ్లుంది. ఆ. దీపావళి వెళ్లగానే సమ్మ్రంచెయ్య కూడదూ? సరదా పడుతుంది."

"ఎందుకమ్మా! ఆ తర్వాత ఎలాగూ మన దగ్గరే ఉంటుంది. యీనాల్గురోజులకీ మాట పడ్డం దేనికి ?"-

"మాట దేనికమ్మా ! కోడల్ని నాల్గు రోజు లుంచుకొంటే తప్పా !! పరాయిదా ఏమేనా. ఏమే, వెంకమ్మా!"

"అవునమ్మా అవును ! ముద్దూ ముచ్చట్లూ తీరొద్దూ !! పెద్దయింతర్వాత ఎద్దుల్లా ఏంబావుంటుందీ !!!"

"ఏమోనమ్మా ! యిప్పటికే అందరూ గుసగుసలాడుతున్నారట ! నిష్ఠూరం కూడాను. తోలేస్తే తీరిపోతుంది."

"ఆఁ, ఎవరమ్మా ! అంటారు ! కోడలే కాని పరాయి పిల్ల కాదు. అయినా అందా నికి నోరెలా వస్తుందీ !! వచ్చేది కార్తిక మాసం. పూజలూ, పునస్కారాలూను- వాళ్ళింట్లో యివన్నీ తీరుతాయా, ఏమన్నానా ? ఆ కాస్తా అయిన తరవాత పంపవచ్చు. అందరిలోనూ కలిసి మెలిసే పిల్ల వెళ్ళిపోతే వీధి చిన్నబోతుంది !!"

"యిన్నాళ్లూ వుంచిన తర్వాత యింకా వుంచమంటే బావుంటుందా ! మనకు మాత్రం నోరు రావద్దూ ? వాళ్లు రాగానే పంపించేస్తాను."

"పోనీండి. అంతవరకూ కాకపోయినా యీ అట్లతదియ వెళ్లే వరకేనా వుంచక పోతే ఒప్పుకోకండి !"-

"అదెలాగో అవుతుంది లెండి. ఆ తర్వాతే పంపిస్తాం."

'అప్పుడే వెళ్ళిపోతున్నారేం?- కూర్చోండి !'

'లేదమ్మా..యింట్లో బోలెడు పనివుంది. మళ్ళీ వస్తాను లెండి !"

★

"అమ్మడూ కూతుర్ని యింకా తీసుకు రావేంటే ?" అన్నాది దీర్ఘంతీస్తూ రామలక్ష్మితో ఓ బోడమ్మ.

"తీసుకు వచ్చేస్తామండీ...... రేపో ఎల్లుండో" అన్నాది రామలక్ష్మి.

"అదేమిటమ్మా! ... మరీ నీ... యిన్నాళ్లుంచుకోవడం ఏమిటే ?...వాళ్లకెంత సిగ్గ లేదూ !..."

"సిగ్గేమిటండీ!...వాళ్ళ కోడల్ని ఉంచుకుందికి ?...అదేవిటి అలా అంటారు ?"

'కాదమ్మా... ఎంత కోడలయినా కార్యం కాక ముందు అన్నాళ్లుంచుకోవడం - మంచిదేనా ?... అయినా మీ రెందు కూరుకున్నారూ... ?"

"వచ్చేవన్నీ....ఆడవాళ్ల పండుగలు- ముద్దూ' ముచ్చటాను....యిక్కడికొస్తే చాకిరీయేకదూ ? అక్కడున్నట్టు అవుతుందా ? అందుకని వుంచేశాం... దూర సమ్మంధంకూడా కాదు.మా పిన్ని... కాదనగలమా ?"

"బాగుందమ్మా...బావుందీ...ఖులా అవబట్టే- కాలం యిలా ఏడుస్తూంది. ఎవరు చేసిన పని వారికి మంచిదే.... కాని లోకం ఒప్పుకుంటుందా ? కార్యం- చేసెయ్యకూడదూ ? తీరిపోతుంది !"

"చెసేస్తా మండీ...మనకేం బరువా ? కుర్రాడు చదువుకుంటున్నాడు... తొందరేం ?"-

"అలా అయితే యిలా వుంచకూడదమ్మా- మీరు చిన్నవాళ్లు మీకు తెలీదు-"

"అంతమాత్రంలో మాకు తప్పేమీ కనపడలేదు. అయినా మొగుడూ- పెళ్లాం. తప్పేమిటి ?"

"సరి ! మీరే యిలా అంటే యింకేముందీ. శాస్త్రాలనీ - పురాణాలనీ...ఎందుకున్నాయీ ? తగలడనా ?"

"ఇక్కడే మూలుగుతూ, మూలుగుతూ వెళ్ళి అక్కడ యిరవై రోజులు లేవలేదట ! మొదటినోము ఎలాగో చెంబెడునీళ్లు పోసి అయిందనిపించారట. తక్కిన రెండు నోములకీ జ్వరమేనట! వెంటనే దిగపెట్టేస్తే, ఏమాతుందో అని నాల్గురోజులపాటు వుంచేరు. యింతలో అట్లతదియ వచ్చింది ! యింకెలా తీసుకువచ్చేయడం ? అందుకే యిన్నాళ్ళయింది. లేకపోతే మేం మాత్రం ఎందుకు చేస్తాం ?"

"అదేమిటమ్మా ? రెండు నెల్లు కావస్తూంటేనూ."

"అబ్బ ! చెప్పేదంతా ఏమిటండీ ! ఉష్ణంతో పడుకుందంటేను."

"అవునమ్మా. ఏదో చెబుతారు మరి ! యింట్లో చేసుకోలేక కోడల్ని వుంచేసుకొని వుంటుంది !"

"పోనీండి. ఎలాగో ఒకలాగ. వాళ్ల అత్తారింటే ఉంది కాని పైయింటో లేదు. కొంప మునిగిం దేముందీ ?"

"సరే. ఎప్పుడో తీసుకువస్తారు. తీసుకురాక ఏంచేస్తారూ ?" యింతకీ మాకేం మధ్యనీ. చెప్పవలసింది చెప్పేం. పెద్దవాళ్లు చెప్పేరు కూడదని ! అయినా, యిప్పుడెవరూ పాటిస్తేనా ? న్యాయంగా అయితే కార్యం అయేవరకూ పిల్ల అత్తారింట్లో పాయిస్తే ముట్టుకోనేకూడదు ! అవన్నీ పోయాయి. ఆ కాలం మరి చూడం."

"సరే అవన్నీ ఎందుకు లెండి ! మాటకంటాను. ఏమీ అనుకోకండి !! మీ చెల్లెలి మొగుడు పోయాడుకదా. మరి మీ చెల్లి, చీరెలు కట్టడం మానిందా ? గాజులు వేసుకోవడం మానిందా ? రవికలు తొడగడం మానిందా ? ఏమిటి మానింది ! చెప్పండి ! దేనికదే- వుంది." అని రామలక్ష్మి అనేసరికి ఆ బోడమ్మకి కొంచెం కోపం వచ్చింది.

"అవునమ్మా. కాలంతోపాటు మనమూను. వెళ్లొస్తాను."

"సరేలెండి. సాయంత్రం- పురాణానికి వస్తారుకదూ !"

★

"చూశావా అక్కయ్యా, నే చెబితే విన్నావా ? నల్గురూ ఎలా అనుకొంటు

స్నారో." అన్నాడు రామలక్ష్మి తమ్ముడు.

"అనుకోనీరా, ఫరవాలేదు. మరేం వుండబట్టకపోతే సరి!" అంది రామలక్ష్మి చిరాకుతో.

"అవునవును! ఎంత చెప్పినా అంతే. వాళ్ల దగ్గరనుండి అమ్మాయికి నెల తప్పిందని శుభవార్త వస్తేనే గాని తీసుకు రాకు. నాకేం!" అన్నాడు.

ఈమాట వినేసరికి రామలక్ష్మికి మనస్సు చివుక్కుమంది- సిగ్గులేకండా అంతమాట తన తమ్ముడే అంటాడని అనుకోలేదు-

"బావుందిరా, తమ్ముడూ! అందరూ నీలాగే వుండరు! నాల్గురోజు లాలస్యం అయేసరికి నానామాటలూ అనుకోవడం! మహా బుద్ధిమంతుడులా చెబుతున్నావు. జ్ఞాపకం తెచ్చుకో!- మనవూళ్లో- తొలిచూలు కాపలా వడతాననే పక్కయింటి అమ్మాయిని పట్టుకు వేళ్లాడలేదూ? ఎవరికి తెలీవు బుద్ధులు! దానికన్నా తప్పా ఏమిటిది? ఒక్కవేళ ఏమయినా కూతురూ, అల్లుడే. మరేం పర్వాలేదులే."

అని కోపంతో అనేసింది. అది విని నోరెత్తకండా 'రావు' వెళ్లిపోయేడు.

స్వవిషయాలు లోకానికి యింత భారంగా వున్నాయని ఆమెకు తెలియదు. యిదంతా విన్నతర్వాత వియ్యపురాలింటికి ప్రయాణమయింది.

"రామలక్ష్మి కూతురు బయటుందిటే, రావమ్మా!"- అంది సుబ్బమ్మ.

"ఆ. ఏమిటే? నిజమే? అది బయటుండడం ఏమిటే? నే నమ్మను సుమీ." అంది రామమ్మ."

"అయ్యొ... నే చూసొస్తేనే!"

"ఆఁ! మనం ఏమనుకుంటాము అని దాన్ని పైని కూర్చోపెట్టి వుంటారు.",

"లేదు నిజంగానే. తెలుస్తూంటేనే!"

"అయితే ఏమీ లేదు కాబోలు. వుట్టినే అనుకున్నారు అందరూను."

"వుట్టినే ఎందుకనుకుంటారు! అయినా ముట్టు అయినంతమాత్రంలో... కాలేదనా!! ఏమోఎవరికి తెలుసు! మన మీనాక్షిలా ముట్లయినా కంటుందేమో!!" అని కామమ్మ అంది యిటూ అటూ ఎవరూ లేకండా చూసి.

"ఏమో అదీ నిజమే"- అన్నారు అందరూ కడుపుబ్బ తీరక-

ఈమాటలన్నీ ఆ పక్కనుండి వింటున్న రామలక్ష్మి- "యింకా వీళ్ల అనుమానం తీరలేదా!" అని అనుకుంది ★



కేంద్రం రాష్ట్రాలకొరకు, రాష్ట్రాలు కేంద్రంకొరకు ఉంటున్నవని బొంబయిలో జరిగిన రాష్ట్ర ఆహారమంత్రుల సమావేశంలో మధ్యప్రదేశ్ మంత్రి శ్రీ రవిశంకర్ శుక్లా అన్నారు.

సినిమా:

20-12.

"చలనచిత్రరంగంలో పాత్రపోషణ"

రచన:
"కదారు"


నేటి చలనచిత్రరంగంలో పాత్రపోషణకు తగిన ప్రాధాన్యత ఇవ్వటంలేదు. పౌరాణిక, చారిత్రాత్మక, జానపద చిత్రములలో సినేరియా కథ, సంభాషణా రచయితలు పాత్రపోషణ, పాత్రసౌశీల్యము గురించి దృష్టి ఉంచుకుని రచించినా లేకపోయినా కథ, పాత్రలు వారి స్వంతం కావు గనక కాకతాళీయన్యాయంగా కొంతవరకు త్రోసుకుపోతూన్నవి. ఇక కేవలం సాంఘికచిత్రాలలో వీరు తమ స్వంతపాత్రలను సృష్టించి, రచించినప్పుడు యీ అవకతవకలకు అంత ఊంపే ఉండదు పాత్రపోషణను వీరు ఏమాత్రం దృష్టిలో ఉంచుకోనుటలేదని చెప్పవచ్చును ఈ సంవత్సరంలో ఇంతవరకూ వచ్చిన సాంఘికచిత్రాలలో పాత్రపోషణ గురించి తగు శ్రద్ధవహించినవాటిని గురించి చెప్పుకోనవలసివస్తే, 'షావుకారు' చిత్రాన్నే చెప్పుకోవాలి. ఆ విధమైన పాత్రపోషణ మరే చిత్రంలోనూ కల్పింపబడలేదు

పాత్రపోషణ అసలు కథకు ఆయుఃపట్టు నిర్మాతలు తాము చూపించదలంచుకున్న ఆశయాలకు, లక్ష్యాలకు ఆయా పాత్రపోషణ ఎంతైనా అవసరం. పాత్రపోషణ సరిగా లేనిదే తాము చూపించదలచుకున్న ఆశయాల్ని ఎలా బలపరచుకోగలరు? తాము ఖండించి చూపవలసిన విరుద్ధభావాల్ని ఎలా నిరూపించగలరు? కనుక కవి తన ఆశయాలకు కథానుగుణ్యమైన పాత్రలను సృష్టించుకోవాలి వారికి తగు వాతావరణాన్ని కల్పించుకోవాలి వారి మాటలచేత నడవడులచేతను ఆయా పాత్రల గుణశీలాగలను వ్యక్తం చేయాల్సిఉంటుంది తదనుగుణ్యంగా దర్శకుడు సాధనసామగ్రిని పరిసర వాతావరణాన్ని సమీకరించుకోవాలి వీటన్నింటికీ ముఖ్యమైన సన్నివేశాల్ని క్రమానుసారంగా కల్పించి, చూపించాలి కనుక పాత్రపోషణకు సినేరియో రచయితయే పునాదులు వేయగలడు

సినేరియో రచయిత తగిన రంగాల్ని కల్పించగా, తదనుగుణ్యంగా సంభాషణ వ్రాసి కవి, తగిన పోషణ నివ్వగలడు. కథ, సినేరియా, మాటలు, పాటలు వ్రాసే బాధ్యతలను ఏ ఒక్కరిపైననో విడిచిపెట్టినట్లయితే సర్వసమర్థనీయంగా ఉండగలదు కవి తన కథాక్రమానికి తగిన పాత్రలను సృష్టించుకుని, రంగస్థలాలను కల్పించుకుని, తదనుగుణ్యమైన సంభాషణలను వ్రాసుకుని నిర్వహించగలడు. అయితే యిన్ని బాధ్యతలనూ నిర్వహించాలంటే అన్ని విధముల ఆలోచించి నిర్వహించగల నైపుణ్యమున్న కవికే చెల్లుబడికాగలదు ఈ సందర్భంలో వీటన్నింటికీ తగిన కవులను చెప్పుకోవలసివస్తే, శ్రీ సముద్రాల రాఘవాచార్య, శ్రీ తాపీ ధర్మారావుగార్లనే చెప్పుకోవలెను అయితే వీరుకూడా, ఇటీవల కొన్నికొన్ని చిత్రాలలో - మరెందుచేతనో - పాత్రపోషణకు తగిన వాతావర



[illegible] వారి [illegible] నాయికానాయకులు రేహానా, రాజకపూర్.



ఈ 22-న విడుదల కానున్న సాధనావారి 'సంసారం'లో
నాగేశ్వరరావు (వేణు) రాజ్యం (మంజు)

ణాన్ని కల్పించటం లేదు. 'షావుకారు' చిత్రంలో శ్రీ చక్రపాణిగారు తమ సినేరియావల్లను, మాటలచేతను అన్ని పాత్రలను చక్కగా పోషించారు. దర్శకులలో స్వర్గీయ 'గూడవల్లి' తమ చిత్రాలలో పాత్ర పోషణకు ఎంతో ప్రాధాన్యాన్ని కనబరచేవారు. పాత్రపోషణవిషయంలో వాహినీ వారి చిత్రాలన్నీ, సాధారణంగా, ముందంజ వేస్తాయి. దర్శకులుగా ప్రసాద్ కూడా యీ విషయాల్ని కొంతవరకు పాటిస్తారు.

సినేరియారచయిత కథతోపాటు పాత్రపోషణను గురించికూడా మనసులో పెట్టుకుని రచన కుపక్రమించినగాని తగిన రంగస్థలాలను, సన్నివేశాలను కల్పించుకోలేడు. ఆతను సన్నివేశాన్ని కల్పించనిదే మాటలు వ్రాసే కవి ఎంత సమర్థుడైనను పోషించలేడు. కొన్నికొన్ని సందర్భములలో కవికి అవకాశం వుండికూడా సంభాషణల్ని వ్రాసినను అప్రస్తుతంగా ఉండవచ్చును. కనుక అందుకు పునాదులు సినేరియా రచయితయే వేయాలి. ఇందు కొక ఉదాహరణ తీసుకుందాం. 'పరమానందయ్య శిష్యుల' చిత్రంలో ప్రియురాలి పేరు చెట్లపై చెక్కుకుంటూ పిచ్చవాడిలా అడవులబట్టి తిరుగుతూన్న చంద్రసేనుని గుర్తించిన అవతారం, వాని నింటికి తీసుకువచ్చి, ప్రచ్ఛన్నంగా పురుషవేషంలో తల దాచుకుని, ప్రియుని ఎడబాటుకై విచారిస్తున్న రాజకుమారి లీలకు పరిచయంచేసే దృశ్యాన్ని చూదాం.

ఈ రంగంలో పాల్గొన్న పాత్రలు చంద్రసేనుడు, అవతారం, లీల, హేమ. ఈ రంగంలో యీ నలుగురిని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉన్నది. కాని మధ్యలో లీలాచంద్రసేనుల మధ్య నడచిన సంభాషణలు వారిరువు ఏకాంతసన్నివేశంలో జరగవలసిన సంభాషణలు. ఆ సమయంలో మిగతా ఇద్దరకూ స్థానం లేదు. కానీ ఆ సన్నివేశాన్ని పొడిగించి, చివరకు అవతారం, లీలాచంద్రసేనుల చేతులు కలుపుతాడు. ఇచ్చట కవి నిస్సహాయుడైపోయాడు. నలుగురు మధ్యను జరగవల్సిన సంభాషణలకు మరొక రంగాన్ని కల్పించి కథను పొడిగించాల్సిఉంటుంది. కానీ ఇందుకు మరొక దృశ్యాన్ని సినేరియారచయిత కల్పించక పోవటాన్ని కవి ఏమీ చేయలేక ఆ విషయాన్ని 'క్లయిమాక్స్'కు తీసుకురావాల్సిన అవకాశం ఆ ఒక్క రంగంలోనే కల్పించబడింది. కనుక యిచ్చట కవి సినేరియా రచయితగా బాధ్యుడైనాడు. లీల చంద్రసేనుల మధ్య జరుగవలసిన సంభాషణలు వీ రందరిమధ్య జరగటంలో ఆ మాటల్లో వున్న వ్యంగ్యం పోవటమే కాదు, ఆ పాత్రల ఔచిత్యానికే భంగం కల్గింది.

పరమానందయ్య శిష్యుల కథలో యీ లీలాచంద్రసేనులకు సంబంధించిన గాథకు మాతృక 'షేక్స్పియర్' (Shakespeare) వ్రాసిన నాటకం 'యాజ్ యు లైక్ యిట్' (As you like it) అందులో ఆ ఆంగ్లకవి ఆర్లాండో (Orlando) 'రోజ్‌లిండ్' (Rosalind) ల మధ్య చక్కని సమావేశాన్ని కల్పించి ఆ ఘట్టాల్ని రసవత్తరమైనవిగా చేస్తూ, ఆ పాత్రలను పోషించాడు.

పరమానందయ్యకు ఆ గొల్లవారింట ఆశ్రయం యిచ్చిన తర్వాత వారి రహస్యం బయటపడినతర్వాత, చంద్రసేనుడు, లీల ఏకాంతంగా కలుసుకుని తమ హృదయాల్ని విప్పుకొని మాట్లాడుకొనుటకు ఒక సన్నివేశం కల్పించబడింది. ఇక్కడ యీ ఏకాంతసన్నివేశాన్ని యీ విధంగా కల్పించటం ఎంత అవసరమో పై సందర్భంలోకూడా అంతే.

సినేరియారచయిత తర్వాత భాధ్యతంతా కవిదే. సంభాషణలు నడిపి నిరూపణ చేయవలసినవాడు కవి. సినేరియాలో తగిన దృశ్యాల్ని, రంగస్థలాల్ని కేటాయించి వ్రాసినా కవి వాటిని సద్వినియోగం చేయక పాత్రపోషణకు భంగం కలిగించవచ్చును. కనుక సినేరియా రచయిత బాధ్యత ప్రచ్ఛన్నమైనది; సంభాషణ రచనా బాధ్యత ప్రత్యక్షమైనది. మాయారంభలో ఒకటి రెండు ఉదాహరణలు చూదాం.

విద్యాధరుడు తన్ను నిరాకరించి ఆశ్రమం నుంచి వెళ్ళిపోవటం విని, విచారిస్తూ కళా



'బీదలపాట్లు'లో కఠినర మొగని పోలీస్ ఇన్‌స్పెక్టర్‌గా నటించిన సీతారామన్

వతి విద్యాధరుని ఆశ్రమఆవరణలో నిలబడి వుంటుంది. అంతలో నలకూబరుడు ప్రవేశిస్తాడు. ఆమె అసహాయస్థితిని వినియోగించుకుని ఆమెను పొందవలెనని నచ్చచెప్ప ప్రయత్నిస్తూఉంటాడు. ఇంతలో రంభ ప్రవేశిస్తూ, నలకూబరుని మాటలు విని మండిపడుతుంది. రంభమాటలు వినబడి, నలకూబరుడు కళావతిచెయ్యి జారవిడుస్తాడు. వెంటనే కళావతి మెల్లమెల్లగా ఆ రంగం నుంచి తప్పుకుపోతుంది. కళాపూర్ణోదయం మాట మరిచిపోయి, ఆ దృశ్యం చూచేవాళ్ళకు - నలకూబరునికే కాదు - రంభ ప్రవేశించకపోతే కళావతిచర్య ఎలా ఉండి ఉండేదో! కథ అడ్డం తిరిగేదేనేమో! అనిపించునట్లు నడిపించారు. విద్యాధరుని నిరసనవలన నిరుత్సాహంలో, ఆ సందిగ్ధావస్థలో కళావతిమనస్థైర్యం పాటవం తప్పి తప్పటడుగు వేస్తుందేమో అనే అభిప్రాయం కలిగేటట్లు ఉన్నది ఆ దృశ్యం. అందుకు కారణం, కళావతిమాటల్లో అంత క్రితం నలకూబరుని మాట్లాడినంత తీవ్రతగాని, ఆ రోషావమానాలుగాని, ఆ కృతనిశ్చయంగాని ధ్వనించలేదు. పైగా ఏదో తప్పుచేసినదానివలె రంభను చూడగానే పారిపోయినట్లున్నది ఆ నిష్క్రమణ. దానివలన ఆమె శీలం ఎంత పతితమైపోయినది! వాస్తవానికి ఆమె రంభవచ్చిన అవకాశం చూచుకుని పెద్దపులిబారినుంచి తప్పించుకుపోయిన లేగదూడవలె తప్పించుకొన్నది. ఉన్నది ఉన్నట్లుగా చిత్రింపబడక యింత విరుద్ధంగా కనబడటానికి కారణం ఆ రంగంలో కళావతిసంభాషణలో తగిన తీవ్రత లేకపోవటమే.

మరొక ఉదాహరణ. కళావతిశీలం గురించి విద్యాధరునకు నారదుడు నచ్చచెప్పి, వారితో మాట్లాడుతూన్న సమయంలో రంభ ప్రవేశించి నారదునితో తన దీనావస్థకు దుఃఖిస్తుంది. నారదుని హేళనకు, ఎత్తిపొడుపుమాటలకు క్రుంగిపోతూ, నలకూబరుని తిరిగి బ్రతికించవలసినదిగా ప్రాధేయపడుతుంది. ఈ తమాషా అంతా కళావతి, విద్యాధరులు చూస్తూవుంటారు. 'నీవైనా చెప్పు తల్లీ' అని రంభ కళావతి నుద్దేశించి ప్రాధేయపడునంతవరకు కళావతి తటస్థంగా ఉండి చూస్తూ ఉంటుంది. కానీ రంభ తన్ను ప్రాధేయపడకముందే తానే రంభమేలుకై నారదుని కోరిఉన్నట్లయితే కళావతిసౌశీల్యతకు మరింత ఘనత కల్గెడిది. ఉత్తమనాయికల తుణాలు ఆపాదింపబడెడివి. కానీ యిక్కడ రంభ ప్రేరేపణవలన అడిగించుటచేత కళావతి మధ్యమతరగతికి చెందినదైనది. అయితే ఆ సంభాషణవలన రంభ కళావతిని సహితం ప్రాధేయపడునట్లుచేసి ఆమెకు గర్వభంగం చేయుటకు, ఆమె దీనావస్థను మరింత ద్విగుణీకృతం చేసి చూపుటకే వినియోగపడింది తప్ప కళావతిసౌశీల్యతకు ప్రతిభ కలుగచేయుటకు ఉద్దేశింపబడలేదు.

ఈ విషయంలో కవితర్వాత చెప్పుకొనవలసిన శిల్పి ఎడిటరు. ఎడిటరు గనుక పాత్రపోషణను దృష్టిలో ఉంచుకొనకపోతే కొన్ని, కొన్ని దృశ్యాలు అనవసరమని తోచిగాని, చిత్రం పొడవైపోతుందనే భయంచేతగాని కొన్ని రంగాలను కత్తిరించివేసి పై యిద్దరి కృషినీ వృథా చేయగలడు. ఈ విషయమై తాను పై యిద్దరితో, దర్శకునితో సంప్రదించి సమాలోచన చేసినా వారి దృక్పథంతో చూచి అనుసరిస్తేనే తక్క మేలు చేయలేడు. ఇందు కొక ఉదాహరణ చూదాం.

'షాహుకారు' చిత్రంనుంచి ఒకరంగం చూదాం. రంగస్థలం, షాహుకారు చెంగయ్య యింటి ఆవరణ. సుబ్బులు చెంగయ్యగారి యింటి ముంగిలిలోంచి తమ యింటిగుమ్మంవైపు పోతూఉంటుంది. అంతకుముందు రంగంలోనే ఆమె మామ చెంగయ్యదగ్గర టపాకాయలకని డబ్బులు సంపాదించుకున్నట్లు చూపబడింది. యీ రంగంలో ఆమె వెనకాలనే పోలేరు ప్రవేశిస్తూ, "బుల్లెమ్మగారూ!" అంటూ వెంటబడతాడు. "ఏమిటిరా," అని వెనక్కి తిరిగి చూస్తూ, ఆగిపోతుంది "పండుగమ్మా." అంటాడు గునుస్తూ. "అయితే ఏమంటావ్?" మీ చినబాబుగార్ని అడగకపోయినావ్?" అంటూ ముందుకు కదులుతుంది. "చినబాబుగారు యిచ్చారమ్మా," అంటాడు బుర్రగోక్కుంటూ. "అయితే యింకేం?" అంటూ ముందుకు పోబోతూ ఆగి, "ఇదిగో తీసుకుపోరా!" అని మొలనున్న ఆ డబ్బులు వాడిచేతిలో వేసి చరచరా వెళ్ళిపోతుంది. ఇక్కడ పోలేరు, చినబాబుగారు డబ్బులు యిచ్చారుగనుక మీరూ యివ్వాలి అన్న భావాన్ని కనబరచి వారిద్దరికీ సన్నిహిత సంబంధాన్ని కల్గివున్నట్టు ప్రవర్తిస్తాడు. వారిమధ్య ఆమెకు ఉన్నతస్థానాన్ని కల్పిస్తూ, ముందుకథను బలపరచుకుంటూ ఉన్నాడు.

ఈ రంగం కల్పించకపోయినందువలన కథాక్రమం ఏమీ కుంటుబడదు. కానీ సుబ్బులు పాత్రపోషణకు అత్యంత అవసరమైన రంగం. ఆ యింటిలో చిన్నబాబు తర్వాత ఆ నౌకర్లకు ప్రేమపాత్రమైనది సుబ్బులుమాత్రమేనని చూపుతూ ఆ రెండు కుటుంబాల మధ్యను ఆమె కున్న ప్రాధాన్యతను, వారిపట్ల ఆమె అభిమానాన్ని కనబరుస్తూ - కేవలం యీ రంగం యిందుకు సుమా అని వేలుపెట్టి చూపినట్లుకాక - చక్కగా సంభాషణలు దొర్లిపోయినై. యీ రంగం లేకపోయినా కథాక్రమం కుంటుపడదుగదా, ఫిల్ముపొడవు తగ్గించవచ్చునుకదా అని ఎడిటరు యిల్లాంటి రంగాల్ని కనుక తీసివేసిన పాత్రపోషణకు లోపం కలుగుతుంది. కనుక ఎడిటరుకూడా యీ విషయంలో తగుశ్రద్ధవహించవలసి ఉన్నది.

వీరందరికంటే మించిన బాధ్యత తిరిగి దర్శకునిపై కలదు. ఇంతమందీ వారివారి పనులను సక్రమంగా నెరవేర్చినా దర్శకుడు పై వారి దృక్పథంలో గనక చూడకపోతే పాత్రపోషణ, దెబ్బతింటుంది. ఇందు కొక ఉదాహరణ చూదాం. పరమానందయ్యశిష్యుల' చిత్రంలో ఒకరంగంలో రాజకుమారి హేమ నీళ్ళతొట్టివద్ద కూర్చుని కడుగుతూఉంటుంది. అవతారం ప్రవేశిస్తాడు. అవతారం చొక్కాపై చేప నెందుకు కట్టుకున్నాడో ఆమె అడుగగా కారణం చెప్పుతాడు. వారిమధ్య సంభాషణల రచనా విధానం సక్రమంగానే ఉంది. మిగతా వారెవ్వరి లోపమూ లేదు. దర్శకుడు మాత్రం పాత్రోచితమైన నటనా, మాటల ఉచ్చారణ లేక పాత్రపోషణకు లోపం కల్పించాడు. ఆ సన్నివేశంలో అవతారం నటన, మాటల ఉచ్చారణ, ఆ కంఠధ్వనుల బట్టి ప్రేమీ ప్రేమికుల మధ్య జరిగిన సంభాషణవలె ఉన్నదిగాని రాజోద్యోగి, రాజకుమార్తెల మధ్య జరుగవలసిన విధానంలో జరగలేదు. ప్రియురాలితో ఛలోక్తిగా మాట్లాడినట్టు మాట్లాడుతూ, రాజకుమారి భుజం తడుతూ నిష్క్రమిస్తాడు. అవతారం ఆమెకు చిన్ననాటనుంచీ చనువైనవాడే కావచ్చును. వారిరువురిమధ్యను భేదంలేక పోవచ్చుగాక. ఎంతైనా ఆమె రాజకుమారియే, ఆమెపట్ల అదేనా ఉచితప్రవర్తన? ఈ రంగంలో దర్శకుడు పాత్రోచితమైన హద్దులను మీరిపోయి, తమ స్వంత కెపాసిటీలో నటింపచేశాడు.

అసలు మొదటినుంచీ హేమపాత్ర సరిగా పోషింపబడనేలేదు. ఆపాత్ర పోషణకు తగిన శ్రద్ధ ఏ ఒక్కరూ తీసుకోలేదు. వారీ చిత్రంలో అనుకరించిన As You Like itలో Rosalind తోపాటు Celia

(39-వ పేజీ చూడండి)



బొమ్మరిల్లు

బాలగేయం:

ఆశలు


శ్రీ సిద్ధాంతి మల్లికార్జునం

ఆకాశములో నక్షత్రమునై
తళతళ నేనూ మెరిసేనా!
తెల్లని తామర పుష్పము నేనై
సూర్యుని చూచీ నవ్వేనా!

సీతాకోకా చిలుకను నేనై
వన్నెలు మారుచు ఎగిరేనా!
చిలుకల్లాగా ముద్దులుగులికే
పలుకులు నేనూ పలికేనా!

కోయిల నేనై హాయిహాయిగా
తియ్యని పాటలు పాడేనా!
తుమ్మెద నేనై పువ్వుపువ్వులో
తొణికే తేనెలు తాగేనా!

రంగురంగులా నెమలిని నేనై
సొంపుగ నాట్యము చేసేనా!
వెన్నెల నిచ్చే చందమామనై
పాపల చూచీ నవ్వేనా!



నదిఒడ్డున వున్న పొదలచాటున దాక్కుని మన ముగ్గురువీరులూ చూశారు. సెంట్ పీటర్స్బర్గ గ్రామానికి ఒక మైలుదిగువగా పెద్ద స్టీములాంచిమీద ఎక్కి చాలా మంది జనం ఏమిటో హడావిడి చేస్తున్నారు. ఆ లాంచిచుట్టూ చిన్న చిన్న తెప్పలు చాలా తేలుతున్నాయి. ఆ తెప్పల్లోకూడా మనుషులున్నారు. అంతా ఏదో వెతుకుతున్నట్టుగా వున్నారు. ఇంతలో లాంచికి ఒకపక్కనుంచి పెద్ద పొగ బయల్దేరింది. ఇంకొంచెం సేపటికి ఇందాక వినిపించిన 'గుంయ్' మన్న శబ్దం వినిపించింది.

"ఆ తెలిసింది. నదిలో ఎవరో మునిగిపోయారు." అన్నాడు. టామ్.

"ఆ, అంతే. కిందటి వేసాకాలం బిల్ టర్నర్ మునిగిపోయినప్పుడు ఇల్లాగే వెతికారు. నీళ్లమీద ఫిరంగి పేలుస్తారు. అప్పుడు శవం అడుగునెక్కడన్నా వుంటే నీటిపైకి వచ్చి తేల్తుంది తరవాతేంచేస్తారంటే రొట్టెముక్కల్లో పాదరసం పోసి నీళ్లమీద వదిలిపెడతారు. ఆరొట్టెముక్కల్లో ఒకటి పోయిపోయి శవంమునిగిన-చోట టక్కుమని ఆగిపోతుంది. అప్పుడు అక్కడికి వెళ్లి వెతుకుతారు." అని వర్ణించాడు హక్.

"అవును. ఇదంతా నాకిదివరకే తెలుసు. కాని ఆ రొట్టెముక్క ఎందుకల్లా చేస్తుందో ఆశ్చర్యం!" అన్నాడు జో.

"ఆ, అది రొట్టెముక్కమహిమేమీ కాదనుకుంటా. దాన్ని వదిలిపెట్టేటప్పుడు ఏవో మంత్రాలు చదువుతారు. అంచేత వాటికా మహిమ వస్తుంది." అన్నాడు టామ్.

కాని హక్ దీనికి ఒప్పుకోలేదు. మంత్రాలు చదవటం తనెప్పుడూ చూడలేదన్నాడు.

"బలేవాడివి, చదవకపోవటమేమిటి? ఎవర్నడిగినా చెబుతారు నీకు ఆ సంగతి. అయితే లోపల చదువుతారనుకుంటా." అని టామ్ సర్ది చెప్పాడు.

టామ్ చెప్పినదానిలో నిజం వుందని మిగతాయిద్దరూ ఒప్పుకున్నారు. లేకపోతే ప్రాణంలేని రొట్టెముక్క మంత్రాల సహాయం లేకుండా శవంవున్నచోటుని ఎల్లా కనుక్కోగలుగుతుంది?

"అరేరే, ఇప్పుడక్కడ వుంటే ఎంత బావుంటుంది?" అని చిటికె వేశాడు జో.

"అవును. నాకూ అల్లాగే వుంది. ఆ మునిగిపోయిందెవరో చెప్పిన వాడికి ఏమడిగినా ఇచ్చేస్తాను." అన్నాడు హక్.

ముగ్గురూ నిశ్శబ్దంగా ఆ దృశ్యాన్ని చూస్తూ వింటున్నారు. ఇంతలో టామ్కి ఒక ఆలోచన మెరుపులా మెరిసింది.

"అరేయ్. ఆ మునిగిపోయిందెవరో నాకు తెలిసింది- మనమే."

ఒక్క క్షణంలో యీ ముగ్గురుపిల్లలూ గొప్పవాళ్లయిపోయారు. వీళ్లు గ్రామంలో కనిపించలేదు. మునిగిపోయివుంటారని నదిలో వెతుకుతున్నారు. గ్రామంలో వాళ్లకోసం ఎంద రేడు

స్తున్నారో? ఎందరి హృదయాలు బద్దలవుతున్నాయో? అన్నిటికంటే ముఖ్యమైన విషయ మేమిటంటే ఇంతవరకూ టామ్, జో, హక్ అనే ముగ్గురు కుర్రాళ్లు ఉన్నారనే విషయం తెలియనట్టే నటించిన గ్రామస్థులు యావన్మంది ఇవ్వాళ వీళ్లనిగురించే మాట్లాడుకుంటున్నారు. వాళ్లు ఇదివరలో చేసిన పనులనే ముచ్చటించుకుంటున్నారు. అంచేత మిగతా పిల్లలంతా వీళ్లంటే ఈర్ష్యపడుతూవుండివుండాలి. బలేగా వుంది. లేకపోతే సముద్రపు దొంగలు కావటమంటే మామూలువిషయమా? ఎంత కీర్తి? ఎంత ప్రతిష్ఠ?

సాయంత్రం కావచ్చింది. లాంచి, మిగతా తెప్పలు గ్రామం వేపుకి వెళ్లిపోయాయి. సముద్రపు దొంగలు తమడేరాకి చేరుకున్నారు. వాళ్లకి హఠాత్తుగా వచ్చిన కీర్తితో పూర్తిగా ఉబ్బిపోయారు. మళ్ళీ చేపలు పట్టారు; వండుకుని తిన్నారు.

హాయిగా పచ్చికలో కాళ్లు సాచి పడుకుని కొంతసేపు తమ కీర్తిని గురించి, ఇంటిదగ్గర తమకోసం తమ వాళ్లు ఎంత ఏడుస్తూవుండేది మాట్లాడుకున్నారు. క్రమంగా మాటలు తగ్గిపోయాయి. టామ్‌కి, జోకి మనస్సులో మళ్ళీ ఒక దిగులు బయలుదేరింది. ఇంటిదగ్గర వాళ్ళు నిజంగా దుఃఖిస్తూవుంటారు. తమకి వున్న సంతోషం వాళ్ల కుండదు.

చివరికి జో సందేహిస్తూ ఒక మాట అన్నాడు.

“మళ్లీ ఊళ్లోకి వెళదామా? ఇప్పుడు కాదు... చాలారోజులైన తర్వాత...”

వెంటనే టామ్ “ఛా! మళ్లీ వెళ్లట మేమిటి? ఇహ ఎప్పటికీ పోగూడ దనుకోలా? పసిపాపాయి లాగా బెంగపడతావేమిటి?” అని కోప్పడ్డాడు. ఈ విధంగా సముద్రపు దొంగల్లో బయల్దేరిన మొదటి తిరుగుబాటు అణిచివేయబడింది.

రాత్రి చాలా పొద్దుపోయింది. కునికిపాట్లలోనుంచి హక్ ఎప్పుడో తెలియకుండానే నిద్రలోకిజారాడు. వాడివెంట జో జారాడు. కాని టామ్‌కి నిద్ర రాలేదు. స్నేహితులకేసి దీక్షగా చూస్తూ ఆలోచిస్తున్నాడు. చివరికి నిశ్శబ్దంగా లేచాడు. రెండు తాటిమట్టల ముక్కలు సంపాదించాడు. రెండిటిమీదా బొగ్గుతో ఏదో రాశాడు. ఒకటి జేబులో పెట్టుకున్నాడు. రెండో దాన్ని జో టోపీలో పెట్టి, దాంట్లో కొన్ని సీమసున్నంముక్కలు, రబ్బరుబంతి, కొన్ని గోలీలు, ఇంకా ఏవేవో ఉంచాడు. తరవాత నెమ్మదిగా పాకుతూ చెట్లగుంపునుంచి బయటపడ్డాడు. అక్కడినుంచి నదిఒడ్డుకి పరిగెత్తాడు.

అయిదారు నిమిషాలకల్లా టామ్ ద్వీపంరెండోవేపుకి వచ్చాడు. అక్కడ నది రెండువందల గజాల వెడల్పుమాత్రమే వుంది. ఆట్టే లోతు లేనందున టామ్ వందగజాలదాకా నీటిలో నడిచిపోయాడు. తరవాత లోతెక్కువైంది. అడ్డంపడి మిగతా వందగజాలని ఈదడం ప్రారంభించాడు.

ఎల్లాగైతేనేం టామ్ శ్రమపడి అవతలిఒడ్డు చేరుకున్నాడు. అక్కడినించే ఇల్లినాయిస్ రాష్ట్రం ప్రారంభమౌతుంది. టామ్ కొంతదూరం ఒడ్డునే నడిచాడు. రాత్రి పదిగంటలయ్యేటప్పటికి రాధారిలాంచీలు నిలిచేరేవును చేరుకున్నాడు. అందులో ఒకటి అప్పుడే బయల్దేరటానికి సిద్ధంగా వుంది. సెంట్‌పీటర్సుబర్గుకు వెళ్లే పడవల్లో అదే ఆఖరిది.

పిల్లిలాగా అడుగుల్లో అడుగులేసుకుంటూ టామ్ చెట్లనీడల్లోంచి నెమ్మదిగా పడవ నెక్కాడు. ఎవ్వరికీ కనిపించని చీకట్లో ఒకమూల ముడుచుకు కూర్చున్నాడు.

1 నిమిషాలైయిందో లేదో పడవ అవతలిఒడ్డును చేరుకుంది. టామ్ జాగ్రత్తగా పడవ దిగి త యింటికేసి పరిగెత్తాడు.

సందులగొందులబడి వెనక్కి చేరుకున్నాడు. ప దీపాలు వెలుగుతున్నాయి. గుండా తొంగిచూశాడు. పెద్దమ్మ, సిడ్, మేరీ, జ వాళ్ళమ్మ, అక్కడకూర్చుని మాట్లాడుకుంటున్నారు. వాళ్లు మంచం ఒకపక్కన కూర్చున్నారు. మంచానికవతల దూరంగా తలుపున్నది.

టామ్ నెమ్మదిగా బంపటినించి తలుపు గడియని మరమేకు తిప్పి తీశాడు. తలుపు కొంచెం తోశాడు. కిర్రుమంది. కాస్సేపాగి ఇంకొంచెం తోస్సి పిల్లిలా లోపలికి దూరాడు. పాకుకుంటూ మంచం కిందకి దూరి కూర్చున్నాడు. అతన్నెవరూ చూడలేదు. కాని పెద్దమ్మ తలెత్తి చూసి,

“అదేమిటి ఆతలుపు తీసివుంది? ఏమిటమ్మా, ఈ వింతలకి అంతంలేకుండావుంది. ఇప్పుడేగదా ఆ తలుపు వేసింది. ఇంతలో ఎల్లా తెరుచుకుంది? సిడ్! దాన్ని వేసిరా.” అన్నది.

తరవాత పెద్దమ్మ అన్నది.

“కాని, వాడు చెడ్డవాడు కానే కాదమ్మా. కొంచెం తుంటరిపనులు సేవాడంతే.” అని ఏడవటం లెట్టింది.

మా జోకూడా అంతేనమ్మా. డూ ఏదో ఆకతాయిపని చేసే సు. చెడ్డపిల్లడు కానేకాదు. య్యో నా చేతులు పడా. నే నెల్లా ట్టానమ్మా, నా ముద్దుల జోని. మీగడ తింటే తిన్నాడని ఊరుకోకుండా ఈ పాడు చేతుల్తో ఎల్లా కొట్టానో. అయ్యో నేను చచ్చిపోనూ!” అంటూ జోతల్లికూడా ఏడుపు లంకించుకుంది.

“టామ్ ఎక్కడున్నాడోగాని సుఖంగానేవుండివుంటాడు. ఆ అల్లరి చేయకుండా వుంటే వాడంతటి మంచివాడు లేడు.” అన్నాడు సిడ్.

“సిడ్. నోరుముయ్యి. నా టామ్ని గురించి పల్లెత్తుమాట అన్నావంటే చూడు. వాణ్ణి దేవుడే కాపాడతాడు. అయ్యో, వాణ్ణి ఎల్లా మర్చిపోయేదమ్మా. వాణ్ణి చూసుకునే గదా నేను బతుకుతున్నది?” అని ఏడ్చింది పెద్దమ్మ.

ఈవిధంగా ఇద్దరు ఆడవాళ్లూ తమ పిల్లలు చేసిన చేష్టల్ని తలుచుకుంటూ చాలాసేపు ఏడ్చారు. మేరీ కూడా టామ్ని పొగడింది. ఇదంతా వింటుంటే మంచంకింద దాక్కున్న టామ్కికూడా ఏడుపు వచ్చింది. చప్పుడుచెయ్యకుండా చీమిడి తుడుచుకున్నాడు. తను నిజంగా మంచివాణ్ణనే అభిప్రాయం కలిగిందతనికి. పెద్దమ్మమీద జాలివేసింది. ఎదటపడి వాళ్ల దుఃఖం పోగొట్టాలనిపించింది. కాని కదల్లేకపోయాడు.

వాళ్లు మాట్లాడుకోవటంలో టామ్కి కొన్ని విషయాలు తెలిశాయి. నదిలో ఈతలుకొడుతూ పిల్లలు మునిగిపోయివుంటారని ముందు అంతా అనుకున్నారు. తరవాత ఊరి కెగువన పడవరేవులో పడవ ఒకటి కనిపించలేదు. తరవాత కొందరు పిల్లలు “త్వరలో ఒక విషయం జరగబోతోం”దని తమతో టామ్ వాళ్లు చెప్పారని బయటపెట్టారు. అంచేత పిల్లలు పడవలో ఎక్కడికో పోయివుంటారని అనుకున్నారు. కాని మధ్యాహ్నానికల్లా ఆ పడవ ఊరికి అయిదు మైళ్లుదిగువగా మిస్సోరీనదిఒడ్డున కనిపించింది అప్పుడు పిల్లలు మునిగిపోయివుండాలనుకున్నారు. పైగా శవాలకోసం ఎక్కువ వెదకటంకూడా అనవసరమనుకున్నారు. ఎందుకంటే పిల్లలు బాగా ఈతవచ్చిన వాళ్లు. ఒడ్డుకి దగ్గర్లో అయితే ఈదుకుని వచ్చేవాళ్లే. నదిమధ్యలో మునిగిపోయి ఒడ్డుకు రాలేకపోయివుంటారు. ఆ శవాలు సముద్రంకేసి కొట్టుకుపోయివుంటాయి. ఇదంతా బుధవారంరాత్రి జరిగింది. ఆదివారంనాటికికూడా శవాలు దొరక్కపోతే ఆశలు పూర్తిగా వదులుకోవచ్చు. ఆదివారంనాడే చచ్చిపోయిన పిల్లలకి జరగవలసిన కర్మకాండలు చేస్తారు.

తరవాత జోతల్లి సెలవుతీసుకుని వెళ్లిపోయింది. సిడ్ వచ్చేఏడుపు నాపుకుని పడుకోటానికి వెళ్లాడు. మేరికూడా ఏడుస్తూవెళ్లింది.

పెద్దమ్మ నేలమీద మోకరించి టామ్ఆత్మశాంతికి భగవంతుణ్ణి ప్రార్థించింది. ఆ ప్రార్థనలో తనకి టామ్మీద వున్న ప్రేమనంతా గుమ్మరించింది. టామ్కళ్లు నీళ్లతో నిండిపోయాయి.

పెద్దమ్మ మంచంమీద మేను వాల్చింది. చాలాసేపటిదాకా అటూయిటూ దొర్లుతూ టామ్ని తలుచుకుంటూ ఏవో మాటలంటూనేవుంది. చివరికి గుర్రుతీస్తూ నిద్రపోయింది. టామ్ మెల్లిగా ఇవతలకి వచ్చాడు. ఆమెముఖంకేసి చాలసేపు చూశాడు. చాలా జాలి కలిగింది. జేబులో వున్న తాటిమట్టని తీసి దీపంపక్కన పెట్టాడు. కాని మళ్ళీ ఎందుకనో తీసి జేబులోనే పెట్టాడు. తరవాత వంగి పెద్దమ్మ నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాడు. తలుపు గడె తీసి బయట నుంచుని మళ్ళీ మరమేకు తిప్పి గడియ వేశాడు.

టామ్ ఊరుదాటి పడవల రేవుకి వెళ్లాడు. అక్కడెవ్వరూ లేరు. కాపలావాడొక డున్నా వాడు నిద్రలో వున్నాడు. ఒక చిన్న పడవను లంగరెత్తి నీళ్లలోకి తోసి ఎక్కాడు. ఒక్కడే తెడ్డు వేసుకుంటూ జాక్సన్ ద్వీపాన్ని చేరుకున్నాడు. పడవని తమకోసం అట్టే పెట్టుకుందాఘనుకున్నాడు. సముద్రపు దొంగలు ఇకముందు పెద్ద ఓడల్నే పట్టుకోవాలిగా. కాని పడవ పోయిందంటే దాని యజమానులు దానికోసం నదిఅంతా గాలిస్తారు. అప్పుడు తమని పట్టుకొంటారు. అంచేత ఆ పడవని మళ్ళీ నీళ్లలోకి తోసి వదిలేశాడు. అది ప్రవాహంలో ఎటో కొట్టుకు పోయింది.

ఒడ్డున పడుకుని టామ్ చాలసేపు విశ్రాంతితీసుకున్నాడు. తెల్లవారవస్తోంది. నిద్ర ఆపుకోలేక నిద్రలోపడ్డాడు. లేచేటప్పటికి బాగా తెల్లవారి సూర్యుడు పైకొచ్చాడు. తరవాత టామ్ తమ డేరాకి బయల్దేరాడు.

అప్పటికిజో, హాక్ నిద్రలేచి ఏదో మాట్లాడుకుంటున్నారు. డేరావెనక కూర్చుని టామ్ వారి మాటలు విన్నాడు.

"టామ్ అల్లాంటి పని చెయ్యడు. తప్పకుండా తిరిగొస్తాడు. సముద్రపు దొంగలు తమ స్నేహితుల్ని విడిచిపెట్టిపోవడం మర్యాద కాదని టామ్కు తెలుసు. ఏదో గొప్ప పనికోసం వెళ్లివుంటాడు." అంటున్నాడు జో.

"టామ్ రాకపోతే అతని వస్తువులన్నీ మనవే కదూ?"

"మనవే అని రాసి వెళ్లాడు. కాని పొద్దుటి భోజనంవేళకి రాకపోతేనే వాటిని తీసుకోమన్నాడు." అన్నాడు జో.

"ఎందుకు రాడూ? మహా సముద్రరాజ్యాధిపతి అయిన టామ్ సాయర్ ఇడుగో." అంటూ టామ్ ఒక్క గంతువేసి వాళ్లముందర పడ్డాడు.

చేపలు, మాంసం వండి భోజనం చేశారు. టామ్ తను ఎందుకు వెళ్ళిందీ, ఏమేమి సమాచారం తెలుసుకువచ్చిందీ చెప్పాడు. కథలాగా ఉన్నవీ లేనివీ జో లెడు చెప్పాడు. దీంతో ముగ్గురూ తమకంటే మహానాయకులు ఈదేశంలో లేరనే అభిప్రాయానికి వచ్చారు.

భోజనమైనతర్వాత కాస్సేపాగి 'నదిలో దిగి యీతలు కొట్టారు. నదిలో ఒకళ్ల నొకళ్లు తరుముకున్నారు, ఒకళ్ళ మొహాలపై ఒకళ్ళు నీళ్ళు చల్లుకున్నారు. పోట్లాడుకుని ఒకళ్ళ నొకళ్ళు నీళ్లలో ముంచుకున్నారు. ఈ జలక్రీడతో వాళ్ల ఉత్సాహం రెచ్చిపోయింది.

అలిసిపోయింతరవాత ఒడ్డుకు వచ్చి వేడెక్కిన ఇసకలో పడిదొర్లారు. మళ్ళీ నదిలో దిగి ఈదారు. బయటికి వచ్చి యిసకలో 'సర్కస్' ఆట ఆడారు. కాసేపు గోలీలు, గూటీఎళ్ల ఆడారు.

చివరికి డేరాకి వచ్చి నడుం వాల్చారు. దూరాన తెల్లగా కనిపించే తమ గ్రామంకేసి దీనంగా చూస్తూ పడుకున్నారు. టామ్ తనకి తెలియకుండానే కాలిబొటనవేలితో యిసకలో "బెకీ" అని రాశాడు. దానికేసి చూసి 'ఛఛ' అనుకుని చెరిపేశాడు. కాని లాభంలేదు; మళ్ళీ రెండు నిమిషాల్లో "బెకీ" అని రాశాడు. మళ్ళీ చెరిపాడు.

ఈపాటికి జోకి ఇంటిమీద బెంగ బాగా ఎక్కువైంది. కళ్లలో నీళ్లు తెగఊరుతున్నాయి. హాక్ కూడా దిగులుగా వున్నాడు. టామ్కుకూడా అల్లాగే వుందిగాని లేనట్టు నటిస్తున్నాడు.

"ఈ లంకమీద ఇదివరకు కొందరు సముద్రపు దొంగలు నివసించి ఉంటారని నా నమ్మకం. వాళ్లు దోచుకున్న డబ్బు ఎక్కడో పాతిపెట్టివుంటారు. ఇప్పుడు మనకి బోలెడు వెండి, బంగారం దొరికితే ఎల్లా వుంటుంది?" అన్నాడు టామ్ లేని వుషారు తెచ్చుకుని.

దీంతో మిగతాయిద్దరూ కొంత ఉత్సాహం వచ్చినట్టు కనిపించారుగాని మళ్ళీ అది తగ్గిపోయింది. టామ్ ఇంకా ఏవో రెండుమూడు ఇల్లాంటి ఉపాయాలే వేసి చూశాడు; కాని ఏమీ లాభంలేక పోయింది.

చివరికి జో ఉండబట్టలేక, "అరేయ్. ఇక పోదాంరా యింటికి ఇక్కడ చాలా ఒంటరిగా వుంది.' అన్నాడు.

"జో. నీకు తెలియదు. క్రమంగ అదే అలవాటవుతుంది. ఇక్కడ చేపలు ఎంత తేలిగ్గా దొరుక

(37-వ పేజీ చూడండి)



రాకుమారికి పన్నెండేళ్లు నిండాయి. ఆరోజున ఆమె పదమూడవ జన్మదినోత్సవం జరుగుతోంది. రాజుగారు తనకు లేక లేక పుట్టినపిల్ల కావటంచేత, తల్లికూడా చిన్నప్పుడే చనిపోవడంవల్ల ఆ కుమార్తెను అతిగారాబంగా పెంచాడు. ఏటేటా రాకుమారి పుట్టినరోజుపండగ జరుగుతోందంటే ఆ దేశంలోని ప్రజలందరికీ పండగేనన్నమాట. ఆరోజున రాజుగారు కొన్ని లక్షల రూపాయలు ఖర్చుచేసి దానాలు, సంతర్పణలు చేయించేవాడు. ఇంకా ఎన్నో వేడుకలు మహావైభవంగా జరిపేవాడు.

ఆరోజున రాజధానియావత్తూ పెళ్లిపందిరిలా కలకలలాడుతోంది. కోటకి ఎదురుగా విశాలమైన పందిళ్లు వేశారు. ఒకచోట గొర్రె పొట్టేళ్లు, కోడిపుంజుల పందెములు జరుగుతున్నాయి. ఒకచోట వస్తాదులు కుస్తీలు పడుతున్నారు. ఒకచోట కోయవాళ్లు గారడీవిద్యని చూపిస్తున్నారు. ఇతర పందిళ్లలో హరికథలు, గానకచ్చేరీలు, భరత నాట్యం వగైరా ప్రదర్శనాలు జరుగుతున్నాయి. రాజధానిలోని జనం యావత్తూ ఆ పందిళ్లలోనే వున్నారు. బ్రహ్మాండమైన రెండు పందిళ్లలో భోజనం చేసినవారు లేస్తుండగా, చేయవలసినవారు వరసవారీగా కూర్చుంటున్నారు. ఊరంతా ఔట్లు, బాణాసంచా కాలుస్తున్నారు.

రాకుమారి మామూలురోజుల్లో కోటనుంచి కదలదు; ఒంటరిగా తోటలో తిరుగుతూనో, కోటలో పాఠాలు నేర్చుకుంటూనో కాలం గడుపుతుంది. ఆమెకి చదువుమీదకంటే ఆటలమీదనే సరదా. కాని రాజుగారు తన కుమార్తె ఇతరులతో కలిసి తిరిగితే పాడైపోతుందనీ, తమకంటే తక్కువవాళ్ల పిల్లలతో ఆడుకోవటం హోదాకు తక్కువనీ ఆమె నెక్కడికీ కదలనిచ్చేవాడు కాదు. కాని పుట్టినరోజు పండగనాడు ఆమె యిష్టం. ఊళ్లో ఎక్కడికైనా ఆమె వెళ్లచ్చు. ఇష్టమైన స్నేహితుల్తో ఆడుకోవచ్చు. ఏడాదిపొడుగునా ఆమె పుట్టినరోజు పండగకోసం ఎదురు చూసేది. రోజూ ఆ పండగ వస్తే ఎంత బావుంటుం దనుకునేది.


ఆరోజున ఆమె కోయవాళ్ల గారడీ చూస్తోంది. కొంతసేపు వాళ్లు పాముల్ని, కోతుల్ని ఆడించారు. వాళ్లలో ఒకడు బుట్ట బోర్లించి దానికింద మామిడి మొక్కని మొలిపించాడు. మళ్ళీ బుట్ట మూసి పళ్లు కాయించాడు. అందులో ఒకటి రాకుమారి రుచి చూసిందికూడా. ఆమె కిదంతా బలే సరదాగా వుంది. మంత్రులు, సామంతుల పిల్లలతో కలిసి ఎత్తైన చోట కూచ్చుని ఈ వినోదాన్ని చూసి ఆనందిస్తోంది.

కొంతసేపటికి గారడీవాడు తన ఖాళీసంచీని దులిపాడు. అందులోనుంచి ఒక మరుగుజ్జు బయట పడ్డాడు. వాడికి 30 ఏళ్లుంటాయి.

అడుగున్నర ఎత్తుంటాడు. పెద్ద తలకాయ, సన్నటి చేతులు కాళ్లు, మహావికృతంగా వున్నాడు. పంచ కట్టి, కోటు వేసి, తలపాగా చుట్టుకున్నాడు. నంచీనుంచి కిందపడగానే లేచి అందరికి వంగి నమస్కారం చేశాడు. రాకుమారి ముందు సంతోషం పట్టలేక చప్పట్లు కొట్టింది. ఆమె చప్పట్లు కొడితే అందరూ కొట్టాలిగనక ఆ పందిరంతా చప్పట్లతో మోగిపోయింది.

తరవాత మరుగుజ్జు నాట్యం చెయ్యటం మొదలెట్టాడు. వాడి వికృతపు చేష్టలు అందరికీ పొట్టలు చెక్కలయ్యేటట్టు నవ్వు తెప్పించాయి. రాకుమారి తనుచూసిన ప్రదర్శనాలన్నిటిలోనూ మరుగుజ్జు నాట్యమే బాగుందని నిశ్చయించుకుంది. నాట్యం పూర్తికాగానే తన తలలోని పూలచెండు వాడిమీదికి విసిరింది. వాడు దాన్నందుకుని ఒక మోకాలు వంచి నమస్కారం చేశాడు. మళ్ళీ చప్పట్లు మోగాయి.

రాకుమారికి ఈ లోగా మధ్యాహ్నపు భోజనంవేళ అయింది. దాసీలు వచ్చి ఆమెని తెరలచాటునుంచి కోటలోకి తీసుకుపోయారు. ఆ పందిరంతా ఖాళీఅయింది. కాని మరుగుజ్జుమాత్రం అక్కడే నిలబడి ఆ పూలచెండును వాసనచూస్తూ ఆలోచిస్తున్నాడు. వాడు చిన్నప్పటినుంచీ అడవుల్లోనే పెరిగాడు. వాణ్ణి కోయవాళ్లు పట్టుకుని కొన్ని విద్యలు నేర్పి గారడీకి ఉపయోగించుకుంటున్నారు. ఆ మరుగుజ్జుకి తను మరుగుజ్జు నన్న సంగతే తెలియదు



రాకుమారి తనమీద పూలచెండు పడెయ్యగానే వాడు "పాపం! రాకుమారి నన్ను చూసి ప్రేమించింది కాబోలు! ఆమెను నేను మళ్ళీ ప్రేమించకపోతే ఆమె విచారపడుతుంది." అనుకున్నాడు.

ఈ ఆలోచన రాగానే వాడు తనవాళ్లు పిలుస్తున్నా వినిపించుకోకుండా రాజుగారి తోటతలుపుల అడుగునుంచి దూరి లోపలికి వెళ్లాడు. సేవకులు అంతా రాజభవనంలో పనుల్లోమునిగి ఉండటంవల్ల మరుగుజ్జును ఎవరూ చూడలేదు. "పూలచెండు విసిరేసింది గనక పూలతోటలోకి నన్ను రమ్మని రాకుమారి అభిప్రాయమై వుంటుంది"అనుకున్నాడు మరుగుజ్జు. సంతోషంతో గంతులు వేసి పూలతోటలో తిరిగాడు. పువ్వులికి కూడా అసహ్యం వేసింది వాణ్ణి చూస్తే.

గులాబీపువ్వులు పక్కనున్న చేమంతిపువ్వులతో "చూశారా, యీ మరుగుజ్జుని. ప్రపంచంలో యింతకంటే వికారమైన ఆకారం ఉండబోదు" అన్నాయి.

మల్లెచెట్టు తన కొమ్మల్లో కూర్చున్న చిలకలతో "ఇంత అందమైన పూలతోటలోకి వీడు ఏ మొహంపెట్టుకుని వచ్చాడు? అరెరే! పొద్దునే నేను నాపువ్వుల్ని రాకుమారి కిచ్చాను. వీడు ఆ పువ్వుల్ని ఆమెదగ్గరినుండి దొంగిలించాడు. చూశారా!" అన్నది.

చిలకలు భయపడి "దొంగ! దొంగ!" అని అరుస్తూ తోటంతా తిరిగాయి.

మరుగుజ్జు రాకుమారి కివ్వాలని గులాబీపువ్వులు కొయ్యబోయాడు. "ఛీ, నీ చేతుల్తో నన్ను ముట్టుకోకు." అని గులాబిచెట్టు మరు

గుజ్జుని తన ముళ్లతో పొడిచింది. అయినా రెండుపువ్వుల్ని వాడు కోసి జేబులో దాచుకున్నాడు.

రాకుమారి వస్తానన్న ప్రకారం ఎంతసేపటికీ తోటలోకి రావటం లేదు. మరుగుజ్జు ఆగలేక మెల్లిగా తోట దాటి రాజభవనంలోకి ప్రవేశించాడు. వాడు ఎవరికంటా పడకుండా రాకుమారి వుండే లోపలి గదుల్లోకి దూరాడు. ఆ సమయంలో ఆమె భోజనశాలలో తండ్రిప్రక్కన కూర్చుని విందారగిస్తోంది.

మరుగుజ్జు ఒక గదిగుమ్మం బయట నుంచుని, "రాకుమారీ! నేను వచ్చాను. తలుపు తియ్" అని. గుసగుసలుగా పిలిచాడు. ఎవరూ జవాబివ్వలేదు. తలుపు తోసి చూడగా లోపల ఎవరూ లేరు. ఆ గది మహాద్భుతంగా వున్నది. అది రాకుమారి చదువు నేర్చుకునే గది. ఒక మూల వీణ, ఫిడేలు, కాలిగజ్జెలు మొదలైనవి వున్నాయి. ఇంకోచోట అందమైన పుస్తకాలున్నాయి. మెత్తటి ముఖమల్ తివాచీలు పరిచివున్నాయి.

"ఆహా! రాకుమారి ఎంత గొప్పయింట్లో వుంటోంది. ఆమెను పెళ్లిచేసుకున్నాక నేను కూడా ఎప్పుడూ యిక్కడే వుంటాను." అనుకున్నాడు. తివాచీలమీద పడుకుని కొంతసేపు దొర్లాడు. లేచి ఇంకోగదిలోకి వెళ్లాడు. ఆ గది యింతకంటే బావుంది. అది రాకుమారి పడకగది. "రాకుమారీ! నేను వచ్చా" అని పిలిచాడు. అక్కడ ఎత్తైన మంచం ఉన్నది. దానిమీద పడుకున్నదేమోనని మంచంకోళ్లమీదనుంచి పాకి ఎక్కాడు. బూరుగుదూదిపరుపుల మీద కాసేపు దొర్లి మళ్ళీ దిగాడు. ఆపక్కన ఇంకోగదిలోకి వెళ్లాడు. అది రాకుమారి స్నానాల గది. కొంచెం చిన్నది ఆ గది.

ఆ గదితలుపు తీసీతియ్యగానే మరుగుజ్జు గజగజ వణికి మూర్ఛపోయాడు. రెండునిమిషాల్లో తెప్పరిల్లి లేచాడు. మళ్ళీ ఎదురుగా చూశాడు. ఆ గోడదగ్గిర ఒకటిన్నర అడుగుల ఎత్తు మనిషొకడు నుంచున్నాడు. వాడు మనిషా, భూతమా? అబ్బ! ఎంత అసహ్యంగా వున్నాడు? సన్నటి చేతులు, కాళ్లు; దెయ్యమంత తలకాయ; దానిమీద పెద్ద తట్టలాగ తలపాగ; వంకర ముక్కు; మొహమంతా స్ఫోటకంమచ్చలు. ఆ వికృతాకారాన్ని చూసి భరించలేక పోయాడు మరుగుజ్జు. ఆ గోడదగ్గిర మనిషి తనకేసే చూస్తున్నాడు. తను నడిస్తే నడుస్తున్నాడు. కూర్చుంటే కూర్చుంటున్నాడు. చెయ్యెత్తితే చెయ్యెత్తి, నాలిక బయట పెడితే నాలిక బయట పెడుతున్నాడు. తనేదిచేస్తే అదే చేస్తున్నాడు. మరుగుజ్జుకి భయంవేసింది. అదేదో నిజంగా భూతమే. ధైర్యంచేసి దగ్గిరికి వెళ్లాడు. అదీ దగ్గిరికి వచ్చింది. తను వెక్కిరిస్తే అదికూడా వెక్కిరించింది. మరుగుజ్జుకి కోపం వచ్చి పిడికిలితో గుద్దాడు. అదికూడా పిడికిలి బిగించి గుద్దింది. చెయ్యి విరిగి కూలబడ్డాడు మరుగుజ్జు.

అప్పటికి తెలిసింది వాడికి ఆ ఎదురుగా వున్నది తనే నని, అది అద్దమని. ఈ సంగతి ఎప్పుడైతే తట్టిందో వాడప్పుడే నిలువునా వణికిపోయాడు. వాడింతవరకూ ఎప్పుడూ అద్దంలో తన్ను తను చూసుకోలేదు. తను యింత వికారంగా వుంటానని వాడికి తెలియదు. అందరిలాగానే తను పొడుగువాడిననీ, అందమైనవాడిననీ వాడి వుద్దేశ్యం.

నిజం తెలియగానే వాడు పెద్ద అరుపు అరిచి ఏడవటం మొదలెట్టాడు. తన్ను చూసి అందరూ నవ్వేదిందుకన్నమాట. తన అందవికారాన్ని చూసే రాకుమారి నవ్వింది. ఆమె తన్ను ప్రేమించిందనుకున్నాడు. తన అసహ్యపు చేష్టలు చూసి రాకుమారి వెక్కిరిస్తూ ఆ పూలచెండు విసిరింది; ప్రేమించి కాదు. ఆ పూలచెండును నలిపి పారేశాడు. అద్దంలోని మరుగుజ్జుకూడా అదే పని చేశాడు. మళ్ళీ వొక్కసారి తన ముఖం చూసుకుని ఏడుస్తూ కళ్లు మూసుకుని గది బయటికి వచ్చాడు. నాలుగడుగులు వేసి కూలబడ్డాడు.

మరి రెండునిమిషాలకి రాకుమారి విందు పూర్తిఅయి తన గదిలోకి వచ్చింది. మరుగుజ్జును చూడగానే ఆమె సంతోషంతో మళ్లీ చప్పట్లు కొట్టింది ఆమెవెంట నున్న దాసీలు "ఇదేమిటి! ఈ వెధవ ఇక్కడికి వచ్చాడు? ఎవరు రానిచ్చారు వీణ్ణి?" అని చీదరించుకుంటూ దగ్గిరికి వెళ్లి వాణ్ణి తట్టిలేపారు. వాడు లేవలేదు.

రాకుమారి "ఆ మరుగుజ్జును మళ్ళీ ఇందాకటిమల్లే నాట్యం



పెటియా ఎందుకు పడ్డాడు?

గోళ్లమూడి రామచంద్రరావు

నిజానికి పెటియా ఏమంత చిన్నవాడు కాదు. నాలుగేళ్లు నిండినయ్. కాని వాళ్లమ్మమాత్రం పెటియాని ఇంకా పసిపాపాయిని చూసినట్టే చూస్తుంది. చెంచాతో పాలు పడుతుంది. పళ్లు తనే తోముతుంది. నీళ్లు తనే పోసి, సబ్బు అరిగిపోయేట్టు రుద్ది, వళ్లు తుడిచి గుడ్డలు స్వయంగా తొడుగుతుంది. నడవలేడేమోనన్నట్టుగా చెయ్యి పట్టుకుని నడిపిస్తుంది.

ఒకరోజు పొద్దున పెటియా ఇంకా నిద్రలేవనేలేదు. వాళ్లమ్మ మంచంమీద నున్న వాడిని లేపకుండానే ఆదరాబాదరా చొక్కా-లాగూ ఎక్కించి అప్పుడు లేపింది, ఇంకా షోకు చెయ్యడానికి.

పెటియాని కిందకి దించి మంచం పక్కన నుంచోబెట్టింది.

కాని చిత్రం! పెటియా దభేలున పడ్డాడు.

నిద్రకళ్లతో వున్నాడో, లేక అల్లరిచేస్తున్నాడో నని ఆమె మళ్ళీ నుంచోపెట్టింది. పెటియా మళ్ళీ కిందపడ్డాడు.

దానితో ఆమెకు ఆశ్చర్యంవేసి, అయినా చూద్దామని మరోసారి నిలబెట్టింది. నిలబెట్టిందో లేదో పెటియా దభేలున పడ్డాడు.

దీంతో వాళ్లమ్మకి బలే గాభరా పుట్టింది. పెటియానాన్న పనిచేసే ఆఫీసుకు కబురు పంపించింది. "పెటియాకు ఒంట్లో బాగా లేదు. కాళ్లమీద నిలబడలేకపోతున్నాడు. అర్జంటుగా రావాలి." అని.

నాన్న ఇంటికి వొచ్చాడు. "నీ మొహం! వాడికి సుస్తీ యేమిటి? శుభ్రంగా వున్నాడు." అని భార్యతో అంటూ ఆయన పెటియాని నిలబెట్టాడు. పెటియా దూరాన వున్న బొమ్మని అందుకోబోయి మళ్లీ దభేలున పడ్డాడు.

వాళ్ల నాన్నకి గాభరావేసింది. "అయితే డాక్టర్ని తప్పకుండా పిలవ్వాలసిందే. పెటియా పంచదార మిఠాయి బాగా తినివుంటాడు. అందుకనే యిది వొచ్చింది." అని విసుక్కుంటూ వాళ్ల నాన్న డాక్టరుకోసం పరిగెత్తాడు.

డాక్టరు వొచ్చాడు. ముక్కు-చివర కళ్లజోడు, జేబులో 'స్టెతస్కోపు' గొట్టం పెట్టుకుని,

"ఏమిటోయ్, పెటియా! ఎందుకల్లా కిందపడుతున్నావ్" అని డాక్టరడిగాడు.

"ఏమోనండి, నాకు తెలియదు, నుంచోలేకపోతున్నానండి ఎందుకో." అన్నాడు పెటియా.

డాక్టరు పెటియాగుండెమీద 'స్టెతస్కోపు' పెట్టి పరీక్ష చేశాడు.

"అబ్బే. శుభ్రంగా వున్నాడు. జబ్బూలేదు, గిబ్బూలేదు. ఏదీ ఈసారి నిలబెట్టి చూద్దాం." అని

చెయ్యమనవే. బలేగా వుంది వాడి నాట్యం." అన్నది ఒక దాసీతో.

ఆ దాసీ అన్నది "ఇక వాడు నాట్యం చెయ్యడు."

"ఏం. ఎందుకని." అంది రాకుమారి.

"వాడి హృదయం రెండు ముక్కలై వుంది." అన్నది దాసీ.

రాకుమారి మొహం చిట్లించి విసుక్కున్నది. "ఇహనుంచీ హృదయంలేనివాళ్లతోనే నేనాడుకుంటాను. హృదయం బద్దలైందిట. ఎందుకూ హృదయం." అంటూ తోటలో స్నేహితుల్తో ఆడుకోవటానికి పరిగెత్తింది.

డాక్టరు పెటియాని మంచంమీంచి లేవదీసి నుంచోబెట్టాడు. పెటియాని బాగా చూడడానికి జారిపోతున్న కళ్లజోడుని ఎగదోసుకుని చూస్తున్నాడు. పెటియా మళ్ళీ ధన్‌మని పడ్డాడు.

డాక్టరుకూ కంగారు పుట్టింది. "పెద్దడాక్టర్ని పిలవాల్సిందే. వెంటనే కబురుపంపండి." అన్నాడు. నౌకరుకు చెప్పటానికి వాళ్ల నాన్న బయటికి వెళ్లాడు.

ఇంతలోకే పెటియా స్నేహితుడు, పొరిగింటివాళ్లబ్బాయి కోలియా వచ్చాడు. వచ్చి పెటియాని చూశాడో లేదో పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వాడు. వాణ్ణి చూసి పెటియా బయట ఆడుకుందామని లేచి వరిగెత్తబోయాడు. నుంచోటం తడవు మళ్ళీ పడ్డాడు.

"పెటియా ఎందుకు పడుతున్నాడో నాకు తెలుసు." అన్నాడు కోలియా.

"ఆ! చెప్పొచ్చావులేవోయ్. చిన్నపిల్లలు ఎందుకు పడతారో నాకన్నా బాగా తెలుసుట!" అని డాక్టర్ వెక్కిరించాడు.

"పెటియాకి పంట్లాం ఎల్లా తొడిగారో చూడండి. పంట్లాం ఒక్క కాలులోనే పెటియా రెండు కాళ్లూ ఇరికించారు." అన్నాడు కోలియా నవ్వుతూ.

అప్పటి కర్థమైంది వాళ్లకి అసలుసంగతి. దాంతో నవ్వుతూ గలభా చెయ్యటం మొదలెట్టారు. పెటియాకి తొడిగిన పంట్లాం కాళ్లలో ఒకటి రెండోదానిలోకి మడతపడివుంది. వాళ్లమ్మ అది తెలియక ఒక్కదాంట్లోకే రెండు కాళ్లనీ యిరికించింది.

"మా అమ్మే నాకు లాగూ తొడిగింది" అన్నాడు పెటియా.

"నే నెప్పుడూ నా బట్టలు నేను తొడుక్కుంటాను. అందుకనే నా కెప్పుడూ ఇట్లా జరగదు." అన్నాడు కోలియా.

"ఇకనుంచీ నాబట్టలు నేనే వేసుకుంటాను."

అంతా మళ్ళీ నవ్వారు. డాక్టరు అందరికన్నా ఎక్కువ నవ్వి, వెళ్లేటప్పుడు కోలియాకి షేక్‌హాండు యిచ్చి వెళ్లిపోయాడు. నాన్న ఆఫీసుకి, అమ్మ యింట్లోకి వెళ్లారు.

ఆ మర్నాడు పొద్దున పెటియా తన బట్టలు తనే వేసుకున్నాడు. మళ్లా అట్లాంటి ఇబ్బంది వాడి కెప్పుడూ రాలేదు. వాళ్లమ్మకూడా వాడి పనులు వాడే చేసుకోవటానికి ఒప్పుకుంది.

(మూలం : మైకేల్ జోషెంకో)



టామ్ సాయర్

(31-వ పేజీ తరవాయి)

తాయో చూడు." అన్నాడు టామ్.

"చేప లెవడి క్కావాలి. నా కింటికి పోవాలనుంది."

"ఈతకొట్టడానికి ఇంతకంటే మంచిచోటు ఇంకెక్కడా లేదు." అన్నాడు టామ్.

"నాకు ఈదాలని లేదు. 'వద్దురా, నీళ్లలోకి వెళ్లద్దు' అని కోప్పడేవాళ్లు లేకపోయింతరవాత ఈతకొట్టడంలో ఏమందం వుంది."

"పాపం, పాలుతాగే పాపాయి, ఇంటికి పోయి అమ్మని చూడాలనుంది." అని వెక్కిరించాడు టామ్.

"అవును, నాకు మా అమ్మని చూడాలని వుంది. నీకూ అమ్మ వుంటే నీకూ అల్లాగే వుండేది." అని కళ్లనీళ్లు తుడుచుకున్నాడు జో.

"సరే. పాలపాపని వాళ్లమ్మ దగ్గిరికి పంపించేద్దాం; ఏంరా హాక్! మన మిక్కడే వుంటాం కదూ!"

హాక్ సందేహిస్తూ "మ--రే--అవును." అన్నాడు.

"ఇక నేను బతికున్నంత కాలమూ నీతో మాట్లాడను." అని జో లేచి తన సామాను తీసుకున్నాడు.

"ఎవడికీ భయం! నువ్వు లేకపోతే మాకేం నష్టమూ? ఇంటికి వెళ్లు. అందరూ నిన్ను చూసి నవ్వుతారు. బలే సముద్రపు దొంగ దొరికాడు. హాక్, నేను పాపాయిలం కాదు. మే మిక్కడే వుంటాం, కదూ హాక్."

హాక్ మాట్లాడకుండా తల వంచుకున్నాడు. జో నిజంగా నే బయల్దేరాడు, ఇల్లినాయిస్ ఒడ్డు వేపు. జో కేసే చూస్తున్నాడు హాక్.

"టామ్, నాక్కూడా పోవాలనే వుందిరా. పద పోదాం."

"నేను రాను. మీరంతా వెళ్లిపొండి. కావలిస్తే."

"అయితే నేను పోతున్నాను."

"వెళ్లు. నిన్నెవరన్నా పట్టుకుని ఆపుతున్నారా."

హాక్ తన వస్తువులు తీసుకుని జోని వెంబడించాడు. టామ్ వాళ్లిద్దరికేసీ చూస్తున్నాడు. తన గర్వం దిగమింగి వాళ్లతో కలిసిపోవాలనిపించింది. వాళ్లాగుతారనుకున్నాడు. కాని ఆగలేదు.

చుట్టూ చూశాడు. చాలా గుబులుగా, ఒంటరిగా వుంది ఆ అడివి. గబుక్కున లేచి వాళ్ళకేసి పరిగెత్తుతూ,

"ఆగండిరా. మీతో ఒక మాట చెప్పాలి." అన్నాడు.

వాళ్లాగి వెనక్కి తిరిగారు. టామ్ వాళ్ళని కలుసుకుని తన మనసులో పొద్దుటినుంచీ దాచిన ఒక "రహస్యం" చెప్పాడు. వాళ్లు విని వినటంతోటే "బలే బలే" అని గంతులువెయ్యడం ప్రారంభించారు. ఈ రహస్యం ఇందాకనే చెబితే బయల్దేరేవాళ్ళమే కాదే, అన్నారు.

ముగ్గురుపిల్లలు సంతోషంతో తిరిగి తమ డేరాకి వచ్చారు. టామ్ ఇంత గొప్ప 'ప్లాను' ఆలోచించ గలిగినందుకు హాక్, జో అతన్ని పొగిడారు. మళ్లీ మంటచేసి చేపలు వండి భోజనంచేశారు. టామ్ తనకి చుట్ట కాల్చాలని వుందన్నాడు. జో తనుకూడా కాలుస్తా నన్నాడు.

హాక్ చుట్టలు చుట్టి వాళ్ళకి రెండిచ్చి తనొకటి వెలిగించాడు. టామ్, జోలు కందిపుల్లలలాంటివి వెలిగించి ఇదివరకు తాగేవారుగాని 'నిజమైన చుట్టలు' ఎప్పుడూ తాగలేదు.

కొత్తవాళ్లిద్దరూ చుట్టలు వెలిగించారు. వాళ్లకి చేతులు వొణుకుతున్నాయి; పొగ చాలా చాలా ఘాటుగా వుంది; మొదటిగుక్కతో ఉక్కిరిబిక్కి రయ్యారు.

కాని టామ్ అన్నాడు. "ఓర్నీ ఇంతేనా చుట్ట అంటే? చాలా తేలిగ్గా వుంది. ఇంత బావుంటుందని తెలిస్తే ఇదివరకే నేర్చుకునేవాణ్ణి."

"నేనూ అంతే. చుట్టలో ఘాటే లేదు." అన్నాడు జో.

"ఇదివరకు చుట్ట తాగ లేనేమో నని భయంవేసేది.

"నాకూ అంతే. కావలిస్తే హాక్ నడుగు. చుట్ట తాగాలని వున్నట్టు, కాని చాతవదేమో అనుకున్నట్టు వాడితో వందసార్లు చెప్పివుంటాను."

"అవును, చాలా సార్లు చెప్పావు." అన్నాడు హాక్.

"నేనూ చెప్పాను నాలుగు వందల సార్లు. కదురా హాక్. జ్ఞాపకం వుందా? మాంసంమార్కెట్టు దగ్గిర చెప్పలా? అప్పుడు బాబ్ టానర్, జానీ మిల్లర్, జెఫ్ థాచర్ కూడా వున్నారు." అన్నాడు టామ్.

"అవును చెప్పావు. నా తెల్ల గోలీకాయ పోయిన మర్రోజున. అహ కాదు, ముందురోజున."

"చూశావా, నేను చెప్పలా." అన్నాడు టామ్.

"రోజంతా నేను చుట్టలు కాల్చగలను. నాకు తలతిరగటం లేదు." అన్నాడు జో.

"నేను రెండురోజులపాటు వరసగా కాల్చగలను. కాని పందెం- జెఫ్ థాచర్ కాల్చలేడు." అన్నాడు టామ్.

"అబ్బే. అతను రెండు దమ్ములు లాగేటప్పటికి గిలగిల తన్నుకుంటాడు."

"జానీమిల్లర్ కూడా అంతే. ఒక్క గుక్కతో డోక్కుంటాడు." అన్నాడు టామ్.

"ఇప్పుడు వాళ్లు మన్ని చూస్తేనా, కుళ్లి కుళ్లి ఏడుస్తారు." అన్నాడు జో.


"ఇదిగో, మనం చుట్టనేర్చుకున్నట్టు ముందుగా వాళ్లకి చెప్పద్దు. వాళ్లు మనపక్కన వున్నప్పుడు నేను నీదగ్గిరికి వొచ్చి 'జో! ఏమన్నా సరుకు వుందా? తాజాది.' అంటాను. నువ్వు "రెండు చుట్టలున్నాయిగాని, తాజాచుట్టలు కావు" అంటావు. 'ఆ ఫరవాలేదు. ఘాటుగా వుంటే సరి.' అంటాను నేను. తరవాత యిద్దరం చుట్టలు వెలిగించి వెళ్ళిపోతాం. అప్పుడుంటాయి చూసుకో వాళ్ల మొహాలు."

"బలేగా వుంటుందిరా టామ్. అది ఇప్పుడు జరిగితే— క్చ్— "

ఈవిధంగా గొప్పలు చెప్పుకున్నారు వాళ్లు. కాని ఇంతలో ఒక తమాషా జరిగింది. కొత్తవాళ్ళిద్దరికీ ఉమ్ములు తెగ ఊరుతున్నాయి. నిమిష నిమిషానికి బుగ్గలు నిండిపోతున్నాయి. ఇప్పుడు ఉమ్మేస్తే మరుక్షణానికల్లా నోట్లో ఒక వరద తయారవుతోంది. ఎంత మింగినా ఆగటంలేదు. జో చేతిలోంచి చుట్ట జారిపడింది. దాన్ని చూసి టామ్‌చుట్టకూడా జారింది.

"నా చాకు ఎక్కడో పారేసుకున్నాను. వెతుక్కొస్తా నిప్పుడే." అని లేచి గబగబ బయల్దేరాడు జో.

"నువ్వు అటు వెళ్ళి వెదుకు. నేనిటు వెళ్ళి వెతుకుతాను. ఆ చాకు పోతే ఎల్లా?" అని టామ్‌కూడా గబగబ లేచాడు. ★



విహారు కోరుకున్నదే!

నైజాం ఆస్తివిలువ ఉజ్జాయింపుగానైనా చెప్పడానికి వీలుగాదని పార్లమెంటులో శ్రీ రాజగోపాలాచారిగారు ప్రకటించారు.

20-12-50

మావాడి గోరుచుట్టు

(16-వ పేజీ తరువాయి)

కష్టమేసింది. సోమయాజులు కొస్త తపా కాలంవాడు కొబట్టి "ఒరే యిది గోరుచుట్టూ కాదు వల్లకాడూ కాదు. మొన్న సింహాచలం వెళ్లినరోజు కొండ ఎక్కలేక నువ్వు దేముణ్ణి తిట్టివుంటావు. అపరాధ కానుక యిచ్చి దంపతులంగా కొండకు వస్తాం స్వామీ అని మొక్కుకో" అన్నాడు. అంతా గొల్లుమన్నారు. "అబ్బ మహేంద్రమణి వుంటే ఇట్టే తాకిస్తే అట్టే పోతుందిగదా?" అన్నాడు మూర్తి. "నువ్వు చదవటం రాళ్లనేగా ఈమాటు జాగ్రత్తగా వెతుకు" అన్నాడు రామం (మూర్తిది జియాలజీ గ్రూపులెండి).

ఇక మావాడు ఈ వేళాకోళాలన్నీ వినలేక "అబ్బాయ్! పిల్లికి చెలగాటం ఎలక్కి ప్రాణసంకటం. నాలుగురోజులనాడు ఆవగింజంత వున్నది, రెండోరోజుకి అనుముగింజంతయి, ఈరోజుకి కుడుమంతయిందే! ఇంక నాలుగోరోజుకి ఆనపకాయంతవుతుందేమో" అన్నాడు. "ఏమీ కాదులేరా అది గోరుచుట్టేను. నేడో రేపో చిట్లుతుంది" అన్నాను నేను. నిజమే డాక్టరు చేతే చీము తీయిచ్చేస్తే బాధ తగ్గుతుంది అన్నారు అంతా.

ఇంతా అక్కడకు వెడితే ఆయన శూలాల్లాంటి మాటలు చెవినిపడేశాడు- "నాయనా! ఇన్నాళ్ళు ఊరుకున్నాను. ఇక చెప్పక తప్పదు. ఇది అంత సులభమయినపని కాదు. ఇది ఒకవిధమైన అపాయపు కురుపు. దీనిని బహుజాగ్రత్తగా ఆపరేట్ చేయాలి. ముప్పైరూపాయలు ఫీజు" అన్నాడు. మావాడికి నోట మాట రాలేదు. మా కంతా గుండె గుభేలుమంది.

"మాశారా! మీ కంతనవ్వులుగా వుండింది. కొంపమీదికొచ్చింది. అపాయకరమట! ఏడీ ఆ సీతారాముడు? నేడో రేపో చిట్లుతుంది, ఎంచుకుంటూ కూర్చొమన్నాడు. వాడో తెలివితక్కువ దద్దమ్మ. పైగా ఆర్ట్సువాడు. వాడిని నమ్ముకుని కూచుంటే ఏం జరిగేదో! ఏమైనాసరే ఇంక ఒక్క క్షణం ఇక్కడ వుండను. మావూరు వెళ్తాను" అన్నాడు.

సరే మేముమాత్రం ఏమంటాం? పాపం వాడసలే అమాయకుడు. "నాన్నను స్టేషనుకు రమ్మని వైరివ్వండి" అన్నాడు. వాళ్లు నీకంటే గాభరాపడతారు. నీవు రైలెక్కినతర్వాత యిస్తాంలేరా అన్నాం. ఫోనుచేస్తే రైలు రెండుగంటలు లేటన్నారు.

ఈలోపల రామంగాడి ఫ్లాస్కులో కాఫీ, మూర్తిగారి చెంబులో మంచినీళ్లు, కురుంబవిలాస్‌నుంచి గారెలు, రావుగారి దగ్గర పాతపత్రికలు, నవలలు, కొంచెం వక్కపొడీ తెచ్చాం ప్రయాణానికి. ఓ దిండుమాత్రం కాలుపెట్టుకుందుకి ఇవతల వుంచి పక్క కట్టాం. ఇంటర్లో వెళ్లరా అంటే "ఆ యింటర్లోకూడా జనం వుంటారు, సెకండుక్లాసులోనే వెళ్తా" నన్నాడు. ఆశ్చర్యమేమిటంటే డాక్టరుగారి మాటలు విన్నప్పటినుంచీ వాడికి బాధ ఎక్కువయి, కాలు కదల్చలేకపోయాడు. బాబు బండితెచ్చేందుకీ వెళ్ళాడు. ఇంతలో రావు వస్తూ మాకేకుండా (హడావుడిలో ప్రభాకరానికి తీసిపోడు లెండి) వాడికాలు తన్నాడు. ఇంకేముంది అది కొస్తా పగిలి చీమూ రక్తం వచ్చేశాయి. "ఫరవాలేదురా గండం గడిచి గట్టెక్కేను" అన్నాడు మావాడు. "చాల్లే నీ మొహం గండమట గండం, గోరుచుట్టురా చిట్లుతుంది అంటే, ఆర్ట్సువాడు; కూసూ గుడ్డూ అని ఏమేమో అన్నావట. ఇప్పుడేమయింది" అంటూ ఓ అడుగు ముందుకేశాను. మేంమాత్రం చెప్పలా గోరుచుట్టు అని అంతా ముందుకు వచ్చారు. "ఏం లేదు. నా మనసులోనే మొక్కేశాను సింహాచలేశ్వరుడికి. అందువల్లే ఇలా జరిగింది." అంటూ తిరిగి గంతేశాడు సోమయాజులు. వచ్చిన బండివాడికి పావులా యిచ్చిపంపాం. అటు డాక్టరు నోట్లో, యిటు రైలువాడి నోట్లో కరకాయ పడింది. కాని మామాటే నిజమయినందుకు మా నోరు మాత్రం తీపుచేస్తాడులెండి పెళ్ళికో జయినా.


ఇప్పటికి ఎవరేనా హడావిడి చేస్తే "ఏమిట్రా ప్రభాకరం గోరుచుట్టులాగ చేస్తున్నావు" అంటాము మేము.

సినిమా

(26-వ పేజీ తరువాయి)

పాత్రకూడా ఉండటంవలన, హేమ పాత్రను సృష్టించుకున్నారు. కానీ ఆమెకు తగిన స్థానాన్ని సృష్టించలేకపోయారు. యీ పాత్రను తమ కథావస్తువుకు తగినట్టు మార్పు చేసుకోవటంలో తట్టుకోలేక పోషించలేకపోయారు. చంద్రసేనుడు హేమపాత్రల మధ్య సంబంధం అర్థంగాదు. పసువును కొంటే పలుపుకూడా వచ్చినట్లు చంద్రసేనునకు లీలతోపాటు, హేమనుకూడా కట్టబెట్టారు. అంతకుమించిన సంబంధం వారిరువురి మధ్యను ఉన్నట్లు తెరమీద ఏమీ కనబడలేదు. ఇలా పాత్రపోషణవిషయంలో సినేరియో రచయిత, మాటలు, పాటలు వ్రాసే కవి, ఎడిటరు, దర్శకుడు, శిల్పి మొదలైనవారిపై ఆధారపడి ఉంటుంది. ఆర్టు డైరెక్టరు కూడా యీ విషయంలో ఎంతో సహాయసంపత్తి కల్పిస్తాడు. కానీ అతని శిల్పంద్వారా పాత్రల శీలం వ్యక్తంచేసి పోషించాలంటే, వాటికి తగిన 'క్లోజప్' యిస్తేగాని ప్రేక్షకునికి చూపి సూటిగా వ్యక్తం చేయలేడు. కనుక తిరిగి మొదటి మెట్టు అయిన సినేరియో రచయిత చెయ్యి పడవలసిందే!

కనుక వీరందరూ ఒకేవిధమైన ధ్యాత వహించి, ఒకే దృక్పథంలో చూచి ఏకీభవిస్తే తక్క పాత్రపోషణ సర్వసమర్థనీయంగా ఉండదు. వీరందరి సమిష్టి సహకారంచేతగాని వారు చూపదలచుకున్న పాత్రలను సరిగా పోషించి వాస్తవికతను కల్పించి సూటిగా ఉన్నవి ఉన్నట్లుగా చిత్రించలేరు.





ఒక వూళ్లో ఒక రాజుగారుండే వారు. ఆ రాజుగారికి గులాబీ పువ్వులంటే యెంతో యిష్టం. కోటకు సమీపములో గొప్ప గులాబీతోట వేయించి ఆ తోట లోని పువ్వులు యెవ్వరూ కొయ్యకుండా చూస్తూవుండటానికై ఒక బంట్రోతును కాపలాపెట్టారు. రాజుగారు ఆ తోటలోనికి ప్రతి దినము వెళ్లి చూస్తుండేవారు. తోటమాలీలు ఆ తోటకు ఎరువు వగైరాలు వేసి జాగ్రత్తగా చూస్తూవుండేవారు. గులాబీతోట బాగుగా పెరిగింది. నిత్యము లెక్కలేనన్ని పువ్వులు పూస్తూవుండేవి.

ఒక దినమున బంట్రోతు పరధ్యానముగా వున్న సమయములో ఒక పల్లెటూరి బ్రాహ్మణుడు ఆ తోటకు వచ్చి మెల్లగా తోటలో ప్రవేశించి ఒక గులాబీపువ్వును కోశాడు. అప్పుడు బంట్రోతు చూచి ఆ బ్రాహ్మణుని పట్టుకొని పువ్వు యెందుకు కోశావని గర్జించి ఆ పువ్వు, బ్రాహ్మణుని చేతిలోనున్న రాగిచెంబును లాక్కుని బ్రాహ్మణుని వీపుమీద ఒక చరుపు చరిచాడు. బ్రాహ్మణుడు తన చెంబిమ్మని యెంత బతిమాలినను బంట్రోతు వినక బ్రాహ్మణుని అవతలకు గెంటివేశాడు. బ్రాహ్మణుడు చేసేది యేమీ లేక విచారముతో రాజుగారి కోటగుమ్మము వద్దకు పోయి రాజుగారితో తన వృత్తాంతము చెప్పుకోవాలని కాచుకున్నాడు.

రాజుగారు కొంతసేపటికి కోటలోనుండి గ్రామములోనికి షికారు వస్తుంటేగా బ్రాహ్మణుడు రాజుగారి గుర్రపు బండికి అడ్డుగావచ్చి "మహాప్రభో! నేనీరోజున పూజకొరకై దేవరవారి గులాబి తోటలోని ఒక పువ్వు కోశాను. అచ్చట కాపలా వున్న బంట్రోతు ఆ పువ్వును, నా రాగి చెంబును బలవంతముగా లాక్కొని నా వీపుపై గట్టిగా చరచి నన్ను గెంటివేశాడు. నేను తెలియక కోసితినని, పువ్వు తీసుకొని నా చెంబు నాకిచ్చి వేయమని యెంత బ్రతిమాలినా నా చెంబియ్యలేదు. నేను బీదబ్రాహ్మణుడను. దేవరవారు నా చెంబు నాకిప్పించి వేయుటకై ప్రార్థిస్తున్నాను." అని దీనముగా విన్నవించుకొన్నాడు.

రాజుగారికి దయగలిగి ఆ బ్రాహ్మణుని కోటలోనికి తీసుకొనిపోయి మంత్రిని పిలిపించి ఈ వృత్తాంతమంతా అతనికి చెప్పి బంట్రోతును పిలిపించి విచారణ చేయుమని ఆజ్ఞాపించారు. మంత్రి బంట్రోతును రప్పించి సంగతి అంతా అడిగి తెలుసుకొని రాజుగారివద్దకు వచ్చి బంట్రోతువలన యెంతమాత్రము తప్పు లేదని ప్రభువువారి కిష్టమైన గులాబి పువ్వును కోసినందుకై యీ బ్రాహ్మణునకు తగిన శిక్ష చేసినాడు అని చెప్పాడు. రాజుగారికి మంత్రిఉద్దేశ్యము నచ్చక యీ క్రిందివిధముగా తీర్పు చెప్పారు.

అభినవ త్రిశంకుడు

సాధారణంగా సభలను నిర్వహించే వాళ్లకన్నా, వినివెళ్లే వాళ్లలోనే ఎక్కువమంది తెలివి గలవాళ్లు కనిపిస్తారు. స్వరాజ్యమైదాన్‌లో బహిరంగ సభ జరుగుతున్నది. ఒక నాయకమ్మన్యుడు మూడుగంటలసేపు ఊకదంచి, అందరి ప్రాణాల్నీ తోడాడు. పత్రిక విలేకరిగా రావటంవల్ల నడిమధ్యలో లేచి రావటా

నః పలులేక అట్లాగే విన్నాను. సభ అయినతరువాత వెళ్లిపోతున్న జనంలో ఒకాయన బిగ్గరిగా, "ఏమిటీ సొద? మధ్యమార్గం మధ్యమార్గం అని గోల పెడతాడే కాని అది త్రిశంకు స్వర్గం అవుతుందని గమనిస్తేనా?" అని వ్యాఖ్యానించాడు.

నేను చటుక్కున ఆయనవైపుకి తిరిగి "త్రిశంకుమార్గం అని అనగానే సరా? రెండువిధాలయిన చెడుగుని తప్పించుకోవాలి కాని" అని అందుకున్నాను.

"స్వామీ! మీరేదో చెపుతున్నారు కాని త్రిశంకు స్వర్గం సుఖంగా ఉంటుందనుకున్నారా?" అన్నాడాయన నన్ను నిలవేసి.

అంగారకుడు

"ఉండదని మీవాదమా?" అని రెట్టించాను.

"ఉండదు. ముమ్మాటికీ ఉండదు. మీకు ఓపిక ఉంటే నావాదాన్ని వినాలని కోరుకుంటున్నాను. పత్రికలవాళ్లు—అందులోను విశ్వరూపం విలేకరి - తప్పకుండా తెలుసుకోవాల్సిన అంశం ఇది." అన్నాడాయన.

మళ్లీ మైదానంలోకి ప్రవేశించాము.

* * *

"అసలు తమరెవరు స్వామీ?" అని ప్రశ్నించాను.

"అభినవత్రిశంకుణ్ణి." అన్నాడాయన.

"దీని భావమేమి తిరుమలేశ?" అన్నాను నవ్వుతూ.

"ప్రభువుల ఉద్దేశంలో గుమస్తాలుగానూ, కమ్యూనిస్టులదృష్టిలో పెట్టె బూర్జువాలుగానూ, షావుకార్లదృష్టిలో బురదపూయించుకునే కన్స్యూమర్లుగానూ, నేలవిడిచి సాముచేసే రాజకీయ నాయకుల దృష్టిలో అతిప్రధానవర్గంగానూ, మితవాదుల దృష్టిలో ప్రధానమయిన అండగానూ కనిపిస్తూ ఉండే మనుషుల మందలో నేనొకణ్ణి."

"అంటే చాలా గొప్పవాళ్లన్నమాట."

"ఎందుకని?"

"యశోద దృష్టిలో గారాబాల కూచయ్యగానూ, కంసుడి దృష్టిలో మృత్యుదేవతగానూ, భక్తులదృష్టిలో భగవంతుడుగానూ, పూజార్లదృష్టిలో అల్లాటప్పయ్యగానూ కనిపించే శ్రీకృష్ణుడితో సమానులన్నమాట."

ఆయన పొట్టచెక్కలయేటట్లు నవ్వి, "బలే వ్యాఖ్యానంచేశారండీ" అన్నాడు.

"అది సరేకాని, ఇందాక 'మధ్యమార్గం' అని చెప్పినందుకు ఆయన పిలక లంకించుకున్నారెందుకు?"

"లేకపోతే, మధ్యమార్గానికి విడాకులిద్దామని అంతా అనుకుంటున్న రోజుల్లో ఈయన క్షోభయేమిటండీ?"

"విడాకు లిద్దామని అనుకుంటున్నది ఎవరు?"

"మాబోటివాళ్లం అందరమూ! మాకు వొచ్చే భత్యాలకూ, పెట్టుకునే ఆపేక్షలకూ తూగకపోతే యేం చేస్తాం?"

"రెండింటినీ సమన్వయించుకోటంలోనే ఉన్నది ప్రజ్ఞ."

"ఆ కబుర్లన్నీ అవతలపెట్టండి. ఇంతకీ మీరు చెప్పేది అట్లా సమన్వయించుకున్నట్లు నటించమనేగా? పత్రికలవాళ్లు ప్రజ్ఞ, ప్రభావం అంటూ ఏవో రాస్తారు. ఇంటిదగ్గరికి వెడితే. ఆడవాళ్లు 'ఎందుకొచ్చిన అధమ స్తపు బతుకులు? మింగ మెతుకులేదు మీసాలకు సంపెంగనూనె' అంటారు."

"మీరు చెప్పేదానికీ, దీనికీ సంబంధం ఏమయినా ఉన్నదా?"

"సంబంధం కాదు అసలు ఉన్న సంగతి అదే మధ్య తరగతివాళ్ల బతుకు మింగ మెతుకు లేదన్నట్టే ఉంటుంది."

"కొంచం వివరిస్తారా?"

"మా త్రిశంకు జాతివాళ్ల ఆదాయాలు మటుకు కార్మికుల జీతాలకు చేరువలోనే ఉంటయ్. అయితే జీవితాన్ని నడుపుకునే తీరుమటుకు పైతరగతుల్ని అనుకరిస్తుంది. నల్లవాళ్ళ జీతాలతో తెల్లదొరల స్టయిల్ వెళ్ళే ఆంగ్లో ఇండియన్ల మోస్తరుగా ఉంటారు. కాళ్లు బురదలోనూ, కళ్లు మబ్బుల్లోనూ ఉంటయ్"

"మరి ఉన్న ఆశయాలు అక్కర్లేదంటారా?"

"ఈవిషయములో బ్రాహ్మణుని తప్పు లేదు. తప్పంతా బంట్రోతుదే. ఎందుకంటే గులాబిపువ్వులను యెవ్వరూ కోయకుండా చూడటానికై బంట్రోతు నియమింపబడ్డాడు. ఈ బ్రాహ్మణుడు పువ్వు కోయువరకు అశ్రద్ధగా వూరకుండుట బంట్రోతుదే తప్పు. తెలియక కోసిన బ్రాహ్మణునిది తప్పు కాదు. కావున చెంబు తిరిగి బ్రాహ్మణున కిప్పించి కొట్టినందుకై ఆయునకి బంట్రోతుచే నాలుగు రూపాయి లిప్పించవలెను. మొదటిసారి తప్పుకనుక బంట్రోతును క్షమించవలెను" ఇట్లు చెప్పిన రాజుగారి తీర్పునకు మంత్రి ఆశ్చర్యపడి వెంటనే చెంబును నాలుగు రూపాయలును బంట్రోతు చేత బ్రాహ్మణున కిప్పించి పంపివేశాడు.

"కావాల్సిందే, అయితే వీలునిపట్టి చూసుకోవాలంటాను."

"అంటే మీ అభిప్రాయం ఏమిటి?"

"వీలుదొరికితే సావుకార్ల చంకకి ఎగబాకవొద్దని చెప్పను. కాని వాళ్లు నిర్లక్ష్యంగా ఉంటే పట్టుకుని పాకులాడొద్దని చెపుతాను."

"పాకులాడక ఏం చేయ్యమంటారు?"

"కింది తరగతితో చేతులు కలుపుతామని బెదిరించాలి"

"అంతేకాని కలవకూడదంటారు?"

"అవును మరి పైకి పోవాలన్న ఉద్దేశం పెట్టుకున్నప్పుడు కిందివాళ్ళతో కలిస్తే ఎట్లా? కింది తరగతివాళ్ళతో మన అవసరం ఎంతవరకన్నా అంటే, పైతరగతి వాళ్లని బెదిరించి పైకిపోయేవరకే"

"పై తరగతివాళ్లు అంత తెలివి తక్కువ వాళ్లా? మీ కల్లబొల్లి బెదిరింపుల్ని వాళ్లు కనిపెట్టలేరూ?"

"కొంతవరకు కనిపెట్టగలరు కాని పూర్తిగా తోసిపారేయలేరు."

"ఒక్క ఉదాహరణనయినా చూపించగలరా?"

"భేషుగ్గా! అమెరికన్ డాలర్ స్వాముల్ని చూడండి అంతకన్నా పైతరతిలో ఎవ్వరూ లేరుకదా! కాని అంత పెద్దవాళ్లనీ బ్రిటిష్ సోషలిస్టులు ఠకీమని బోల్తాకొట్టించారు."

"ఏం చేశారేమిటి?"

"ఏమున్నదీ? అసలునైనా వాళ్లెవరో గుర్తుపట్టాం, రష్యాతో చేతులు కలుపుతాం అంటూ చెపుతున్నారు. దానికి బెదిరిపోయి అమెరికన్లు డబ్బుని కురిపిస్తున్నారు."

"అయితే బ్రిటన్‌కి అసలు పోట్లాడాలనే ఉందంటారా ఏమిటి?"

"మలయావాళ్లనీ, ఈ జిప్టువాళ్లనీ అడగండి దానికిసమాధానం చెపుతారు."

"మరయితే ఈ బెదిరింపులు దేనికి?"

"అదే మా బ్రిటిషుల గొప్పదనం. స్వదేశంలో అధికారంలో నిలవాలంటే, ఏవో సంస్కరణలంటూ చేయాలి. కమ్యూనిస్టుల మోస్తరు దేశంలో పరిస్థితులను ఉల్టాసీదా చేయటం మాకు ఇష్టంలేదు. కాని సంస్కరణలుమాత్రం చేయకతప్పదు. వాటికి కావాల్సిన డబ్బు ఎక్కడినించి వొచ్చినాకు మా అభ్యంతరంలేదు"

"అందుకని?"

"అందుకని మా బ్రిటిష్ సోదరులు మలయానించీ, అమెరికానించీ డబ్బు తెచ్చి, ఏవో కుంభకోణం జరిపి అధికారంలో ఉంటున్నారు. దేశపరిస్థితుల్ని ఉల్టాసీదా చేయరు కనుక కన్సర్వేటివ్‌లు ఆక్షేపణ చెప్పరు. అయితే బయిటినుంచి డబ్బురాకపోతే ఇక్కడిమన సోషలిజం హుళక్కే."

"అంతేనంటారా?"

"కాకపోతే? మనదేశంలో గుమస్తాలు బతకటానికి జీతండబ్బులతో పాటుగా పొలాలమీది డబ్బుఅవసరమైనట్లుగా ఉంటుంది వాళ్లవ్యవహారం. బ్రిటిష్ సోషలిస్టులకీ, కన్సర్వేటివ్‌లకీ విదేశాంగ విధానంలో తేడాలేక పోవటానికి ఇదేకారణం"

"మనదేశానికి అన్వయించే ఉదాహరణ చూపిస్తారా?"

"తప్పకుండా! మన శాసనసభల్ని తీసుకోండి. అధికారం సంపాదించాలనుకునే సభ్యులు చేసేదేమిటి? అయినదానికీ, కానిదానికీ ప్రభుత్వపక్షాన్ని ఏకిపారేస్తారు. ప్రభుత్వంలోఉన్న వాళ్లకంటే తాము పెద్ద ప్రజాసేవకుల మన్నట్లుగా అడుగడుక్కీ విమర్శలూ, సవరణలూ, తీర్మానాలూ కురిపిస్తారు. ఈ ఊదర పడలేక, మొరిగే కుక్కకు బెల్లపు గడ్డపడేసినట్లు ఏదో పదవిని ప్రభుత్వం పడేస్తేచాలు. మళ్లీ కిమన్నాస్తి."

"మనదేశంలో మధ్యతరగతి బ్రిటిష్‌వాళ్లు వొచ్చిన తరవాత నేగదూ ఏర్పడ్డది?"

"పాపాలన్నిటికీ భైరవులు బ్రిటిష్ వాడేనా? ఇప్పటికి షుమారు 800 ఏళ్ల కిందట విజ్ఞానేశ్వరుడు అనే పెద్దమనిషి ఈ జాతికి విత్తనం వేశాడు."

"ఎవరాయన? మితాక్షర గ్రంథకర్త కాదు గదా?"

"ఆయనేస్వామీ! ఆ మితాక్షర గ్రంథకర్తే"

"అదేమిటండోయ్! అమితాక్షర చేశారు?"

"మరేమనమంటారు? ఆయన మితాక్షర న్యాయమంటూ పెట్టి ఆస్తి పంపకానికి శంఖుస్థాపన చేశాడు. దాంతో, ఒక్కొక్క తరమూ గడుస్తున్నకొద్దీ, ఆస్తి పంపిణీకి సంబంధించిన రాతకోతలు అమితంగా పెరిగిపోయినయ్‌కదా! ఇంత తతంగానికి కారణమయిన గ్రంథాన్ని ఏమన మంటారు?" అన్నాడాయన చిరునవ్వుతో.

"అట్లా ఆయన ఎందుకు చేశారంటారు?"

"విజ్ఞానేశ్వరుడు విక్రమాంకదేవుడనే చక్రవర్తి ఆస్థానంలో ఉద్యోగి. సామంత రాజుల, దండనాయకుల బలం తగ్గించే ఉపాయం చెప్పమన్నాడు. వాళ్ల ఆస్తులని విభజించటమేనని చెప్పి, విజ్ఞానేశ్వరుడు ఆ పుస్తకం రాసి పడేశాడు."

"అందులో తప్పేమున్నది?"

"అందులో ఏమీ లేదు. తరవాత వచ్చిన అజ్ఞానేశ్వరులు దానిని సన్నకారు జనాభాకి అన్వయించటంలో వచ్చింది తంటా."

"అది నిజమే. మరి బ్రిటిష్ హయాంలో ఈ తెగ ఎందుకు విజృంభించింది?"

"చేతిపనులమీద ఆధారపడే జీవితపద్ధతి పోయి, యంత్రాలపోటీ వచ్చింది. దాంతో సాంఘిక పరిస్థితి అంతా తలకిందులయి పోయి, అంతా సర్కారు ఉద్యోగాలకు ఎగబడ్డారు."

"మధ్యతరగతివాళ్ల జీవిత విశేషాలు ఏమిటి?"

"వొచ్చే జీతం చాలదు. ఎక్కువ అడగటానికి ఐకమత్యం లేదు. ఎప్పుడూ డబ్బుకి కిటకిటలాడుతూ ఉంటారు."

"మరి వాళ్ల ఆర్థికసమస్య ఎట్లా పరిష్కారం అవుతుంది?"

"అప్పుడప్పుడు లాటరీలోనో, పజిల్సులోనో బహుమానాలు రావాలి."

"అంతా సర్కార్ కొలువులకి ఎగబడితే, చాలినన్ని ఉద్యోగాలు ఉండవుగా?"

సర్కారుకి గుమాస్తాలు కావాలి. గుమాస్తాలను తయారు చేయటానికి ఫ్యాక్టరీలు- అంటే ఆర్ట్స్ కాలేజీలు- కావాలి. వీటినిండా కావలసినంతపని. అదీకాక అసలు వాళ్లు ఒక ట్రిక్కు చేస్తారు."

"ఏమిటండోయ్ అది?"

"ఒకళ్లు ముందు చేర్తారనుకోండి. నెమ్మదినెమ్మదిగా, నాగజెముడు కంప పెరిగినట్లుగా, ఏవేవో డిపార్టుమెంట్లనూ, ఉద్యోగాలను సృష్టించి, తమకుతోడుమరి కొంతమందిని చేర్చుకుంటారు. అంతా కలిసి, గంటలో ముగించేపనిని నెలరోజులు లాగి గారడీ చేస్తారు."

"ఆహా!"

"అంతేకాదు. దీనిలోదానినీ, దానిలో దీనినీ ఇరికించి వ్యవహారాన్ని పెగలనివ్వరు. వ్యవహారంతొందరగా పెగిలే తమలో కొంతమంది బయిటికి నడవాలిగాదే"

"అంతా ఏదో పద్మవ్యూహం మోస్తరు ఉన్నదే?"

"అవును. దాన్నే మీరు రెడ్ టేప్ అంటారు. ఇంత చేసినా అందరికీ ఉద్యోగాలు దొరకవు. అందుకనికమిటీల టెక్నిక్ మొదలు పెట్టారు"

"ఇదేదో కొత్తటెక్నిక్కే?"

"ఏదో ఒకవిషయంతీసుకు నేదీ, హడావుడి చేసేది, దానిని పరిశీలించటానికి కమిటీ వేయమనేదీ. ఆ కమిటీకి నాలుగు సబ్‌కమిటీలూ, పధ్నాలుగు స్పెషల్ సబ్‌కమిటీలూ ఏర్పడతయ్. విచారణలు, ఉపరి

విచారణలు, నివేదికలు, సవరణలు— ఈ విధంగా గ్రంథం పెరిగిపోతూ ఉంటుంది కాని వ్యవహారం మటుకు తెగలదు. నిజానికి ఈ కాలాన్ని కమటీల యుగం అనొచ్చు."

"నేలవిడిచి సాముచేసే రాజకీయ నాయకులన్నారేమిటి ఇందాక?"

"మాతరగతిని ప్రధాన తరగతి అంటారేమిటి మరి? ఎవరెన్ని చెప్పినా, మేము మధ్యలో ఊగులాడే వాళ్లమే. నిజానికి మమ్మల్ని డబ్బులేని షావుకార్లనాలి. జమీలులేని జమీందార్లనాలి. మా సానుభూతి, మా ఆలోచనలు ఎప్పుడూ అటే ఉంటయ్. అట్లాంటిది మేము ప్రత్యేకవర్గం ఎందు కవుతాం? పెద్ద తరగతిని లోగట్టుకోటం చాతకాక, కింది తరగతి విశ్వాసాన్ని సంపాదించలేక తిరిగే వాళ్లు మమ్మల్ని పట్టుకుని దేవుల్లాడతారు."

"అయితే ఇందాకటి ఉపన్యాసకుడితో మీ తగాదా ఏమిటి?"

"మధ్యమార్గం అన్నది లేదు. ఏ విషయానికి ఆ విషయాన్ని—పండిత నెహ్రూ చెప్పినట్లు—ప్రత్యేకించగానే నిర్ణయించాలి. ఉపన్యాసకుడు అసలు విషయాన్ని మరచిపోయినాడు."

"సరే; మతవర్గాలకు అండ అన్నారేమిటి?"

"కూలినాలిజనం తిండికి తిప్పలు పడాలి కనుక దేవుణ్ణి గురించి ఆలోచించే తీరికే లేదు - డబ్బుగలవాళ్లకు ఇష్టదైవం లక్ష్మీదేవే. కాబట్టి మామూలు మతం ఏదయినా తగాదా ఉండదు. ఇంకపోతే మిగిలేది త్రిశంకులు. వీళ్లకు ప్రస్తుత సామర్థ్యం లేకపోవటంవల్ల 'కోటయ మనవాడోయ్, వెంకటసుబ్బయ మనవాడోయ్' అంటూ తిరుగుతారు. వెంకటసుబ్బయాకూ, అబ్దుల్ రహీంకీ పడదుగదా!"

"దీని పరిణామం ఏమిటి?"

"పరిస్థితులు విషమిస్తే మధ్యతరగతివాళ్లు నాజీలుగా తయారవుతారు. ఇది పై తరగతులకీ, మధ్య తరగతికీ కూడా ప్రమాదకరం కాబట్టి సంఘ సంస్కారం, భరత నాట్యాలు, క్రికెట్ స్టేడియంలు పెట్టిమిగిలినవాళ్ల దృష్టిని మళ్లిస్తారు."

"అయితే మధ్యతరగతివాళ్లు ఏంచేయాలని సలహాఇస్తారు?"

"మీ ఇంట్లో కాలేజీలో చదువుకునే కుర్రాళ్లున్నారా?"

"ఉన్నారు."

"అయితే వాళ్లల్లో కొంతమందిని లేబర్ నాయకులుగా- నేను ఇందాక చెప్పినట్లుగా- తయారుచేయండి. కొంతమందిని ఏదో ఒకపార్టీలో ఇరికించి రాజకీయాల్లోకి పంపించండి. ఇంకా ఎవరయినా మిగిలితే, షావుకార్ల సెక్రటరీలుగా పంపండి. ఇంకరాజ్యంమీద కాకపోతే అడగండి.... అడుగో పార్కుకాపలా వాడు గేటువేయటానికి వస్తున్నాడు. అంటూ లేచాడు త్రిశంకుడు."

—

నేటిప్రపంచం:

ఆసియా దేశాల శాంతిసాధనకృషి

చీనాసేనలు

చీనా కమ్యూనిస్టుల 'స్వచ్ఛంద' సైనిక దళాలు ఉత్తర కొరియాలో సంపూర్ణ విజయాన్ని సాధించాయి. ముంగు వెనుకలు, రణరంగ ప్రాంత నైసర్గికస్థితి, సైనిక వ్యూహాలు, ప్రజాభిప్రాయం మొదలైన వేవీ చూసుకోకుండా, కేవలం విమానబలాలు, బాంబులు శకరకాల ఫిరంగులు అక్షయమైన మారణ యంత్రసామగ్రిపైనే ఆధారపడి ఉత్తర కొరియాలో యుద్ధానికి దూకి విజృంభించి నందుకుగాను అమెరికన్ సైన్యాలకూ తదితర సమితిసైన్యాలకూ ఘోరపరాజయం సంభవించింది. చీనాసేనలు ఉత్తరకొరియాలో దిగి ఒక్క యుద్ధంలో నిలిచి పోరాడామో లేదో, ముందూ వెనుకా చూసుకోకుండా సమితి సేనలు దక్షిణ కొరియాకు పారిపోయాయి. ఈశాన్యదిశలో హాంహుంగ్ వద్ద చక్రబంధంలో చిక్కుపడిన సేనలు నాశనంకాగా మిగిలినవి ఓడ లెక్కుతున్నాయి. పయంగ్ యాంగ్ నగరాన్ని నేలమట్టంచేసి పరుగు తీసిన అమెరికన్ సేనలు శత్రువు ఎంతదూరంలో ఉన్నాడో, వెన్నాడుతున్నాడో లేదో కూడా చూసుకోకుండా 38 వ అక్షాంశరేఖను దాటి వెళ్లి సోల్ నగరం చేరాయి. అంటే చాంగ్‌చున్ నది వద్ద యుద్ధం తరవాత, పయంగ్ యాంగ్ నగరంవద్ద స్వల్పసంఘర్షణ మినహా మరెక్కడా నిలిచి శత్రువుతో పోరాడాలనైనా అమెరికన్ సేనలకు తోచలేదు. చక్రబంధవ్యూహం పన్నడానికి చీనా సేనలు గుర్రాలపైన ఎంత వేగంగా వచ్చాయో, అంతకు మించిన వేగంతో సమితిసేనలు పలాయనం చేశాయన్నమాట. సోల్ నగరానికి వచ్చినతరవాత వెనక్కు తిరిగి చూసేసరికి చీనాసేనలు చూపు మేరలో కూడా కనిపించలేదు. తరవాత వారంరోజులకి గాని ఉత్తరకొరియన్ సేనలు చూపు మేరలోకి రాలేదు.

రాయబారం

ఇప్పుడు కొరియాయుద్ధంలో నే గాక సమితి రాజకీయాల్లో కూడా విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. చీనా సైన్యాల జోక్యాన్ని నిరసిస్తూ వెంటనే సేనల్ని ఉపసంహరించుకోవలసిందిగా పెకింగ్ ప్రభుత్వానికి ఆదేశమివ్వాలని అమెరికాతో సహా ఆరుదేశాలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమితి ప్రస్తుతానికి బుట్టదాఖలు చెయ్యడం జరిగింది. చీనాజోలికి పోమని వాగ్దానం ఇవ్వాలని కూడా ఈ తీర్మానంలో ఉంది. ఇది బుట్టదాఖలు కావడానికి బ్రిటిష్ ప్రధాని అట్లీ జరిపిన రాయబారం ఒక హేతువని చెప్పవచ్చును.

1941 లో చర్చిల్ రూజ్వెల్టువద్దకు రాయబారం వెళ్లి అట్లాంటిక్ చార్టర్ సాధించాడు. అమెరికా తన సమరబలాన్నంతా పసిఫిక్ ప్రాంతానికి ధారపొయ్యకూడదనీ యూరప్ సంరక్షణకు ప్రధానంగా వినియోగించాలనీ కోరాడు. అప్పుడు మొదటి అంశాన్ని సాధించలేకపోయినా రెండో అంశాన్ని సాధించగలిగాడు చర్చిల్. ఇప్పుడూ అదే జరిగింది. అమెరికా తన బలాన్నంతా పసిఫిక్ ప్రాంతానికి ధారపొయ్యదు. యూరప్ సంరక్షణనే ప్రధానంగా పరిగణిస్తుంది. అయితే చీనా చేసిన పరాభవానికి నోరు మూసుకుని కూచోడానికి ట్రూమన్ అంగీకరించలేదు. గాడిపొయ్యిదగ్గర కూచుని (ఫైర్ సైడ్) రేడియోద్వారా అమెరికన్ జాతికి ప్రమాదం ఆసన్నమయిందని ట్రూమన్ ప్రకటించాడు. 35 లక్షల అదనపు సైన్యాన్ని నిర్మించడానికి నిశ్చయించినట్లు ప్రకటించాడు.

విశ్వాసం

చీనా ప్రభుత్వాన్ని గుర్తించడానికి వీల్లేదని మొండిపట్టు పట్టి కూచున్న అమెరికా చీనాప్రభుత్వంతో ఎవరైనా మధ్యవర్తిత్వం జరిపేపక్షంలో కొరియాలో యుద్ధం విరమించడానికి సిద్ధమేనని ప్రకటించింది.

చీనాసేనల్ని 38 వ అక్షాంశరేఖని దాటనివ్వవద్దని ఆసియా దేశాలన్నీ ఏకమై (చీనా, సయాం, ఇజ్రాయిల్, టర్కీ మినహా) పెకింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. చీనా ప్రభుత్వం కాని, సమితికి వెళ్లిన చీనా రాయబార వర్గం గాని అపరబుద్ధావతారంలాగా విజ్ఞప్తికి సమాధానంగా ఒక్కమాటైనా పలకలేదు. చీనా సేనలు సరిహద్దు దాటి కొరియాలో సమితి సేనల్ని ఏమూలా ఉండకుండా తరిమివేస్తాయో, లేక ఉత్తరకొరియన్ సేనల్ని మాత్రమే పంపి యుద్ధాగ్ని ఆరిపోకుండా ఎగసం తోస్తూ ఉంటాయో ట్రూమన్, అట్లీలకిగాని, ఆసియా దేశాలకిగాని తెలియరాలేదు.

అయితే ఒక్కవిషయంమాత్రం తెలుసును. ట్రూమన్ అట్లీలు రాయబారాలు నడిపి చిట్టచివరికి చేసిన ప్రకటన బయటపెట్టిన పది అంశాల ఒడంబడిక యుద్ధనివారణకి తోడ్పడేదిమాత్రం కావు సమితి సేనల్ని తమంత తామై కొరియానుంచి తరలించకూడదని ఇద్దరూ నిర్ణయాని కొచ్చారు. అంటే కమ్యూనిస్టులు తరిమితే వెళ్లిపోతారన్నమాట. లేకపోతే దక్షిణ కొరియాలోనే పీఠం వేసుకుకూచుని ఎప్పటికప్పుడు విమానాల్ని పంపి ఉత్తరకొరియామీద బాంబువేస్తూ ఉంటారు. చీనా సేనలుకూడా దక్షిణకొరియా ప్రవేశించినట్లయితే సమితిలో ఆరుదేశాల తీర్మానాన్ని తవ్వితియ్యవచ్చును అప్పుడు బ్రిటన్ అమెరికాలంకు నిలబడి కమ్యూనిస్టులతో పోరాడగలదు.

ఫార్మోజా సమస్య, సమితి సభ్యత్వ సమస్యలలో చీనా కమ్యూనిస్టు ప్రభుత్వాధికారాన్ని ఆంగ్లో-అమెరికన్ వర్గం గుర్తించేవరకూ, వారెన్ని వాగ్దానాలు చేసినా చీనా విశ్వసించే స్థితిలో లేదు. ఈరెండింటి విషయంలోనూ ట్రూమన్ అట్లీ నిర్ణయాలు చీనాకు సుముఖంగా లేవు. చీనాలో కమ్యూనిస్టులకూ, చియాంగ్ సేనలకూ మధ్య అంతర్యుద్ధం జరిగినప్పుడు సేనల్ని పంపి స్వయంగా జోక్యం కలిగించుకోకుండా ఉండగలిగిన అమెరికా, ఫార్మోజావిషయంలో భిన్న విధానం అవలంబించడానికి హేతువు చీనాకి ఇంతవరకూ బోధపడలేదు.

ఆసియాదేశాలు


ఈ పరిస్థితిలో, యుద్ధం ఎలా తిరుగుతుందో కూడా ఊహించలేని స్థితిలో, యుద్ధవిరమణకోసం 13 ఆసియా దేశాలు సమితి రాజకీయసంఘంలో రెండు తీర్మానాల్ని ప్రవేశపెట్టాయి. ఈ వర్గానికి భారతప్రతినిధి బి. యన్. రావు నాయకుడు. కొన్ని షరతులపైన యుద్ధం విరమించడానికి చీనా సంసిద్ధంగా ఉందని పెకింగ్ ప్రతినిధి తెలియపరిచాడు. ఫార్మోజా నుంచి అమెరికన్ సేనలు విడిచివెళ్లడం, కొరియానుంచి సమితిసేనలు నిష్క్రమించడం, సమితిలో పెకింగ్ ప్రభుత్వానికి సభ్యత్వమివ్వడం మూడు ముఖ్యషరతులు. ఈషరతుల్ని అమెరికా అంగీకరించబోదు. ఈషరతులికి అంగీకరించకపోతే చీనా యుద్ధాన్ని విరమించదు.

రెండు తీర్మానాలలో మొదటిది యుద్ధవిరమణ సూచనల్ని ఏ ఆధారంపైన తయారుచెయ్యడమో నిర్ణయించాలనేది. రెండోది దూరప్రాచ్యంలో కల్లోలానికి హేతువైన సమస్యల్ని (అనగా కొరియా-ఫార్మోజా సమస్యల్ని) పరిష్కరించడానికి యత్నించడం. ఒక తీర్మానాన్ని ప్రవేశపెట్టవలసిన చోట రెండు తీర్మానాల్ని ప్రవేశపెట్టడం చీనాకు సందేహకారణమయింది. అమెరికా రెండుతీర్మానాల్ని అంగీకరించింది. కాని మొదటి తీర్మానం ప్రకారం యుద్ధ విరమణ ఒనగూడితే కమ్యూనిస్టు చీనాతో వ్యవహారం ముగిసిపోతుంది. రెండో తీర్మానాన్ని అమలు జరపవలసినప్పుడు పెకింగ్ ప్రభుత్వంతో నిమిత్తం లేకుండా చియాంగ్ ప్రతినిధినే తీసుకురావాలని అమెరికా పట్టుబట్టినట్లయితే ఏమవుతుంది? అదీ కాక ఫార్మోజా కొరియా సమస్యల పరిష్కారం సందర్భంలో అమెరికా వైఖరి మారలేదు సరిగదా. ట్రూమన్ - అట్లీల ప్రకటనని బట్టి చూస్తే అంతవరకూ వచ్చేసరికి బ్రిటన్ అమెరికానే బలపరుస్తుందని స్పష్టంగా తెలుస్తోంది. అంటే 13 దేశాల తీర్మానాన్ని ఆధారంచేసుకుని ఇప్పటికి యుద్ధంమాని, నెమ్మదిగా బలంకూర్చుకుని ఆపైన అమెరియుద్ధానికి మళ్లీ సిద్ధపడవచ్చునన్నమాట


అయితే కాశ్మీరంలోవలె ఒకపక్షం గెలుస్తున్నంతవరకూ ఊరుకుని, అది తారుమారై ఓటమి సంభవించినప్పుడు కమిషన్ ఒకటి నియమించి యుద్ధాన్ని ఆపుచేసి దుస్తంత్రాలు దీర్ఘకాలం నెరపుతుంటే ఊరుకోడానికి మావ్ సేటుంగ్ నెహ్రూవంటివాడు కాడు. మలయా, ఇండోచీనా, మొదలైన ప్రాంతాల వలసల్ని నిలబెట్టుకోడానికిగాను ఆసియావాసుల రక్తాన్ని ప్రవహింపచేస్తున్న యూరోపియన్ సామ్రాజ్యవాదుల స్వసంరక్షణకోసం పసిఫిక్ ప్రాంతంలో యుద్ధం సంభవించకూడదంటున్నారు. ఈ స్థితిలో ఆసియా దేశాల కోరికను చీనా మన్నించినా మన్నించకపోయినా, పసిఫిక్ ప్రాంతంలో శాంతిసంరక్షణకు ఈదేశాలపైన చీనా ఆధారపడ్డం అసంభవం. ఫార్మోజాఆక్రమణ అక్రమమని తెలిసికూడా అమెరికాను నిరోధించడానికి సమితిలోనైనా ఆసియా దేశాలు యత్నించలేదు. చీనా అమెరికాలమధ్య యుద్ధం వస్తుందంటే భయపడి, కొరియాలో అమెరికన్సేనల్ని రక్షించడంకోసం చీనాకు విజ్ఞప్తిచేసిన ఈ 13 ఆసియా దేశాలు వారించినా అమెరికా తన బాంబులతో ఉత్తరకొరియాను నేలమట్టం చెయ్యక మానలేదు. అమెరికా కాని బ్రిటన్ కాని ఫ్రాన్సుకాని మలయా ఇండోచీనాలలో రక్తపాతాన్ని నివారించవు. ఆసియా దేశాల మాటల్ని చెవినిపెట్టవు. 38 వ అక్షాంశరేఖను దాటవద్దని చెప్పినప్పుడు అమెరికా వినలేదు చీనాపై పగబట్టవద్దనీ, యుద్ధసన్నాహాలు మానమనీ చెప్తే అమెరికా వినే స్థితిలో లేదు. ఇంక యుద్ధవిరమణకోసం ఆసియా దేశాలు ప్రయత్నించడంలో అర్థమేమిటి? 13 దేశాల శాంతి సాధనకృషికి వెనుక సైనిక బలం కాని, రాజనీతి కాని, ఆసియాకు శాంతిని ప్రసాదించగల సూత్రంకాని లేవు. అందువల్ల ఈదేశాల సూచనప్రకారం నియమింపబడిన కమిషన్ (సమితి అధ్యక్షుడు ఇంతజామ్, బి. యన్. రావు, కెనడా విదేశాంగ మంత్రి పియర్సన్) ఉభయపక్షాల మధ్యనూ రాజకీయ దుస్తంత్రాలకు వినియోగపడవలసిందే కాని వాస్తవంగా మధ్యవర్తిత్వానికి ఉపయోగపడదు. చివరకు "దురాక్రమణపరులతో" రాయబారాలు నడిపినందుకు నిందకూడా తలొగ్గవలసి రావచ్చును.

నాలుగింతలు అయిదింతలు సైనికబలాన్ని అమెరికా పశ్చిమ యూరప్ దేశాలు సమకూర్చుకుంటున్నప్పుడు చీనా రష్యాలు చేతులు ముడుచుకునికూచోడం అసంభవం]

[సూర్యనారాయణ.



బొంబాయి బాలికల సమావేశంలో ఉపన్యాసం




1949 ఏప్రెల్‌లో నెహ్రూ లియాఖత్ ఒడంబడిక సందర్భంలో సమావేశం.

కర్మవీరుడు సర్దార్ పటేల్


(8-వ పేజీ తరువాయి)

పటేల్ వంటి కార్య ధురంధరుడు భారతదేశానికి చేయవలసిన సేవ ఇంకెంతైనా ఉన్నది. వృద్ధాప్యంలో కూడా పటేల్ యావచ్ఛక్తినీ దేశపరిపాలనకే వెచ్చించినాడు. బొంబాయివెళ్లే సమయంలో ఢిల్లీకి తిరిగిరానని పటేల్‌కు తెలుసును. జవహర్లాల్‌పైన అపారమైన భారం ఉన్నదని ఒకరితో అన్నాడు. అవసానదశ సమీపమైనదని తెలిసినా నెహ్రూ ప్రభృతులకు ఆశ అనేది అంతరించలేదు. అదిసహజమే. కాని అప్పుడే దేశం పటేల్ అంతిమ యాత్రకు వీడ్కోలు ఇవ్వక తప్పలేదు.


[సీతారామ్.]



సర్దార్ పటేల్ అంతిమయాత్ర



సర్దార్ పటేల్ ను కడసారి దర్శించిన పండిట్ నెహ్రూ.



సర్దార్ పటేల్ భౌతిక దేహాన్ని విలీనం చేసుకున్న చితావహ్ని

Regd. No. M. 4479



★

కళాప్రపూర్ణ

కీ॥ శే॥

కాశీనాథుని నాగేశ్వరరావుగారి

ఉత్కృష్టరచన

ఆంధ్రవాఙ్మయ చరిత్ర

శాస్త్రపద్ధతిని, సంగ్రహరూపంలో నడిచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయ తంత్రకు విశుద్ధదర్పణం. పాతచరిత్రల నన్నిటిని అవలోడన చేసి, సమన్వయించి క్రోడీకరించిన సిసలయిన చరిత్ర.

శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండి ఉండి, నన్నయధర్మమా అని ఒక్క ఊపున దివ్యాకారంతో బైటపడి, నానాటికి నవనవోజ్జ్వలంగా వికసించిన మన వాఙ్మయం పోయిన పలుపోకడలను పోడిమితో చూపెట్టజాలిన ఉత్తమగ్రంథం.

వెల రూ. 2-0-0 తపాలాఖర్చు **0-7-0**

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు 212, మదరాసు 1.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, [illegible] St, Madras